గృహలక్ష్మి

స్త్రీల ఆరోగ్యసౌభాగ్యములను పెంపొందించుట
కేర్పడిన సచిత్ర మాస పత్రిక

సంపాదకుఁడు

డాక్టరు. కే. యన్. కేసరి

సంపుటము ౭.]   ఫిబ్రవరి 1935   [సంచిక ౧౧

Printed at Lodhra Press, Egmore, Madras.

గృహలక్ష్మి

సాలుచందా మొదలగునవి

ఈసచిత్రమాసపత్రిక సాలుచందా రు. 4. అర్ధ సంవత్సరపుచందా రు. 2. అంతకుతక్కువకాలపరిమితికి చందాపద్ధతి లేదు. విడికాపీ రు. 0-6-0 అణాలు. చందాదారులు ఏమాసమునుండియైన ప్రారంభము చేయవచ్చును. విడికాపీలు వలయువారు వానివిలువ మేరకు తపాలబిళ్లలు పంపవలయును. వీ. పీ. పద్ధతి వ్యయమూలకము.

ప్రకటనరేట్లు

ముఖ్యముగా స్త్రీలకందీయవలసినవస్తువులనుగూర్చి ప్రకటించుట కీపత్రిక ఎంతయు అనువైనది. ఉంచబడినరేట్లుఇవి: ఒకేతూరికి పూర్తిపుటకు రు. 15 0 0 అరపుటకు రు. 10 0 0 కాలుపుటకు రు. 7 0 0. ప్రకటనఛార్జీలు ప్రతిమాసము ముందుగానే చెల్లింపవలయును. అర్ధసంవత్సరము అంతకుపైబడినకాలములకు కంట్రాక్టుతీసికొనుచో నూటికి 12½ తోసివేత. కాలుపుటకు తక్కువయైనప్రకటనలు చేరోనజాలము. ప్రత్యేకస్థలముల రేట్లకొఱకు వ్రాయునది.

ఏజెంట్లు

వేఱొకపుటయందు మాకు ఏజెన్సీలుగలతావులు ప్రకటింపబడినవి. ఇతరతావులయందు మాకు ఏజెంట్లు కావలయును. వివరములకువ్రాయునది.

వ్యాసములువ్రాయువారికి

వ్యాసములు స్త్రీజనములకు సంబంధించియుండవలయును. సంగ్రహముగనుండిన శీఘ్రప్రచురణకు వీలగును. కాగితమునకు ఒకేతట్టు సిరాతో వ్రాయవలయును. ప్రచురింపబడనివ్యాసములు తపాలాబిళ్లలు పంపిన వాపసుచేయబడును. వీనినిగూర్చి ప్రత్యుత్తరములు పెంచకుండుటలెస్స. విమర్శనార్థము పంపబడు గ్రంథములను, ప్రచురణార్థము పంపబడువ్యాసములను అందుకొనుచు ఈవలకు వ్రాయుచుండినరీతిని ఇక కార్డులువ్రాయజాలము. రిప్లయికార్డువ్రాసిననే జవాబుఈయబడును.

సంచికలుచేరనిచో

సంచికలుచేరనిచో ఆయామాసములందు వెంటనే మాకు తెలుపవలయును. ప్రతిమాసము 7-వ తేదీతరువాత చేరలేదనివ్రాయుచో తిరుగకాపీలుపంపజాలము. చిరునామామార్పును తెలుపకుండుటచే కాపీలుచేరనివారికిని తిరుగ పంపజాలము. సంచికలు చేరనివారు తమతమ పోస్టాఫీసులలో కంప్లెయింటును చేయునది.

చిరునామామార్పు

చిరునామాయందుమార్పుఉండుచో 1-వ తేదికి 10 దినములుముందుగనే తెలుపవలయును. ఇట్లుతెలుపనిచో కాపీలు తిరుగ పంపజాలము.

చందాముగిసిన

చందా ముగిసినతోడనే ఆవిషయము వారికి ఆయామాసములయందు తెలుపబడును. ఈసూచన చూచి తమచందాధనమునుపంపి గృహలక్ష్మిని యథారీతిని పోషింప చందాదారులనుప్రార్థింతుము. చందాదారులుగనుండ ఇష్టములేనిచో ఆసంగతి వెంటనే తెలుపగలరు. మనియార్డరుపంపుటగాని, చందాదారులుగనుండ ఇచ్ఛగింపమని లేఖాముఖమున తెలుపుటగాని చేయనిచో, తరువాతసంచిక వీ. పీ. గా పంపగలము.

ముఖ్యమైనగమనింపు

చందాదారులుగచేర్చుకొనుమని వ్రాయుఉత్తరములు, బ్యాంకుచెక్కులు, మనీయార్డర్లు, పోస్టలు ఆర్డర్లు, గృహలక్ష్మికిసంబంధించిన ఇతరమైన యావత్తుఉత్తరములు డాక్టరు కే. యన్. కేసరి, ఎడిటరు, గృహలక్ష్మి, పోస్టుబాక్సు 752, ఎగ్మూరు, మదరాసు అను చిరునామాకేవ్రాయవలయునుగాని ఇతరవ్యక్తుల పేర ఎంతమాత్రముపంపకూడదు.

మీ భవిష్యత్తును

ది డెక్కన్ అస్యూరెన్సు కంపెనీ,

(లిమిటెడ్) నందు

భీమా చేసికొనుడు

ప్రీమియములు స్వల్పములు

పద్ధతులు ఆకర్షణీయములు, నవీనములు

పోల్చరాని ఎందునులేని సౌకర్యములు

బోర్డు అధ్యక్షులు

శ్రీ రాజా నాయని వేంకటరంగారావు బహదూరు, మునగాల జమీందారు

స్త్రీల అడ్వైజరీబోర్డు

శ్రీమతులు డా. ముత్తులక్ష్మిరెడ్డి, ఆచంట రుక్మిణిలక్ష్మిపతి,

అమ్ముస్వామినాధనుగార్లు

అన్నిచోట్ల విద్యావతులగు స్త్రీలు తమ కాలమును వృథాపుచ్చక మా కంపెనీఏజన్సీతీసుకుని పనిచేసిన స్వలాభమును పొందుటేగాక ప్రజలకు అందు ముఖ్యముగా స్త్రీలకు ఎక్కుడులాభమును చేకూర్చినవారగుదురు. సంకోచింపక కృతనిశ్చయులై నేడే యిక్కార్యసాధనోపాయముల నరయుటకు మాకు వ్రాయుడు.

ఆంధ్రుల సౌకర్యమునకై ఉత్తర ప్రత్యుత్తరములు తెలుగుభాషయందు కూడ జరుపబడును

బ్రాంచిఆఫీసులు:—	హెడ్డాఫీసు:—
మద్రాసు,	మునగాలభవనము
బెంగుళూరు, హైదరాబాదు (డక్కన్)	బెజవాడ

క్రొత్తసంవత్సరము

క్రొత్తపాకింగు

క్రొత్తనిబంధనలు

నేరుగా వ్రాయుఁడు

కేసరికుటీరం, ఎగ్మూరు, మదరాసు.

గృహలక్ష్మి ఏజెంట్లు

బాపట్ల: ఎల్. వి. మనోహరరావు.
తెనాలి: కొమ్మూరి కాశీవిశ్వనాథంగారు, సోల్ రిప్రజంటేటివ్ ఆఫ్ న్యూస్.
మచిలీపట్టణము: ఎస్. బి. లింగమ్, చీఫ్ ఏజంటు.
హైదరాబాదు: ఎన్. లక్ష్మీబాయిగారు, సుల్తాన్ బజారు.
నిడదవోలు: తాడిమేటి కుటుంబశాస్త్రిగారు.
తాడేపల్లిగూడెం: కాశిరాజు శ్రీరాములుగారు. [లిమిటెడ్.
జెమ్‌షెడ్‌పూర్: టి.వి. రమణయ్యగారు, C/o ది ఇండియన్ హ్యూమ్‌పైప్ కంపెనీ,
బరంపురం: ఎన్. కె. మూర్తి అండ్ సన్స్.
గుంటూరు: వెల్‌కం అండు కంపెని. మైసూరు: స్టూడెన్ట్సు హాలు.
సామర్లకోట: ఆరాధ్యుల మూటయ్యగారు, మర్చంటు.
పిఠాపురం: ఎం. నూకరాజు, ఆంధ్ర న్యూస్ ఏజెన్సీ.
రాజమండ్రి, విశాఖపట్టణం: ఎ. కృష్ణమూర్తి బ్రదర్సు.
మదరాసు: వై. నారాయణగారు, 364 ఎస్ప్లనేడు.
బెంగుళూరు కంటోన్మెంటు: ఆనందా బుక్ డిపో. ఏలూరు: బి. విశ్వనాథంగారు.
తణుకు: నడింపల్లి సూర్యనారాయణగారు, న్యూసుఏజంటు.
బెజవాడ: ఆంధ్రా ఇన్‌డస్ట్రియల్ స్టోర్సు, బకింగుహామ్‌పేట.
ఒంగోలు: తాతా జాలయ్యశెట్టిగారు, వర్తకులు.
రంగూను: వి. భగవతిశాస్త్రిగారు, న్యూసుఏజెంటు 244 ఫేర్ వీధి.
చిత్తూరు: వాటంబాటి వెంకటరమణయ్య శెట్టిగారు 163 బజారురోడ్డు.
విజయనగరం: ఇవటూరి సుందరశివరావుగారు.
నరసాపురం: వై. సత్యనారాయణగారు. [షాప్స్.
ఖరగ్‌పూర్: పి. వి. రమణయ్య, స్టోర్స్‌క్లర్క్, బి. ఎన్. ఆర్ వై. వర్క్
కొవ్వూరు: కె. సి. చెన్నకేశవయ్యర్. గూడూరు: సి. సి. సుబ్బయ్య, మర్చంటు.
కాకినాడ: నున్నా బాలకృష్ణరావు, న్యూస్‌బాయ్ అండు కో.
అనకాపల్లి: సివాజీ న్యూస్ ఏజన్సీ.
నెల్లూరు: సి. సుబ్బరావు అండు సన్సు.
భీమవరం: వంగల అచ్చుత రామయ్య, మేనేజరు నెహ్రూ ఖద్దర్ స్టోర్సు.
గుడివాడ: శ్రీ శివరామ అండు కో.
తిరుపతి: వై. వి. సుబ్బయ్య అండు కో.

హిగిన్‌బాతమ్ స్టాలులవద్ద దొరకును.

ఇతరచోట్లకు ఏజెంట్లు కావలెను. వివరములకు దరఖాస్తు పంపుకోనుడు.

బాలపాపలే దంపతుల ప్రేమబంధము

స్త్రీకి మాతృస్థానము గౌరవప్రదము. ఆమెకు గృహాయాజమాన్యము లభించును. ఆత్మానందము కలిగించును. భర్తకు తనయెడల భక్తి ప్రేమ భావములు దినదిన మభివృద్ధినందును. దీని కంతటికిని కారణము?

మాతృత్వమే!

మాతృత్వమునకై ప్రతి స్త్రీయును ఆసగొనును. ముద్దుబిడ్డను కరకమలములం దిడుకొని ఆడించు తలంపు స్త్రీకి యెక్కుడు.

స్త్రీకి లభించవలసిన యీ మహోన్నత స్థానమునకు ఆటంకములను కల్పించు గర్భాశయ రోగములను దూరముచేయవలయును. ఇందులకు లోధ్ర సేవనమే రాజమార్గము.

లోధ్ర

వనితల ఋతుదోషాది రోగములకు వజ్రాయుధము.

లోధ్ర మెల్లెడల దొరకును.

కేసరికుటీరం, ఎగ్మూరు, మదరాసు.

రామప్రియ

గ్రంథకర్త: 'కోటీశుతనయ'ను వ్రాసిన

తాత. కృష్ణమూర్తి, బి.ఏ; యల్. టి.

ఇది సులభశైలిని వ్యవహారికభాషలో వ్రాయబడిన స్వతంత్ర కల్పనాకథల పుస్తకము. డాక్టర్ బుర్రా శేషగిరిరావు (ఎం.ఏ; పి. హెచ్.డి) గారి పీఠిక కలది. క్రౌన్ సైజు. వెల 12 అణాలు.

"...ఈ మనోహరగ్రంధము భాషాసతి కొక మండనమనుట నిక్కువము." —గృహలక్ష్మి.

"...హాస్యరసగర్భితము." —వినోదిని "...కథలు మిక్కిలి ముచ్చటలూరుచున్నవి."—భారతి.

"...కథలలోన హద్దుమీరని స్వేచ్ఛయొక్క ఛాయలు చిత్రింపబడినవి." —ఆనందబోధిని.

చిరునామా: తాత కృష్ణమూర్తి, భద్రాచలం.

ఆధునికాంధ్ర వాఙ్మయము

సుప్రసిద్ధ నవలారచయితలగు శ్రీ కర్లపాలెం కృష్ణరావుగారిచే నూత్నభావములతో క్రొత్తపోకడలతో వింతరుచులతో మృదుమధురశైలిలో వ్రాయబడి అసమాన ప్రఖ్యాతిగాంచిన గ్రంథరాజములు.

1. ప్రణయసామ్రాజ్యము (విదేశములందు గూడ గొనియాడబడినది)	1	8	0	5. మతసేవ (క్రొత్తఫక్కి నాటకము)	1	0	0
2. హైమవతి (సాంఘిక నవల)	0	12	0	6. ఆంధ్రరత్నస్మృతి (పద్యకావ్యము)	0	2	0
3. హత్యావినోద్ (డిటెక్టివ్ నవల)	0	12	0	7. దస్తావేజుల మతలబు (ప్రజాసామాన్యమున కత్యవసరమైనది)	0	12	0
4. విద్యార్థి విపత్తు (విద్యార్థులకొఱకు)	0	12	0				

N. B.—గృహలక్ష్మి చందాదారులకు మాత్రము సగమువెలల కీబడును.

వలయువారు యీదిగువ చిరునామాకు వ్రాయవలెను:—

కర్లపాలెం కృష్ణరావు, చీరాల, గుంటూరుజిల్లా.

మీ అచ్చు పనులయందు:

మీకు కావలసినది అందమగు కూర్పులా? లేక చిన్న పనియైనను బాగుగ చేయుటయా? లేక సకాలమునకు ముద్రించి యిచ్చుటయా?

మీ అవసరము లేవియైనను, మీమీ అచ్చుపనులను మేము చక్కగ చేయగలమని మీ అనుభవమే తెలియజేయగలదు. ఒకమారు పరీక్షింపుడు!

లోధ్ర ముద్రణాలయము

తపాలపెట్టె 752, ఎగ్మూరు.

మదరాసు.

పఠానుల బలపరాక్రమము

కాశ్మీరపుకీళ మీకు కావలయును

మానవులందరును బలిష్ఠముగను దార్ఢ్యము గను జన్మింపరు. కాని శరీరమునుపట్టి పీడించే నిస్సత్తువను నిర్మూలించి నిగనిగలాడు దేహముతో నిండు ఉత్సాహముతో అవయవముల పుష్టితో హాయిగానుండు టవసరము. అది మానవుని జన్మహక్కు. అందులకై ప్రతి ప్రాణియు ప్రయత్నింపవలయును.

దేహమందు రక్తము—నిష్కళంకమగు ఉష్ణ రక్తము ప్రవహించుచో దేహమునకు ఆరోగ్యము, ప్రాణికి ఆనందము, జీవితముయెడల ఉత్సాహము ఉండగలదు. జీవాధారమగు ఉష్ణరక్తమును వృద్ధిచేయుటకు సాధనము అమృతకంటె వేరులేదని చెప్పకతప్పదు. శుష్కించిపోయిన మానవుని మన్మధునిగ చేయును. పిరికివానిని పరాక్రమునిగ మార్చును. మందబుద్ధిని బుద్ధిమంతుని చేయును.

అమృత

రక్తశుద్ధి ద్రావకము

రక్తహీనత, మలబద్ధము, అజీర్ణము, కీళ్ళనొప్పులు, సోమరితనము, మేహవ్రణములు, సుఖసంకటములు, నిస్సత్తువ, కడుపులోమంట మొదలగు వ్యాధులను నివారించి శరీరమునకు కాంతిని, ముఖమునకు తేజస్సును ఇచ్చును. ఈ మేలైన యౌషధమువలన నెందరో ఆరోగ్యవంతులైనారు.

12 ఔ. రు 3.   6 ఔ. రు 1—10 లు.

అమృత యెల్లడల దొరకును.

కేసరికుటీరం, ఎగ్మూరు, మదరాసు.



పారిస్

ముత్యాలహారాలు

అసలు మంచిముత్యాలలాగున చాలాకాలం
చెడిపోకుండా వుండేదిన్నీ, కాంతి, తళతళ,
అందం, గట్టితనం మొదలైన వానిని
పొందియున్నట్టిదిన్నీ, నెం. 1, 2, 3
సైజులలో నూలుతో అమర్చిన
హారము 1-కి

రూ. 1-0-0

వెండి తీగెతో సమర్చిన హారము 1-కి

రూ. 2-8-0

ముత్యాలు, చిన్నవి, పెద్దవి, అన్నిసైజుల
లోను దొరకును,

ప్యాకింగ్, తపాలాచార్జీలు ప్రత్యేకం

పి. గోపాలస్వామి నాయుడు
అండ్ సన్సు

కర్మాగారము :
పరంగిమలై పోస్టు,
మదరాసు.

బ్రాంచి ఆఫీసు :
234, గోవిందప్ప నాయక్ వీధి,
మదరాసు.

ప్రకృతిశోభ ధ్వంసమైనది!

వృక్షాలు వ్రేళ్లతో కూలినవి
నదులు బుసబుస పొంగినవి
ఇండ్లు పగిలినవి
భూమి బీటలు పడినది

అది భూకంపము!

ఆరోగ్యము ధ్వంసమైనది!

చలి గజగజ వణకించినది
ఉష్ణము బుసబుస పొంగినది
ఉదరమున బల్ల పెరిగినది
పైత్యము ప్రశాంతతను
తలక్రిందులు చేసినది.

అది జ్వరము

విషజ్వరము

రెండును ప్రమాదములె—భూకంపములకు విరుగుడులేదు
కాని జ్వరములకు మాత్రము విరుగుడు అర్క వున్నది.

అర్క

(సర్వజ్వర నివారిణి)

అన్ని మందులషాపులలోను దొరకును

కేసరికుటీరం, ఎగ్మూరు, మదరాసు.

విషయసూచిక

ఎటువంటివిద్య ? 863
స్త్రీవిద్య—జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారు, ఎం. ఏ. బి. యల్. ... 869
పుత్రవాత్సల్యము—శ్రీమతి న్యాయపతి మంగమ్మగారు ... 871
శ్యామల పెండ్లి—శ్రీమతి మల్లంపల్లి బాలాత్రిపురసుందరమ్మగారు ... 877
సరస్వతి—పుష్పావతి—శ్రీమతి ఆచంట సత్యవతమ్మగారు ... 880
దాంపత్యము—భారతము 884
మార్పులమంగ—శ్రీమతి కూనిశెట్టి రామరత్నముగారు ... 885
జాతకాల వెఱ్ఱిగురించి—'అనసూయ' 890
ప్రైవేట్ ట్యూషను—నడుగు—తాత కృష్ణమూర్తిగారు బి.ఏ; యల్.టి. ... 896
స్త్రీలు—గురుకులములు—బుర్రా వెంకటసుబ్బారాయుడుగారు ... 902
అందంలోని ఆరాటము—శ్రీమతి సమయమంతుల కుంతలగారు ... 906
కవివాక్సిద్ధి—బి. పట్టాభిరామయ్యగారు 908
స్త్రీవిద్యావిధానము—శ్రీమతి భువనగిరి లక్ష్మీకాంతమ్మగారు ... 915
మనోరమ 919
గృహోద్యాన శీర్షిక—గుమ్మలూరు సత్యనారాయణగారు, బి. ఎస్ సి. ఎజి. 927
సౌందర్యపోషణ 928
బాలవిజ్ఞానశాఖ 930
గ్రంథపరిచయము 932

ఆంధ్రవాచస్పత్యము; రామవిలాసము; పెద్దాపుర సంస్థానచరిత్రము; పద్మనాభయుద్ధము; ఆంధ్రదేశ కథలు; కమ్యూనిష్టు ప్రణాళిక; సామ్యవాద సిద్ధాంతాలు; సామ్రాజ్యవాదము మొదటిభాగము; శ్రీలక్ష్మీ నారాయణీయము; రాజ్యపాలనా శాస్త్రము; ఆంధ్రాస్తిక మహాసభ (మాధవరం 1934) ఆనంద సామ్రాజ్యము; కాసీయాత్ర; శ్రీమధ్వాచార్య చరిత్రము; శ్రీకృష్ణజయంతి; గ్రామపరిపాలన; ప్రకృతి; నాట్యకళ; బ్రాహ్మణగీత;

వింతలోకము 937
సంపాదకీయములు 941

శారదానికేతన పద్ధతి; క్షామసీమ; కీ॥ శే॥ మానాప్రగడ రామసుందరమ్మగారు; దక్షిణాంధ్రులు;

త్రివర్ణచిత్రము
ప్రాచీన విలాసము

ఛాయాచిత్రములు

వివరములు

ముఖచిత్రము

చిత్రకారిణి శ్రీమతి ఆర్. కమలాబాయిగారు.

ఈమె రిటైర్డు పి. డబ్ల్యు. డి. ఆఫీసరు శ్రీయుత ఆర్. అబ్బాయినాయుడు గారి పుత్రిక. సంగీతమునందును చిత్రలేఖనమునందును చిన్నతనమునుండియు మిగుల అభిరుచిగల వ్యక్తియగుటచే తండ్రిగారు ఈమె అభిరుచులకును కళాభివృద్ధికిని తగిన దోహదమిచ్చుటలో కడుంగడు శ్రద్ధవహించిరి. ఈమె శ్రీ రవీంద్రనాథ టాగూరుగారు స్థాపించిన శాంతినికేతనములో వంగదేశ సంగీతము, చిత్రరచనము మొదలగు కళలను చాల కాల మభ్యసించి, శిక్షణముపొంది స్వర్ణపతక బహుమానములను యోగ్యతా పత్రములను బడసినారు. భారతదేశ సంగీతవిజ్ఞానమునందు పేరెన్నికగాంచుటచేత శాంతినికేతనము వారీమెను ప్రశంసించుచు ప్రత్యేకపు పట్టము (Diploma with distinction) ను ఒసగినారు. మదరాసు ప్రదర్శనములో ప్రదర్శింపఁబడిన "రాధా నిరీక్షణ" యను సవర్ణచిత్రమునకు స్వర్ణపతక మొసంగఁబడినది. గృహలక్ష్మి పాఠకు లీమెకళావైదగ్ధ్యమును తిలకించి యానందపారవశ్య మందఁగలరని నమ్ముచున్నాము.

సాధనకుటీరము

ఇదియొక చిన్న సాధనాశ్రమము. ఇందు బాలికలకు పాఠశాలలోని ఉన్నత విద్యతోఁబాటు సంగీతము, గృహపరిశ్రమలు, భక్తిజీవనము మున్నగునవి నేర్పఁబడు చుండును. జాతిమత విభేదములు లేక హరిజన బాలికలున్ను జేర్చుకొనఁబడుచున్నారు. ప్రస్తుత పటమున గోచరించు బాలిక లెల్లరు హరిజన విద్యార్థినులే.

శ్రీ రాజకుమారీ అమృతకార్

గాంధిగారి గ్రామపునర్నిర్మాణోద్యమమునందే జీవితమంతయు గడప నిశ్చయించుకొన్న కర్మయోగిని.

శ్రీ. కం మహాలక్ష్మమ్మగారు

ఈయమ, సర్: ర. వెంకటరత్నం నాయుడుగారు పెంచుకొని పెద్దజేసి విద్యాబుద్ధుల జెప్పించిన యనాథబాలిక. ఇపు డీయువతీరత్నము రాజమహేంద్రవరములో నుపాధ్యాయిని.

శ్రీ హాలీదా ఎడిబ్

టర్కీదేశపు సుప్రసిద్ధ కవయిత్రియగు నీ యవ్వ ఢిల్లీ మహమ్మదీయజాతీయ సర్వకళాశాలలో కొన్ని యుపన్యాసములివ్వ నిండియాకు వచ్చెను.

శ్రీ నేసమనీపాల్

పాలంకోట స్త్రీలక్లబ్బున కీమె కార్యదర్శిని. పూర్వము మున్సిపల్ సభ్యురాలై యుండెను. కోయిల్‌పట్టిలో గూడిన అఖిలభారత మహిళా సమావేశమున తమిళనాడు కాన్స్టిట్యుయంట్ సమావేశమున కధ్యక్షురాలుగ నుండెను.

మహిళా మహాసభ

విశాఖపట్టణములో మొన్న గూడిన రాజకీయ మహాసభ యిదే. ఇందధ్యక్షు రాలగు శ్రీమతి పోణకాకనకమ్మగారు చెప్పిన యుపన్యాస మమూల్యము.

ఆకాశ దీపస్తంభము.

మంగుళూరునకు జెందిన కద్రి యనుపేటలో నిది పెట్టబడినది. ఇది లోహనిర్మితమై 80 అడుగుల యెత్తుగలది.

మిస్ సంతోష్‌ఖన్నా

బొంబాయి సెంట్ జేవియర్స్ కాలేజి విద్యార్థిని. స్త్రీలకుగాను ప్రత్యేకింపబడిన అఖిల భారత వక్తృతా పరీక్షయందు ప్రథమ బహుమాన మీపె కీబడెను.

శాంతాకుమారి

ఈ బాలిక వయస్సు 9 వత్సరములు ఆంధ్రనాటక కళోద్ధారక శ్రీయుత వనారస గోవిందరావుగారి అష్టమపుత్రిక.

గడచిన డిశంబరు మాసమున మద్రాసునందు జరిగిన చతుర్థాంధ్రనాటకకళాపరిష త్సందర్భములో ప్రదర్శించిన 'తప్పెవరిది' అను నాటకములో రాజేశ్వరి పాత్రధరించి మిక్కిలి శ్లాఘా పాత్రురాలయ్యెను.

ఆంధ్రనాటక రంగమునందు ముందు ముందీబాలిక వన్నెకెక్కగలదని సూచింపు చున్నది. భగవంతుడు అనుగ్రహించుగాక!

మాధవి

ఇది పుష్పసారములతో నిండియుండు ఒక నాజూకైన మంచువంటి పరిమళపదార్థము. ఈ మంచును కొద్దిగ వ్రేలితో తీసుకొని ముఖమునకు లేపనమును చేసికొనిన వెంటనే అది చర్మములో మాయమై ముఖమునకు కళ, కాంతి నిచ్చును. ముఖము స్ఫటికమువలె నిర్మల మగును. ముఖమున లేచు సొబి, మచ్చలు, మొటిమలు మొదలగువానిని మాన్పును. మరియు దీనిని ముఖమునకు పట్టించుకొనిన వెంటనే ముఖము చల్లగ నుండి మంచు రాచుకొనినట్లేయుండును.

వెల బుడ్డి 1-కి 8 అణాలు.

కేసరికుటీరం, ఎగ్మూరు, మద్రాసు.



ఎటువంటి విద్య?

పాశ్చాత్యదేశములయందును ప్రాచ్యదేశమగు జపానునందును నూటికి తొంబదిమందికంటె నెక్కువగా విద్యాయుతులై యుండగా భారతదేశమునందు నూటి కైదుగురుకంటె యెక్కువగా అక్షరాస్యులు లేకుండుట మిగుల శోచనీయమైన విషయము. ఈ విద్యాయుతులు నేర్చు విద్యయైనను ధనవ్యయమునకును, శరీరాయాసమునకును, నిరుద్యోగమునకును, నిస్పృహకును సాధకమైనట్లు, జీవనోపాధికిని, దేశాభ్యుదయమునకును, జాతీయోత్సాహమునకును మార్గము కాకుండుట మఱియును శోచనీయము. ఇట్టి శోచనీయమైన విద్యయయినను పురుషులలో వ్యాపించినంత మేఱకు స్త్రీలలో వ్యాపించకుండుట మఱియును దుఃఖహేతువు.

భారతీయులలో నింతమట్టుకు నిరక్షరాస్యత చొచ్చుకొని పీఠము పెట్టుకొని యుండుట విచారహేతువేయైనను, మన దేశస్థులు విదేశీయు లనుకొనునట్లు అజ్ఞానపు పశువులనిగాని, యుక్తాయుక్త వివేకరహితులనిగాని, ఉత్తమ ప్రజాహిత జీవనశూన్యులనిగాని, స్వపరిపాలనానర్హులనిగాని మనము జుగుప్సపొంద నవసరములేదు. భారతీయ జీవనము చాలవరకు కులక్రమాగత మగునట్టియు, కుటుంబక్రమాగత మగునట్టియు కొన్ని శిక్షణములకును కట్టుబాట్లకును లోనై వర్తించుచుండుటచేత, అనేకులు నిరక్షరాస్యులే యయ్యు జాతీయసంప్రదాయనైతిక జీవనమునకు భంగము లేకుండను, తమతమ వృత్తుల కనువగు విజ్ఞానానుభవములకు లోప

ములేకుండను ఎట్లో నేటివరకు గౌరవముగ త్రోసుకొని వచ్చుచున్నమాట నిజమే.

కాని ప్రపంచమెల్లయు నేడు అనుదిన త్వరితాయమానమైన క్రొత్తక్రొత్తసొబగులు పోకడలు, విజ్ఞానములతో సౌందర్యవంతమై రాణించుచున్న సందర్భములో, భారత దేశము తన తొల్లింటి అమాయక సంకుచిత విజ్ఞానవైఖరులతో తృప్తినొంది యుండ నేరదు. చదువను వ్రాయను ఆడను పాడను నేర్చినవారిసంఖ్య ఇంగ్లాండు జపాను మొదలగు దేశములలోవలె వృద్ధిపొందవలెను. నూతనవైజ్ఞానికజీవనము, రాజకీయప్రవేశము, స్వతంత్రతావిలాసము వానిలోవలె నిచ్చటను ఉన్నతమైన అంతస్థునకు నిర్మించఁబడవలెను. నూతనవిజ్ఞానములు, రాజకీయములు, సంయోగసౌకర్యములును గలసి నేడు ప్రపంచమునంతటిని ఒక్కకుటుంబముగాను ఒక్కశరీరముగాను మార్చుచున్నవి. ఒకరినొకరెరుగని దినములలో నెవరెవరికెట్టి భేదములు హెచ్చుతగ్గులున్నను నష్టము లేకుండెను గాని, విశ్వమానవకోటిలోని సమస్తకుటుంబములును ఒకటికొకటి సన్నిహితత్వములోనికి వచ్చుచున్నప్పుడు, ఇట్టి విభేదములు మానవలోకమున కొక అందవికారమును గూర్చుటయేకాక, అభివృద్ధిని పొందిన జాతులవలన పొందని జాతులు అణగఁద్రొక్కబడుటకుఁ గూడ కారణమగును. కనుక భారతీయ పురుషులేమి స్త్రీలేమి అత్యుత్తమ జాతులని భావింపఁబడువారితో తుల్యముగ విద్యాధికులై, రాజకీయ జీవనాసక్తులై, ఆర్థికసౌభాగ్యసంధాతలై, స్వాతంత్ర్యగౌరవవిభూషితులై యుండకున్నచో భారతదేశము తోడిదేశములతో సమానమైన ప్రతిపత్తి నందనేరదు. ఒకప్పుడు భారత దేశము విజ్ఞానఖనియై ప్రపంచమునకెల్ల మార్గదర్శకమై యుండెను. నేడు ఇతరదేశములతో సమానమైన స్థితియైనను ఆమెకు సిద్ధించకున్నచో భారతీయులు సంతుష్టిచెంది యుండఁజాలరు.

ఈ సమస్యయే ప్రస్తుతము భారతదేశీయ నాయకుల దృష్టినెల్ల ఆవరించుకొనుచున్నది. విద్యాధికులెల్లరును అనేక సందర్భములలో తమతమ ఆశయములను ప్రణాళికలను ప్రకటించుచున్నారు. ప్రస్తుత విద్యావిధాన మరిష్టదాయకముగ నున్నదని అందరును ఏకగ్రీవముగ ఖండించుచున్నారు. సర్ రాధాకృష్ణను గారు పాశ్చాత్యభౌతిక విద్యావిధానము తృష్ణ పరస్పరవైరములకు సాధనమై ప్రపంచమును యుద్ధోన్ముఖముగ చేయుచున్నదని అలహాబాదు విశ్వవిద్యాలయ పట్టప్రదాన మహోత్సవమున నుపన్యసించినారు. ప్రస్తుత విద్యావిధానము నీతిబోధకముగ లేదు గనుక మతవిద్యనుదానికి జోడించవలెనని సర్. కె. వి. రెడ్డిగారు ఆంధ్రవిశ్వవిద్యాలయ కాన్వ

కేషనులో హెచ్చరించినారు. సర్ షామహమ్మదు సులేమానుగారు ఆలీఘరు విశ్వవిద్యాలయ కాన్వకేషనులో ఉపన్యసించుచు ప్రస్తుత విద్యావిధానములో ఎట్టి లోపములున్నను విద్యాసంస్థలను తగ్గించుటకు వీలు లేదనియు, జీవనోపాధికనువగు వృత్తులను, ఉన్నతపరిశ్రామిక యంత్రములననుపు సంకేతిక జ్ఞానము ను ఉన్నత ఉత్తమతరగతులలో నేర్పి విద్యను జీవనోపాధిసంపాదమునకు మార్గముగ చేయవలెనని వాక్రుచ్చినారు. ఢిల్లీ ఎడ్యుకేషనలు కాన్ఫరెన్సు కగ్రాసనాధిపత్యము వహించిన ప్రొఫెసరు శేషాద్రిగారు విద్య సర్వతోముఖ సంపూర్ణత్వమును గూర్చునదిగా నుండవలెనని బోధించిరి. కరాచీలో జరిగిన అఖిలభారత మహిళాసభవారును, విశాఖపట్టణములో శ్రీ మతి పాణకా కనకమ్మగారి అధ్యక్షతను గూడిన ఆంధ్రమహిళాసభవారును స్త్రీలకు కావలసిన ప్రత్యేకపు శిక్షణములను గూర్చి చర్చించి కాలానుగుణ్యమైన తీర్మానముల నొనరించిరి. వీనినన్నిటిని సమన్వయము చేసి భారతదేశములోని సమస్త స్త్రీ పురుషుల కే యే వయస్సులో ,ఏ యే అంతస్థులో నెట్టివిద్య యొసంగవలెనను విషయమును సులభముగ నిర్ణయము చేయవచ్చును.

ప్రాథమిక విద్య బాలబాలికల కించుమించుగా నొక్కరీతిగానే యుండి యిరువురకును కలసియే చెప్పవచ్చుననియు అది నిర్బంధముగను ఉచితముగను ఉండవలెననియు నిశ్చయింపవచ్చును. వ్రాయుట, చదువుట, లెక్కలుచేయుట, నీతులునేర్చుట, ఉల్లాసకరమగు ఆటపాటలయందు విశ్రామసమయమును బుచ్చుట ఇది యీతరగతులలోని విద్యాక్రమమైయుండును. ఈవిద్య కేవలము ప్రైమరీ తరగతితో ఇప్పు డాపివేయబడుచున్నది. ఇంత స్వల్పముగా నుంచుటవలననే యీవిద్య అతి త్వరితముగ మఱువఁబడి అనంతర జీవనమునం దెందుకును కొఱగాకున్నది. ఈ తరగతులలో నేర్చినవిద్య శాశ్వతఫలదాయకమై యుండవలెననిన మూడవఫారమువరకైనను దీనిని పొడిగించక తీరదు. మఱియు నీవిద్య కేవల మాతృభాషలోనే గఱపఁబడవలెను. ఇందులో హిందీగాని ఇంగ్లీషుగాని క్వచితుగా నేర్పబడవలెను గాని వాని కేమాత్రము ప్రాముఖ్య మిచ్చినను అవి పట్టుబడవు సరేగదా మాతృభాష కూడ పట్టుబడక విద్యార్థుల కనావశ్యకమగు నత్యధిక కష్ట మేర్పడును.

మూడవ ఫారమునుండి సాహిత్యవిద్య కంటె వృత్తివిద్య కెక్కువ ప్రాముఖ్య మిచ్చుచు రావలెను. అనేకమందికి కాలేజీ విద్య నభ్యసించుట కవకాశము లుండవు గనుక ఉన్నతవిద్యతో చదువు మానివేసి ప్రపంచయాత్రలో పడుదురు. అప్పటికి వారికే

వృత్తియో కరగతము కాకున్నచో ఉపాధి రహితులై ఉద్యోగములు దొరకక లేమిడి లోఁబడి తల్లడిల్లుచుందురు. మన ప్రస్తుత విద్యావిధానమునం దిదియే పెద్దలోపమై యున్నది. ఉన్నత విద్యా తరగతులను విడచి పెట్టు సరికి స్త్రీ పురుషుల నెట్లు జీవించుట అను సమస్య యెదురుకొనకుండ మగవారికి వారి కుచితమగు వృత్తులును ఆడువాండ్రకు వారి కుచితమగు వృత్తులును గఱపఁ బడ వలెను. అయిరోపా జపాను అమెరికాయం దవలంబింపఁబడు విద్యావిధాన మిట్టిదై యున్నది. అచ్చటను వారివారి తరగతులును పాఠశాలలును వేఱువేఱై యుండుటయే శ్రేయస్కరము. పై చెప్పిన దేశములు పారిశ్రామికములై ఫ్యాక్టరీలతో నిండియుండుట చేత వానిలో పనిచేయు నేర్పు ఈ తరగతులలో గఱపఁ బడుచున్నది. కాని మనదేశము వ్యవసాయము గృహపరిశ్రమలకు సంబంధించిన దేశము. ఇట్టి దేశములలో యీ తరగతులలో అట్టి విద్య నేర్పుటయు సాధ్యము కాదు, నేర్పినను ప్రయోజనములేదు. మన దేశములో వ్యవసాయము గృహపరిశ్రమలు కులవృత్తులై నేటికిని నశింపకున్నవి. కాని అవి పాశ్చాత్యదేశముల పోటీకి నిలువలేక నశించుచున్నవి. ఆదేశములతో సరిపడుటకు మనమును ఫ్యాక్టరీలను పెట్టుకొని, అత్యధికోత్పత్తిచేసి, అంగడులు దొరకక నష్టముపాలై నిరుద్యోగులమై యుద్ధప్రయత్న నిమగ్నులము కాజాలము. కాని యీ వ్యవసాయమును గృహపరిశ్రమలను తొల్లింటి మోట పద్ధతులపై నడపినచో విజయమునంద లేము. నవనాగరకతలోని కొన్ని జిలుగులు సులువులు వానిలో ప్రవేశపెట్టి వాటిని రమణీయములుగఁ జేయవలెను. గాంధీ మహాత్ముడు గ్రామపునర్నిర్మాణ ప్రయత్నము నిందు కొరకై పూనినాడు. అఖిల విద్యాసభలు మహిళా సభలును ఆయుద్యమము నాదరించి సంపూర్ణోత్సాహముతో పాల్గొన తీర్మానించుట మిగుల శుభసూచకము. ఉన్నత విద్యా సంస్థలలో ఇట్టి యుద్యమమును వృత్తులను నెరవేర్పగల నైపుణ్యము గఱపఁ బడవలెను.

విద్య మానవులను నీతివంతులను, జ్ఞాన సంపన్నులను, స్వతంత్ర జీవులనుగా చేయుటకే గాని బి. ఏ., ఎమ్మే బిరుదులతో విఱ్ఱవీగఁ జేయుటకుగాదు. ఉత్తమవిద్యలు నేర్చుటయా మానుటయా అనుసమస్య ఉన్నత విద్యా పరిసమాప్తి అయిన పిమ్మట ఉద్భవించవలసినదిగాని ఈ లోపల నాలోచింప వలసినదిగాదు. కాలేజీ విద్య నభ్యసింపఁగల శ్రీమంతులుగాని, బుద్ధిమంతులుగాని తీరిక గలవారుగాని ఏ సంఘములోనైనను చాలా తక్కువమంది యుందురు. విద్యావిధానము విద్యార్థులను కేవలము ఒకతరగతిలో నుంచి

యింకొక తరగతిలోనికి ఎమ్మే ఎమ్మెల్ వఱకు చదివించుటకు రహదారులుగా నుండ కూడదు. ఉన్నత విద్యతో చాలామంది ఆగిపోయి ప్రాపంచక కృత్యములను సమర్థతతో నిర్వహించునట్లుగా చేయవలెను.

పిమ్మట ఉత్తమవిద్య లేక కాలేజివిద్యా సమస్య నాలోచించవలెను. జనసంఖ్యలో నూటికి ఇరువది లేక ఇరువదియైదు మంది మాత్రమే యిందులో చేరినను అది మిగుల ప్రశంసనీయముగానే భావించవలెను. లాయర్లు, ప్రొఫెసర్లు, డాక్టర్లు, ఎడిటర్లు, ఇంజనీర్లు, పరిశోధకులు మొదలగు వారిని తయారు చేయుటయే కాలేజీ విద్యావిధానముయొక్క ఆశయము. ఇది మిక్కిలి ఖర్చు వెచ్చములు, కష్టనష్టములతో గూడుకొనిన సమస్య. అందుకుతగిన బుద్ధి, ధనము, ఆసక్తి, అభిరుచులుగలవారే దానికి గిషంగవలెను. స్త్రీ పురుషు లెవ్వరైనను ఇందు చేరవచ్చును. ఇంత కొంచెముమందిలో స్త్రీలకు వేఱు పురుషులకు వేఱుగా సంస్థలు పెట్టినచో ఎక్కువ ధనవ్యయమునకు కారణమగుటయే కాని ప్రత్యేక ఫలితము లేమియు సమకూడఁబోవు. ఈ సంస్థలైనను ప్రతీ రాష్ట్రమునందును అన్నింటిని ఉంచుటకంటె ఒక్కొక్క రాష్ట్రములో నొక్కొక్క విద్యకు సంస్థనుంచి, ఇతర రాష్ట్రీయు లచ్చటికి పోయి నేర్చుకొన్నచో ఖర్చు క్లుప్తముగ నుండఁ గలదని సులేమానుగారు చెప్పిన సలహా మిగుల గమనింపతగినది. వీరెల్లరును ఈ విద్యలను ప్రస్తుతమువలె వ్యామోహము వ్యసనము కీర్తి పెద్దజీతము దర్జాజీవనముకొరకు గాక వారి పరిశ్రమల ఫలితములను ఉన్నత విద్యాసంస్థల ఉపాధ్యాయులకు విద్యార్థులకు అశ్రమముగ నిచ్చుటకును, తన్మూలమున జాతీయ జీవనమును సౌభాగ్యవంత మొనర్చుటకు నే కృషిసల్పుచుండవలెను.

వృత్తి, విజ్ఞానము, సుఖజీవనము మొదలగు వాని కీరీతిగ విద్య ఉపకరించునదై యుండవలెను. ఇన్నిటికంటె ముఖ్యమైన విషయ మొకదానిని మనము మఱువరాదు. ప్రస్తుత విద్యావిధానమువలన మనకు కలుగుచున్న జ్ఞానముకంటె వేయిరెట్లు పోకులు, దురభ్యాసములు, దుర్వ్యయములు, అహంకారములు ఎక్కువగా అలవడుచున్నవి. ఈ కారణములచేత అనేక పల్లెటూరి ఛాందసులకు పిల్లలను అందునను ఆడపిల్లలను బడిలోకి పంపుట యనగనే భయమగుచున్నది. ఉద్యోగ తృష్ణయొకటి పీడింపకున్నచో మగపిల్లలనైన బడిలో వేయుదురేమో సంశయాస్పదమై యున్నది. చదువులకు పుస్తకములకు జీతములకుకంటె వింత వింత విలువదుస్తులకు పరికరములకు భోగములకు ఎక్కువ ధనము ఖర్చై కుటుంబములు చితికి ఉద్యోగములు కఱవగుచున్నవి. ఇవతల నిరుద్యో

గమునకు సాయము అవతల విఱగఁబాటు వియ్యమ్మణాలు కూడ చెలరేగినచో అసలు విద్యయొక్కయు పాఠశాలలయొక్కయు పరువు ప్రతిష్ఠలుకూడ నశించును. ఈ విషయమున ముఖ్యముగా ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు వైసు ఛాన్సలర్లు డైరెక్టర్లు, కమిటీల సభ్యులు పరీక్షాధికారులు బాల బాలికలకును విద్యార్థినీ విద్యార్థులకును 'మార్గదర్శకులై యుండవలెను. ఈ సందర్భమున సర్ సులేమానుగారు కాసీ విశ్వవిద్యాలయోపాధ్యాయులను విద్యార్థులను విద్యా విధానమును ప్రశంసించుచు నుడివిన వాక్యములు ప్రతి యువకుడును, యువతియు, ఉపాధ్యాయుడును సువర్ణాక్షరములతో మనః ఫలకములపై లిఖించుకోతగినవై యున్నవి. 'ఇచ్చటి అధ్యాపకులు తక్కిన విశ్వవిద్యాలయముల లోని అధ్యాపకులకంటె జీతము తక్కువగ గైకొని నిరాడంబర నిరహంకార జీవనమును గడపుచున్నారు. విద్యార్థులుకూడ తక్కిన విశ్వవిద్యాలయములలోని విద్యార్థులకంటె చాలా తక్కువసొమ్మును వెచ్చించుచు తక్కువ విలాసములకు లోనగుచు రాణించుచున్నారు. మఱియు నిక్కడివిద్యలు కేవల వైజ్ఞానిక సిద్ధాంత చర్చలు ఉపన్యాసములుగా నుండక ప్రస్తుతము భారతదేశమున లేచుచున్న ఫ్యాక్టరీలు యంత్రములు మొదలగు వానిలో పనిచేయుట కనువగు చాతుర్య నైపుణ్యములను ప్రత్యక్షముగ నేర్పునవై యున్నవి.' ఈ మూఁడింటిని భారతదేశమునందలి ప్రతివిద్యాసంస్థయు అమూల్యమైన ఆదర్శములుగ పెట్టుకొని పనిచేయవలెనని వారు హెచ్చరించుచున్నారు. దేశీయు లెల్లఱును ఇట్టి శ్రేయస్కరమైన సలహాలను అమలుపరచుటకు మనఃపూర్వకముగ ప్రయత్నింతురు గాక !



స్త్రీవిద్య

జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారు, ఎం. ఏ, బి. యల్.

స్వీయజాత్యుద్ధరణమునకై జర్మన్ స్త్రీలు తమ ప్రాణములను గోల్పోవుటకు సంశయించిరికారు. జర్మన్ స్త్రీలేకారు; పాశ్చాత్య రమణులుకూడ జాత్యుద్ధరణమని తాము తలఁచిన ప్రతియుద్యమ విజయమునకు సర్వశక్తులను వినియోగించిరి. ఐరోపా మహాసంగ్రామము, సర్వమానవ సమత్వమునకు పట్టముఁగట్టుటకు ఏర్పడినదని నాఁటిరాజకీయవేత్తలు జలదగంభీరస్వరములఁ బలికిరి. మగలను, బిడ్డలను రణోద్వేకంపి, పవరపరిచర్య పదార్థములను సిద్ధమొనరించుటకు నాఁటి పాశ్చాత్యస్త్రీలు నడుముగట్టిరి. నాఁటి సమీకము కలుషభూయిష్టమైనదనియు, అందుండి వెడలిన పాపధూమము నేఁడును పాశ్చాత్య వాతావరణమును మలీమస మొనరించుచున్నదనియు గుర్తెఱిఁగి, రాఁబోవు భీషణ మృథమునకును, తమకును నెట్టి సంబంధ ముండదనియు, నా భండనపిశాచమునకు తమ బిడ్డలను బలివెట్ట గమకింపమనియు, గావున సంతానవతులమగుట కిష్టపడమనియు నేఁడు వారనుచున్నారు.

ఆత్మగుణములను అవలీలగ చిక్కఁబట్టఁగలవారు—ఏ దేశమందలివారైనను,—స్త్రీలే. కావుననే గాంధిజీ ‘సంఘభేదములను మఱచి, పురుషులకు ఐకమత్యమును బోధింపుఁడు. నేను తలపెట్టిన గ్రామపునరుద్ధరణ క్రియకు మీతోడ్పాటు అత్యవసరము’ అని, ఇటీవల జరిగిన అఖిలభారత స్త్రీసమావేశమునకు సందేశమంపిరి. ‘భారతస్త్రీలు ఇచ్చట పికెటింగు చేయుచున్నారని తెలిసి, నేనును, మఱికొందఱు స్త్రీలును ఈ దేశమునకువచ్చి, పికెటింగు చేయవలెనని అనుకొంటిమి. ఈ వఱలో మీజాతీయోద్యమమునకు మేమట్టి సాహాయ్యమును చేయఁజాలనందులకు మన్నింపుఁడు. ఇఁక మీవెంట నుండఁగలము’ అని నిన్నగాక మొన్న కారాచీసభలో ఏష్బీ సతిగారనిరి. అంతర్జాతీయ స్త్రీసహాకార సమ్మేళనమువారు మనుష్య భ్రాతృత్వము నాదర్శముగాఁగొని, ఆయుధవిసర్జనము జరిగి తీరవలెనని నొక్కి చెప్పుచున్నారు. ప్రపంచమున వ్యాపించియున్న సామరికవాతూలము నేఁడుగాకున్న, రేపైనను, పృథ్వీమహిళామతల్లులవల్లనే చల్లఁబడునేమో!

ఆత్మగుణములు పెంపొందిననాఁడే మానవైక్యత ప్రత్యక్ష కల్పవృక్షమై గోచరించును. ఈ గొనముల నుద్బోధించు నాగర

కతయే నేడనుకరింపఁదగినది. ఉన్నతాశయములను తన సొమ్ముచేసికొనినది ప్రాచీ సభ్యత. ఇట్లని నేటి విద్యాధికులు కొందఱు గుర్తించుట ముదావహము. "పాశ్చాత్య రమణులవలె భారతస్త్రీలు, తొందరపడక భారతదేశ ఆదర్శముల ప్రకారమే అభివృద్ధి నందవలెను. 'పురుషుఁడు గొప్ప—స్త్రీ తక్కువ' అన్న అభిమానముతో ఒక్కగెంతు వేయఁబూనుట ప్రమాదకరము" అని జయ రాందాసు దౌలతురాంగారు ఢిల్లీలోఁ గూడిన భారతవిద్యావిషయక సమావేశమందు పలికిరి. భారతదేశమందు నేఁడు గృహధర్మ, జాతిధర్మ, సంఘధర్మములను నిర్వహించుపట్ల స్త్రీలకు దివ్యోకాఁజాలు విద్య ఎట్లుండవలెనో పెక్కురంగ స్థలముల నుండి మహిళామణులు వాకొనిరి.

భావసౌష్టవమున సగ్రస్థానము వహింపఁజాలునది ఆంధ్రరాష్ట్రీయ మహిళాసభ కధ్యక్షతవహించిన శ్రీమతి పొణకా కనకమ్మగారి మహోపన్యాసమని నాతలంపు. "ఒకప్పుడు సర్వోన్నతశిఖరము నధిష్ఠించిన మన కిప్పటి పరిణామము తృప్తికరముకాదు. ఆలోపానికి కీలకం, ముఖ్యంగా మనవిద్యావిధానంలోనే ఉన్నది. వేదకాలమునుండి స్త్రీల ధర్మములు, శక్తి, స్వాతంత్ర్యము, విజ్ఞానము లోకమునకు మార్గదర్శకములై ఋక్కులద్వారా కూడ సుప్రతిష్ఠితమైనవి. పౌరాణిక కాలమున స్త్రీ యుద్యమము ఇంకను శాఖలువేసినది. స్త్రీ స్థానము ఒకప్పుడు మేరుశిఖరాన్ని అధిష్ఠించినది ....నేఁడు ఒకజాతీయ స్మృతిగాని, ఆదర్శంగాని లక్ష్యం అగుటలేదు. అనుకరణం నాగరకతగా పరిగణింపఁబడుతూ వున్నది. వేషభాషలలో సహితం ఇది మన స్వకీయశక్తి తేజస్సులు కోల్పోవుటకు కారణమవుతూ ఉన్నది...నిజంగా గృహలక్ష్మి స్త్రీ...పునరభివృద్ధి మనమీఁదనే ఆధారపడియున్నది. ఈయుద్యమానికి మనం సంపూర్ణంగా తోడ్పడాలి. నేఁడు దేశసేవకు నడుముఁగట్టిన సాధ్వీమతల్లులలో గార్గి సులభలు, సీత ద్రౌపది సత్యలు, వీరమతి, సంయుక్త రుద్రమదేవి దుర్గావతి ఝాన్సీ రాణులు, మొల్ల మల్లమదేవులు ప్రజ్వలించాలి. కవులు, గాయకులు, కళానిధులు ప్రభవించాలి. ఈమహోద్యమసాధనకు ఆత్మ బలి కావాలి. పూర్ణస్వరాజ్యసిద్ధి కావాలి.' వర్తమాన స్త్రీయుద్యమ చారిత్రమందు శ్రీమతి కనకమ్మగారుచ్చరించిన ఈవాక్కులు స్వర్ణాక్షరములతో లిఖింపఁబడుఁగాక !!

పుత్రవాత్సల్యము!

శ్రీమతి న్యాయపతి మంగమ్మగారు

౧

ఇందిర కిప్పుడు ముప్పది యారవయేడు నడచుచున్నది. ఆమె సంసారసాగరమును సుఖస్వప్నము వలె గడుపుచుండెను. దైవము తనకు వలయు సౌకర్యములన్నియు ప్రసాదించినందులకు, ఆమె కృతజ్ఞతాపూర్వకముగ తన వందనము లాయన కర్పించుచుండెను.

నేడిందిర ఇంటివెనుక వసారాలో కూర్చొని దీర్ఘాలోచన సేయుచుండెను. ఇరువదేండ్లయి శ్రీనివాసరావుగారితో నామె కాపురము సేయుచుండెను. ఈ యిరువదేండ్లును పరస్పర ప్రేమానుబంధములో వారిర్వురు లీనమైరి. శ్రీనివాసరావిప్పుడు డిప్యూటి కలెక్టరయి పెద్దపేరు ప్రతిష్ఠలు బడయఁగల్గెను. తమ యేకపుత్రుడు ప్రతాప్ బియే పరీక్షయందు ప్రథమ తరగతిలో నుత్తీర్ణుడయ్యెను. గవర్నమెంటు అసిస్టెంటు సర్జను రామమోహనరావుగారి కుమార్తె, కమలను ప్రతాపున కిచ్చి వివాహముఁ గావించుటకు ఉత్తర ప్రత్యుత్తరములు జరుగుచుండెను. ఇందిర కిక కావలసినదేమి?

ఇట్లామె దీర్ఘాలోచనలో మైమఱచి యుండ, వీధిలో నౌకరి రాము డెవరితోనో, "అమ్మగారు మిమ్ము చూచుటకు కిష్టపడియెదరో లేదో కనుగొని యెద"నని యనుట ఇందిర చెవిలోపడి, యామె ఉలికిపడి లేచెను

ఇంతలో తన సోదరియగు రుక్మిణి ప్రత్యక్షమయ్యెను. ఇందిర రుక్మిణి నెన్నడును తనయింటికి పిలువనని శపథము చేసియుండెను. అట్టి రుక్మిణి నేడెవరును పిలువనిదే, తనంతటతాను ఇందిర కడకు వచ్చి కూర్చొనియెను.

౨

కొంతసేవఱకు ఇరువురు నిశ్శబ్దముగ కూర్చొనిరి. తరువాత రుక్మిణి ధైర్యము వహించి ఇట్లనెను.

"అక్కా! నాతో మాటాడవా?"

ఇందిర మండిపడి, "నీ వేయధికారముతో నిచ్చటకు వచ్చితివి? నీరాక మీభావగారికి తెలిసినచో నేమి చేయుదురు?" అనెను.

"ఇందిరా, నేనంత యపవిత్రురాలనా? నారాక వారెందులకు నిరాకరించెదరు? అందులో నివి పండుగ రోజులు గదా?"

"నాకదంతయును తెలియును. పండుగైననేమి మరేమైననేమి? నీరాకకును పండుగకునుగల సంబంధమేమి?"

"పండుగతో నారాకకుఁగల సంబంధమేమా? నీ దయకు పాత్రురాలనగుటయే. మన బాల్యమును స్మరణకు దెచ్చుకొనుము. నేను..."

"నీవు... నేను మఱచితినని తలంచితివి."

"కాదు, కాదు, నన్ను క్షమించితివని తలచితిని."

"క్షమార్పణా? నీవు మాపై మోపిన యపవాదమునకు తిరుగ క్షమార్పణా? నీవొనర్చిన యనాచకార్యమును సహింపలేక, దూరదేశమున కరిగిన మన యమ్మనుఁగూడ అపవాదముఁ దెచ్చిపెట్టితివే? అది

యుటుండ, కమలను ప్రతాపునకిచ్చి వివాహముఁ గావించుదమని, రామమోహనరావుగారి నడుఁగ, 'మీచెల్లెలు రుక్మిణిఁగావించిన ఘోరకృత్యమునకు తిరుగ బహుమానము నాకమలను మీప్రతాపునకీయుటా' యని నిందావాక్యము లాయన బలుకుటయు, నిన్ను క్షమించుటకా?"

ఇందిర ఇక మాటాడలేకపోయెను. క్రోధోద్దీపికచే యామె కండ్లెఱ్ఱబారి యుండెను.

రుక్మిణి యొకింతయు చలింపలేద. ఆమెకిట్టి నిందావాక్యము లాలకించుట యలవాటే. ఆమె యేడ్చుటలేదు; ఆమె కన్నీటి నూయి యెండిపోయెను. మరల నామె దీన స్వరముతో:—

"ఇందిరా, నీవెన్నన్నను సరే. నేనొనర్చిన ఘోరకృత్యముఁగూర్చి నేనెన్నోసార్లు తలపోసితిని. తలచినపుడెల్ల నామనమున యమితమైన యాందోళన కల్గుచుండును. ఒక్కొక్కసారి పిచ్చెత్తుదునేమోయనిఁ గూడ భయము కల్గుచుండును. ఇంతకు లాభమేమి? నేనొకటి చెప్పెదను, నీవది తెలిసికొనజాలవు. అభిలాషయనునది నీవెన్నడును ఎఱిగి యుండవు; అనుభవించి యుండవు." అనెను.

"ఘోరకృత్యము నందభిలాష! ఔను నేనెన్నడునది యెఱుగను; అనుభవించనులేదు. ఇందుసుగను. నావందనము లాదైవమున కర్పించుచున్నాను."

"మనమిర్వురము బాల్యమునుండియు నొకరీతి నే పెరిగితిమి. నీకును నాకునుగల భేదమేమన, నీవు రూపవతివి; నేనుగాను; నీవొక ధనవంతుని వివాహమాడి, వాని యాదరమునకు పాత్రురాలైతివి; నేనొక పేదవాని భార్యనై, నామగనిఁ గోల్పోయితిని. నీవు నీ ప్రతాపునకు మంచి విద్య నొసంగ గల్గితివి. నాతనయునకు, నేను కొద్దిగనే విద్యనీయ గల్గితిని. నీ జీవితములో నీకన్నియు సౌఖ్యములే; నాకెప్పుడును కష్టములే."

3

"సాలున కైదువందల రూప్యములు నీకు ముట్టుచున్నవి గదా? అట్టిచో నీవెట్లు నిరుపేదవగుదువు?"

"అక్కా, సాలున కయిదువందల రూప్యములతో నాతనయునకు విద్యఁగఱపి, ఇటు సంసారసాగరము నీదుట సులభసాధ్యమా?"

"చోరకృత్యము మానిన యది సులభసాధ్యమే!"

"దురభిలాష ప్రవేశించనంతవఱకు నదిసాధ్యమే. అక్కా నేచెప్పునది సావకాశముగ వినుము. మూనిరుటి పండుగరోజులలో మల్లాది వారి గృహమున నుంటి. నాతనయుడు వెంకట్రావప్పుడు విశాఖపట్టణములో బ్యాంకిగుమస్తాగా నుండెను. వానికొక స్నేహితుడేర్పడెను. వీరిర్వురును చెడుసావాసములలోఁజేరి, జూదము, తాగుడు, ఇట్టి మరేవియో యలవాటులలోఁ దగుల్కొని బ్యాంకి సొమ్ము దుర్వ్యయపఱచిరి. బ్యాంకిలో మూడువేల రూప్యములు కొఱతపడెను. ఈ సొమ్ము మఱల సర్దుపాటు చేయుటకు వారమురోజుల వ్యవధియుండ, నాతనయుడు నేనుండు మల్లాదివారి గృహమును చేరెను. నాతో తనుచేసిన దుష్కార్యముఁగూర్చిఁ దెల్పి, ఎట్లయినను నన్నా సొమ్ము జతపరుపమని వేడుకొనెను; లేనియెడల ఆత్మత్యాగముఁ జేసికొందునని యేడ్చెను. ఒకరూప్యమా! రెండా! మూడువేలు తలచుకొన్న గుండె ఝల్లుమనుచున్నది. మూడువేలరూప్యములు నేనెచ్చటనుండి తెచ్చి నాతనయుని కాపాడుదును? అక్కా, జ్ఞాపకమున్నదా? అప్పుడు సొమ్ముకొఱకు నీకొక తంతివార్త నంపితిని. నీవును దయాళురాలవై రెండువందల రూప్యములు పంపితివి.

అప్పుడది సాయంసమయము. మల్లాదివారింట్లో పెద్దటీపార్టీ జరుగుచుండెను. నాకిటు నాతనయుని ముఖముఁ జూచిన, ఏఘడియ కేమి చేసినైచునో యను భీతిఁ గలుగుచుండెను. నాకప్పుడు జోరున

తలపోటు వచ్చినది. కొంచెము యాస్పిరిన్ (Aspirin) తినుటకు మేడపై నాగదికేగితిని. నాగదిలో (Aspirin) యాస్పిరిన్ కన్పడమి, మఱియొక గదికేగి చూచితిని. అచ్చ టెవ్వరును లేకుండిరి. ఆగదిలో నొక టేబిలుపై నొక విలువఁగల మణిహారముండెను. అది మల్లాది శేషమ్మగారిది. దానివెల యాఱువేల రూప్యములని యామె నాతో నిదివఱలోఁ జెప్పియుండెను. నాకప్పుడు లెక్కలేనన్ని యాలోచనలు పుట్టెను. దురభిలాష తన యావశ్శక్తితో నన్ను పురికొల్పెను. నాకెన్ని యాపదలు చేకూరినను, నాతనయుని కాపాడుదును గదా యను తలంపు నామది నంటుకొనెను. అచ్చ టెవ్వరును లేకుండుటఁజూచి, మణిహారమును చేతధరించి మఱల నాగదిఁ జేరితిని.

• నాల్గయిదు రోజులవఱకును మణిహారముకొఱకు శేషమ్మ వెదకికొనలేదు. ఇదియే సమయమని నేను కలకత్తాకేగి, మణిహారమును మూడువేల రూప్యములకు విక్రయించి నాతనయున కాద్రవ్య మొసంగితిని. వాడప్పుడుపోయి తనకే కొఱంతయు కలుగకుండునటుల బ్యాంకిసొమ్ము సర్దుబాటుఁ జేసికొనెను.

వారమురోజు లయిన పిమ్మట, మల్లాదివారి గృహమున చోరులు మణిహారము నపహరించిరను మాట వెలువడెను. నన్నెవ్వరును అనుమానింపరను ధైర్యము నాకుఁ గల్గెను. వెంకట్రావు తను రక్షింపబడెను గదా యని భగవంతుని వేయిమ్రొక్కులు మ్రొక్కి, ఆయన సాయముచే దుష్కార్యములన్నియు మానివైచెను.

ఇంతలో నపరాధపరిశోధకులు కలత్తాకేగి నేను మణిహారము నమ్మిన వర్తకుని పట్టుకొనిరి. వాని సాయమున నన్నుఁగూడ పట్టుకొనిరి. నన్నయిదు నెలలు ఖైదీగఁజేసివైచిరి. అక్కా మఱేమని చెప్పుదును. మల్లాదివారినిఁ జూచుట కిప్పటికిని సిగ్గువేయుచున్నది. నేఁజేసిన దాని కిప్పుడు ఘోరమగు పశ్చాత్తాపముఁ జెందుచున్నాను. ఇందిరా! నీవెన్నడును కష్టమనున దెఱుగవు. గాన, నేఁజెప్పినదేమియు నీ మనమున కెక్కదు."

౪

రుక్మిణి చెప్పినదంతయు ఇందిర వినెను. అప్పుడిందిర, "రుక్మిణీ, నేను, నీవనునంతటి కఠినహృదయురాలినిఁ గాను. నేను కఠినత వహించుటకుఁ గారణము నీవు చేసిన దుష్కార్యమే. నీనుండియేఁ గదా మనయమ్మను దూరదేశమున విడచినది. నీనుండియేఁ గదా ప్రతాపుని వివాహము నిలచినది. నీవు చేసిన దౌర్జన్యము కారణముగ మనవంశమున కంతయుఁ కళంకముఁగల్గినది. అట్టి నీపై సరళహృదయ యగుయే స్త్రీయైనను జాలి చూపగలదా?"

"పండుగ దినములలో నైనను..."

"రుక్మిణీ, నీమాటలు చాలింపుము. నీవు దొంగిలించినపుడు నీకు పండుగ జ్ఞాపకము రాలేదా?"

౫

మఱల కొంతవఱకు నిశ్శబ్దము.

ఇందిర, తన పెనిమిటి వచ్చువేళ యైనది-రుక్మిణి రాక ఆయనకు తెలిసినచో, తన్ను నిందింతురని, భయపడుచుండెను. ఎటులైనను రుక్మిణిని వెడలుమని చెప్పుట కామె మాటలకొఱకు తడుముకొనుచుండెను. కొసకు, 'రుక్మిణీ' అని మఱల నూర్కొనెను.

రుక్మిణి, ఇందిర మనోభావము నూహించి,

"ఇందిరా, నారాక నీకు కష్టముగ నున్నదా?" అని యనెను.

"ఔను".

ఇంతలో శ్రీనివాసరావుగారు వీధి మెట్లెక్కు-

చుండిరి. ఆయన, "అమ్మగారేమి చేయుచున్నా" రని రాము నడిగిరి. రాముడు తిరుగ, "అమ్మగా రెవరితోనో మాటాడుచున్నారు" అనిఁ దెల్పెను.

ఇదంతయు ఇందిర వినుచుండెను. ఏఘడియకు తనపెనిమిటి లోనికి ప్రవేశింతురో యని యామె భయమొందుచుండెను.

ఆమె, "రుక్మిణీ, నీకేమి కావలె"నని రుక్మిణి నడిగెను.

రుక్మిణి, మరేమియు నులేదు. వేంకట్రావు బ్యాంకిలో పనిచేయుట కిష్టపడుటలేదు. మేమిద్దర మెచ్చటికైన దూరదేశమున కరుగుటకుఁ జూచుచున్నా" మనెను.

"ఏమ్మట".

"శ్రీనివాసరావుగారి 'టీ' ఆస్టేటు లున్నవిఁ గదా?"

"ఉన్నవేగాని, వాటినిగూర్చి నీవాయన నడిగినచో..."

"నేనడుగలేను. ఇందిరా, నీవొక్కింత శ్రమ పడిన...ఇందిరా, నాపై జాలివహింపవా?"

"అవకాశము లేదు. సాలున కయిదువందల రూప్యములు వచ్చుచున్నవి గదా?"

వచ్చుచున్నవిఁ గాని, అందులో రెండువందల రూప్యములు మల్లాది శేషమ్మగారి కిచ్చుచున్నాను. మణిహారము వెల పూర్తిగ నిచ్చివైచిన వఱకు సాలునకు నాకు మూడువందల రూప్యములే ముట్టును."

"ఐనను నీకది చాలును. వెంకట్రా వింకను బ్యాంకిలో పనిచేయుచున్నాడుఁ గదా! వానిని దానిలోనే పనిచేయనిమ్ము."

"మే మీదేశము వీడుట కెంత యుత్సాహపడుచున్నామో, నీకు తెలిసినచో..."

"అట్లైన, నీవే ఆయన నడుగుము. ముమ్మాటికి నే నడుగను."

"రుక్మిణి మరి నోరెత్తలేదు. ఇందిరా ఇక శలవు. నీకు శ్రమ నిచ్చినందులకు క్షమింపు"మని యామె యావలకేగెను.

౬

సోదరి వెడలినంతనే ఇందిర కొక విధమైన హాయిఁగల్గెను. ఆమె కూర్చొనిన స్థలమును వీడి కావిడిలోనికేగెను. ఆమె సోదరివచ్చుట, ఆమెతో సంభాషించుట, ఇదంతయు యామె కొక స్వప్నము వలె తోచెను.

ఇంతలో ప్రతా పెచ్చటినుండియో ఇందిర యొుందు గదిచేరి, తలుపులన్నియు బంధించి తల్లి ముఖము చూచుచుండెరు. ఆతడి ముఖము ఒక వెఱ్ఱివానివలె కన్పట్టుచుండెను.

ఇందిర, 'ప్రతాప్' అని పిలచెను.

జబాబు లేదు. ఆతని యవయవములన్నియు వణకుచుండెను. నోటినుండి మాట వెలువడుట లేదు.

ఇందిర భయకంపితముగ, "ప్రతాప్, ఇదియేమి? నిన్నెవరేమి యనిరి? త్వరగ చెప్పు"మని గట్టిగ యనెను.

ప్రతాపు వణకుచు, "రమేష్! దైవమా, రమేష్," అని మెల్లిగ ననెను.

ఇంది రప్పుడు "రమేషనుచుంటివేమి? రమేషున కేమి జరిగెను?" అని యడిగెరు.

ప్రతాపిక నిలువజాలక ప్రక్కనున్న కుర్చీలో పతికిలఁబడి, ముఖమును చేతులతో కప్పుకొని,

సాధనకుటీరము, అగ్రహారం, పిఠాపురం.



'బక సమ్మేళనము'

శ్రీ రాజకుమారీ అమృతకౌర్

"నేను రమేషును చంపితిని" యనెను.

ఇందిర తనతనయుఁడు చెప్పినది నమ్మకపోయినను,

"ఏమంటివి? రమేషుని చంపితివా? తండ్రీ! చెప్పుము. జరిగినదంతయు శుభ్రముగఁ జెప్పుము" అనెను.

ఆమె బంధించిన కవాటములన్నియు తెఱచి, పైనెవ్వరును లేకుండుట చూచి, మఱల కవాటములు బంధించెను. పిమ్మట ప్రతాపుప్రక్కనే మరియొక కుర్చీలో కూర్చొని ప్రతాపును ప్రశ్నలపై ప్రశ్నలువేయ దొడంగెను.

"ప్రతాప్, రమేష్‌తో నీవు దెబ్బలాడితివా?"

"ఆఁ"

"ఎప్పట?"

"నేను కాఫీత్రాగిన తరువాత, రమేష్ దగ్గఱకు వెళ్లితిని. ఆతడు నాతో నేకాంతముగ చెప్పుట కేదో యున్నదని యనెను. అది కమలను గూర్చియే. కమల నాతడు ప్రేమించెనట. ఆమె యంగీకరించినదట! ఇంతలో నేనుఁ జొరబడితినట. ఇది వినగానే, నాకు వానిపై పట్టరాని కోపము వచ్చినది."

"నీ వప్పుడేమి చేసితివి?"

"నేనా కోపమున వాని శిరముపై నొక బలమైన గ్రుద్దు గ్రుద్దితిని, ఆ గ్రుద్దుతో వాడు నేలఁ గూలెను."

"వానికి పెద్దగ్గాయము లేవైనను తగిలినవా?"

"మొదట వానిని తిరిగి చూచుటకుఁ గూడ నా కసహ్యముగ నుండెను. కాని, కొంతసేపైన తరువాత నా గదియంతయు నిశ్శబ్దమైపోయెను. నే నప్పుడు రమేషునిఁ జూచితిని. వాడొక శవమువలె కాన్పించెను. వాని నోటినుండి రక్తము ప్రవహించుచుండెను. నేను వానిని పిలచితిని; వాడు పలుకుటలేదు. నేనప్పుడు వానిదగ్గఱ కూర్చొని నా చేతి రుమాలుతో వానినెత్తురు తుడచివెచితిని. కొంచెము జలము తెచ్చి వాని ముఖముపై చల్లితిని. వాని శరీరము తాకిమాడ నది మంచువలె చల్లగనుండెను. వాడప్పుడు చనిపోయెనని నాకర్థమయ్యెను. నాయంతరంగము నన్ను, "రమేష్ ప్రాణములు విడచెను, నీ వాతని చంపితివి." అనునట్లు తోచెను. నా తమ్మునివంటి వానిని చంపివైచితినిఁగదా యను తలంపుతో నేను కడు భీతిల్లితిని. నేనొక పిరికివానివలె నాక్షణముననే యా గృహమువీడి యావల కేతెంచి, మన గృహమును చేరితిని."

"ప్రతాప్! వినుము రమేషు ప్రాణములను విడచెనని నీవు నిశ్చయముగ చెప్పగలవా? ఆతడు క్రిందపడుటవలనను, దెబ్బతగిలి మూర్ఛనొంది యుండునేమో?"

"అమ్మా, నీ వాతనిఁ జూచియుండిన......హా దైవమా! నేనే యాతనిఁజంపిన క్రూర రాక్షసుడ."

"శాంతింపుము, ప్రతాప్! నన్నొకింత యాలోచింపనిమ్ము. నీ వప్పు డెవరినైన పిలచితివా?"

"నేనెవ్వరిని పిలచుటలేదు. దానికిని నేనొక పిరికినైతిని. కాని, అప్పు డచ్చటెవ్వరును లేకుండిరి."

"నీ వది నిశ్చయముగఁ జెప్పగలవా?"

"నిశ్చయముగ అచ్చటెవ్వరును లేదని నిరాఘాటముగా చెప్పగలను. అందులో రమేష్‌గృహ మీ యూరిలో నొక మూలనున్నది."

"పోనిమ్ము, రమేష్‌తో కలసి నీవు వానింటికి వెళ్లుట యెవరైనఁ జూచితిరా?"

"మమ్మెవరునుఁ జూచి యుండలేదు."

"వానితో వెళ్లెదవని నీ వెవరితోనైనఁ జెప్పి యుంటివా?"

"లేదు."

ఇందిర మనమున లెక్కలేనన్ని యాలోచనలు ప్రబలెను. ఆమెకేమి చేయుటకును తోచుటలేదు. కడకు, మనమేమియు నెఱుగనటు లూర్కొనిన మన కేహానియుం గలుగ"దని యనుకొనెను.

"ప్రతాప్, అయిన దేదో యయినది. జరిగిన దానికై విచారించిన లాభములేదు. ఇప్పుడు మనం గూర్చి, అనగా—నీవు—నేను—మీతండ్రి గూర్చి యాలోచింపవలయును."

"ఔను"

"నేను చెప్పినట్లు చేయుము. మన మిద్దర మిప్పుడు చేయున దేమన, యీ విషయము మన యిర్వురిలోనే కడురహస్యముగ నుంచవలెను. ఇతరుల కొకింతయును తెలియనీయఁగూడదు."

ప్రతాప్ తలనూపెను.

"ప్రతాప్‌యం దొకింతయును దోషములేదు. కమలనుగూర్చి రమేషేదియో యన, ప్రతాపది సహింపలేక యాతని తన్నెను. ఇంత మాత్రమున రమేష్ ప్రాణములు విడచిన, ప్రతాప్ యందేమి దోషమున్నది." అని ఇందిర తలపోయుచుండెను. ప్రతాపప్పుడు ధైర్యమువహించి, తనజేబులోనున్న రక్త చిహ్నితమైన జేబు రుమాలును తీసి కాల్చివైచెను.

౭

రమేషు శ్రీనివాసరావుగారి సోదరి పుత్రుడు. నేడు భోగిపండుగ. రమేషు పండుగరోజులలో శ్రీనివాసరావుగారింటికి భోజనమునకు వచ్చుచుండెను. రాత్రి ఝాముప్రొద్దెక్కినది. ఇంకను రమేషు గృహముచేరుటలేదు. అత డెచ్చటికో పొరుగూరు పోయియుండునని శ్రీనివాసరావు గలచి ప్రతాపుతో భోజనమున కేగిరి.

ఆ మరునాడు ప్రాతఃకాలమున శ్రీనివాసరావెచ్చటికో వెడలిరి. వీధిలో టెలిఫోను గంట వాగుచుండెను. నౌకరి రాముడు టెలిఫోను కడకేగి "ఎవరది" అని యనెను.

"నేను డాక్టరు రంగనాథం."

"డాక్టరుగారా? బాబూ ఏమి కలవు?"

"మీ రమేషునకు గట్టి గాయము తగిలినది. అతడు వానింటిమేడపై పడియుండెను. వాడు నేలం గూలిన వెంటనే నౌకరివాడువచ్చి నన్ను పిలచుటచే, నేను వచ్చితిని. గాయమునకు తగు చికిత్సచేసితిని, అమ్మగార్కి మరేమియు బెంగపెట్టుకొన పద్దనిం జెప్పుము."

"చిత్తం బాబూ."

ఇదంతయు ఇందిర వినుచుండెను. ఆమె కప్పుడు మనశ్శాంతి కుదిరినది. ఈవార్త యామె ప్రతాపునకు తెలియంజేసెను. ప్రతాపు, "మనల నెంతభయభ్రాంతులను జేసివైచెనమ్మా!" యని సంతసమున యనెను.

౮

ఇందిరకిప్పుడు ఆకర్షణ, అభిలాష, అను పదముల యర్థము తెలిసినది. రుక్మిణి తన తనయుని కొఱకెన్ని యాపదలకైనను జడియక మణిహారమును దొంగిలించినది. ఇక ఇందిరో! తన ముద్దుల ప్రతాప్ కొఱకు రమేషుని ప్రాణములనుగూడ లెక్కగొనక, తన తనయుడు చేసిన ఘోర కృత్యమును కప్పిఁబుచ్చ చూచినది. ఇదియే యాశఁజూపు యాకర్షణ ప్రభావము.

ఇందిర కుర్చీపై టేబిలు ప్రక్కను కూర్చొనియుండెను. ఆమె యొక కాగితమును తీసి రుక్మిణికీ విధమున వ్రాసెను.

ప్రియసోదరీ,

మొన్న నీతో కఠుకోక్తులగు వాక్యము లాడినందులకు క్షమింపుము. నీవును వెంకట్రావును కలసి వచ్చి పండుగదినములు మా యింట గడిపి నన్నానందింపం జేయఁగోరుచున్నాను. నీ తనయుడు వెంకట్రావునుఁగూర్చి మీ బావగారితో మాటాడుదము.

ఇట్లు నీ ప్రియసోదరి.
ఇందిర.

శ్యామల పెండ్లి

శ్రీమతి మల్లంపల్లి బాలాత్రిపురసుందరమ్మగారు

సాయం సమయము. మలయమారుతము చల్లగా వీస్తోంది. పూదోటలో చలపతి యొక లతాగుల్మందగ్గిర కూచుని ఏదో ఆలోచిస్తూ న్నాడు. ఇంతలో వెనుకనుండి ఎవరో కనులు మూశారు. చలపతి చేతులుతడివి 'ఓహో! శ్యామలా! నీవేనా!—దొంగలా కళ్లుమూశావు' అన్నాడు. శ్యామల చేతులుతీసి 'దొంగవి నీవా నేనా? నన్ను తీసుకెళ్లకుండా ఒక్కడవు మెద్రాసు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నావు' అంది. 'నిన్ను తీసుకెళ్లడానికి నాకేమి హక్కున్నది' అన్నాడు చలపతి. 'నీ ప్రియురాలిమీద నీకు హక్కులేక మరెవ్వరికుంటుంది?' అని శ్యామల అంది 'నీవు లక్షాధికారుల బిడ్డవు. నేనో భిక్షాధికారిని. ఇటిస్థితిలో నీవు నాప్రియురాల వెట్లగుదువు?' అన్నాడు చలపతి. శ్యామల 'తుచ్ఛమగు ధనము నాశించు నీచులట్లు నేను ధనము నాశించుటలేదు. నేను కోరునది పవిత్రప్రేమ' అంది. 'నీ కిష్టమైనచో నీ తలిదండ్రుల కిష్టముకావద్దా' అన్నాడు చలపతి. 'న్యాయ సమ్మతమైన విషయమున కింకొకరి యిష్ట మేల. నేను—'అని శ్యామల అంటూయుండ ఎవరో పిలచినట్లయింది. శ్యామల యింట్లో కెళ్లిపోయింది. కొంతసేపక్కడనే కూర్చుని తనగదిలోనికి వెళ్లిపోయాడు చలపతి.

చంద్రశేఖరంగారు గొప్ప స్థితిపరుడు. ఆయన కొక శ్యామల తప్ప యితర సంతాన మేదియు లేదు. చలపతి చంద్రశేఖరంగారి స్నేహితుని కొడుకు. చిన్నప్పుడే తల్లిదండ్రులు పరలోకగతులైనందున చలపతిని రక్షించువారెవ్వరును లేరని దయామయుడైన చంద్రశేఖరంగారా భారమును తన తలపై వహించాడు. అప్పటినుండియు చలపతి చంద్రశేఖరంగారింట్లోనే యుంటున్నాడు. అతని కొక చిన్నయిల్లు కొద్దిఆస్తి ఉండేవి. చంద్రశేఖరంగారా ఆస్తి నమ్మివేసి చలపతికి చదువు చెప్పిస్తున్నాడు. చిన్నప్పటినుంచి ఇక్కడనే ఉండడంచేత శ్యామల చలపతి దగ్గర చనువుగా ఉంటూంది. చలపతి స్కూలు నుంచి రాగానే ఇంగ్లీషు పాఠం చెప్పించుకునేది. క్రొత్తవిషయాలేవైన అడుగుతూండేది. చలపతి సంతోషముతో సమాధానములు చెపుతూండేవాడు. దీనితోపాటు వారి హృదయములో ప్రేమ అనే వృక్షము నాటుకుంటూంది. కాని చలపతికిమాత్రం నిరాశగా ఉంటూండేది. ఎందుచేతనంటే శ్యామల గొప్పయింటిబిడ్డ; తనదో బీదస్థితి.

బి. ఏ. పరీక్ష ప్యాసుఅయి ప్లీడరు పరీక్ష కని మెద్రాసు వెళ్లేడు. శ్యామల కతనిమీద నుండే ప్రేమచేత అతన్ని విడచియుండుట కష్టంగానే యుంది. ఒకనాడు శ్యామలతల్లి యశోదమ్మ చంద్రశేఖరంగారితో 'శ్యామల కింకను పెండ్లిచేయరూ?' అంది.

'శ్యామల పెళ్లా? చెయ్యొచ్చును. తొందరేమిటి'

'దానికిప్పుడు పదహారోపడు. యింకా 'తొందరేమి'టనే అంటారు. ఎక్కడైనా సంబంధం చూసి పెళ్లి చెయ్యాలి యీయేడు.'

'సంబంధం చూడ్డమెందుకు? చలపతి యింకా చదువుకుంటున్నాడు గదా' అని ఊరుకున్నాను. పెళ్లి ఎప్పుడు చేయాలంటే అప్పుడే చేయవచ్చును.'

'చాల్లెండి! ఇన్నాళ్లనుంచి మీరుచూసిన గొప్ప సంబంధంచాలు! సుఖపడుతుంది! ఇంకా ఏ జమీందారుల బిడ్డకో యిస్తారనుకుంటున్నాను కాని యీదరిద్రగొట్టు దామోదరుడికా యివ్వాలనుకుంటున్నారు!! రెక్కాడితే కాని డొక్కాడదు. గొప్ప సంబంధము చేసిన కష్టపడ నక్కరలేకుండ హాయిగా కూచుని తినవచ్చును.'

'ధనముండికూడ దురలవాటులవలన పోగొట్టుకున్నవారు లేరా? చదువువలన ధనము నార్జించి గొప్ప జమీందారులగుచున్నవారు లేరా?'

'తరువాత ఎవరికర్మంవారిది. దానికర్మమే అలాగుంటే చదువుకున్నవాడుమాత్రము ధనము నార్జించగలడా? ధనముండియు పోగొట్టుకున్నవా రున్నారుకదా అని చేతులారా దరిద్రుని కంటగట్టడమా? మన కొక్కరితె కూతురు. ఆ ఒక్క కూతురును జమీందారులకిచ్చి ముద్దులు, ముచ్చటలు తీర్చుకుని ఆనందించాలి కాని దరిద్రులకిస్తే ముద్దులు తీరవు.'

ఈ మూర్ఖురాలితో వితండవాద మెందుకని కాబోలు 'నీ యిష్టంవచ్చిన సంబంధం చూచుకో, కాని తెలివి తేటలుగల కుర్రవానిని పోగొట్టుకుంటున్నా'వని అక్కడనుంచి లేచి వీధిలోనికి వెళ్లిపోయారు చంద్రశేఖరంగారు.

చంద్రశేఖరంగారు శ్యామల పెండ్లివిషయములో ఏమీ కలుగజేసుకోవడం మానేశారు. యశోదమ్మ తనసోదరుని సహాయంగా తీసుకొని శ్యామలను ధనికుడైన రామారావుకిచ్చి పెండ్లిచేయడానికి ఏర్పాటుచేయించింది. రామారావు ధనికుడననే గర్వముచేత నిత్యము త్రాగుడు, జూదము, వేశ్యలు మొదలగు దురలవాటులకు లోనై యున్న తుచ్ఛుడు. శ్యామలయొక్క అందమును ప్రతిరోజున ఆమె బడికిపోవునపుడు చూస్తూయున్నవా డగుటవలన ఆమెను యిస్తాననడం

తడవుగ సరేనని ఒప్పుకున్నాడు రామా రావు.

శ్యామల పెండ్లి యింక పదిరోజులున్నది. చంద్రశేఖరంగారి బంధుగులంతా ఒక్కొక్కరుగ వచ్చి వారిల్లుచేరుకుంటున్నారు. శ్యామలను పెండ్లికూతురును చేయుదినము వచ్చింది. శ్యామలతల్లి పెండ్లికూతురును చేయుటక్కై ఆమెగదివద్దకుపోయి 'శ్యామలా! శ్యామలా!' అని పిలిచింది. కాని ఆమెజాడ గానరాలేదు. వెంటనే ఆమె పూదోటలోనికి పోయి వెదకింది. కాని ఆమె కనిపించలేదు. వెంటనే ఆమె చంద్రశేఖరంగారి వద్దకుపోయి 'శ్యామల ఎక్కడకు వెళ్లినదండీ' అని అడిగింది ఆతృతతో. 'ఏమో ఎచటకుపోయినదో, నాకేమీ తెలియదు.' అన్నారు చంద్రశేఖరంగారు. అందరును కలసి ఎచ్చట వెదకినను లాభములేక పోయినది. పెండ్లి హడావిడిలోనున్న చంద్రశేఖరంగారి యిల్లు విచారంలో మునిగిపోయింది.

ప్రాతఃకాలము. దివాకరుడు తన ప్రతిభను చూపుటకు మీది కెగబ్రాకుచున్నాడు. అట్టితరి తపాలావాడొక కమ్మను చేతబట్టుకొని 'చంద్రశేఖరంగారున్నారా?' యని కేకవేశాడు. ఈజీ చైరులో పడుకొని ఏదియో ఆలోచించుచున్న చంద్రశేఖరంగారా కేక వినగానే అదరిపడి లేచి వచ్చి యా లేఖను దీసికొని చూడగా అందిట్లున్నది.

ప్రియమైన నాన్నగారికి. నేను ఉదయము ఆరున్నరగంటలకు చలపతి బావగారి వద్ద కులాసాగా ప్రవేశించినాను. తమతో చెప్పకుండ యిచటికి వచ్చినందులకు, అమ్మగారి కోరిక విఫలము చేసినందులకు నన్ను మన్నింప వేడుచున్నాను.

మదరాసు ఇట్లు, మీ ప్రియకుమారి,

శ్యామల.

చంద్రశేఖరంగారా లేఖనుచూచి భార్యకు తెలిసినయెడల గొడవగునని తలచి ఆమెకు చూపకయే జేబునం దిడుకొని 'శ్యామలతో సహా బయలుదేరి రావలసిన'దని చలపతికి తంతి నిచ్చిరి. మరునా డుదయమునకు శ్యామలా చలపతులు చంద్రశేఖరంగా రింట ప్రవేశించిరి. వారినిద్దరను చూడగనే యశోదమ్మకు కోపము, దుఃఖము ఒక్కసారి పొంగిపోయినవి. ఆమె ఏమియు మాటాడజాలకుండెను. ఊరివారందరు శ్యామలనేర్పునకు మిగుల సంతసించిరి. ఆ మరుసటిరోజుననే శ్యామలా చలపతుల కతి వైభవముతో వివాహము జరిపించారు చంద్రశేఖరంగారు.

రామారావా స్తియంతయు అప్పులవారి స్వాధీనమాయెను. రామారావుకు జైలు ప్రాప్తమయింది. చలపతిరావు ఏలూరులో పేరుమోసిన గొప్ప వకీలు. యశోదమ్మకోపమిప్పటికి చల్లారింది. యశోదమ్మ, చంద్రశేఖరంగార్లు శ్యామలా చలపతులవద్ద సంతోషంతో కాలము గడుపుతున్నారు.

సరస్వతి—పుష్పావతి

శ్రీమతి ఆచంట సత్యవతమ్మగారు

సరస్వతి సనాతన విద్యాభిలాషిణి; జాతీయ వాదిని: పుష్పావతి నవీన విద్యాసుందరి; ఇద్దరు విదుషీ మణులే; కాని సరస్వతి విజ్ఞానసుమము; వినయధురీణ; సహనవతి; శాంతస్వరూపిణి; భక్తపరతంత్ర; పూర్వాచార పరాయణానువ్రత; సాధుశీల; సద్గుణఖని; పతివ్రత.

పుష్పావతియన్ననో—వాగాడంబర; స్వాతంత్ర్యవాదిని; పాశ్చాత్య వేషాభిమానిని; అభిమానవతి; సనాతుల వెర్రిచాదస్తములు, నోములు వ్రతములు, వట్టి ఛాందసము కాని, ఆరోగ్యము కాదనియు, స్నానములు, తడిబట్టలు, రోగమూలకములు కాని శుచిత్వము కాదనియు, మొదలగు జాతిమత దూషణ ప్రియ స్వభావములో వీరిరువుర కింతటి భిన్నమున్నను, అభిన్న స్నేహము స్థిరత్వము నొందియుండుటకు, సరిస్వతి సహనమే మూలము.

సర్వసంగ పరిత్యాగియగు సన్యాసికి, నితరుల, దూషణ భూషణ తిరస్కారము లొకలెక్కయా! అభిమానవతియగు పుష్పావతిమాటే, పైకి అవునంటే తీరిపోతుందన్న నిరాడంబర సరస్వతి యగుటచేతనే, వారి స్నేహము చెడకయుండెను. కాని జాతి, మత, విద్యా శీల విషయములలో నప్పుడప్పుడు వారికి భేదాభిప్రాయములు కలుగుచుండును. చివరకు సరస్వతి సమర్థన మతి చమత్కృతిశక్తిచే, పుష్ప-నిజము గ్రహించి మెచ్చుకొనుచుండును.

ఒకనాడు మధ్యాహ్నము పుష్పావతి, తాను వ్రాసిన వ్యాసముగల నూతన మాసపత్రిక నొకదానిని తెచ్చి, సరస్వతిని చదువమనెను. అప్పుడే ప్రియుని, కృత్యములుఁ దీర్చి, కచేరికిఁ బంపి, పిల్లల నిద్రబుచ్చి తీరికగా కూర్చుని, సరస్వతి, కుచేలోపాఖ్యానము, చదువుచుండెను. కుచేలుని భక్తిలో లీనమగుచు, లీలావతి పేదరికమున కశ్రువులు రాల్చుచు, అమాయకపు పిల్లల, యాకళ్ల కతిబేలపడుచు, కథలో కలిసిపోయిన హృదయముతో, కొంతసేపు చెలిని వీక్షింపనేలేదు. తదుపరి "పుష్పా? కూర్చుండుము. పనులైనవా?" అని ప్రశ్నించెను.

పుష్ప:—పనులకేమి కల్పన చేసుకుంటే అన్నీ పనులే, కడితిలోకడ్డ ఎలుకలాగ కొట్టుకుంటూ, చాకిరితోనే కాలము గడిపితే, మనం చూచేదేమిటి. వినేదేమిటి? చేసేదేమిటి. నిన్న క్లబ్బులో మీటింగు, స్త్రీలకు కావలసిన సమస్త హక్కులను గురించి, ఈవాళ హాలులో నుపన్యాసము, రేపు మ్యూజియములో ఆరోగ్యవారమగునట, నాటకములు, బహుమానములు, ఉపన్యాసములు, ఎన్నో వేడుకలు జరుగును. ఒక్కదానికి నీకు తీరికలేదుకదా? నాజీవితము వీక్షింపుము చెలీ! లేచేసరికి పనులన్ని దాసి చేసేస్తుంది. నౌకరు, కాఫీ ఫలహారములు తయారు చేసి తెస్తాడు. హోటలునుంచి, మీల్సు వస్తుంది. మే మిద్దరము తింటాము. పిల్లాడికి, పిల్లకు, వాళ్లే పెట్టుకుని తినేటట్లు నేర్పేశాను. స్నానము చేయుట భోజనము చేయుట తప్ప, నాకు వేరు పనిలేదు. కొంతసేపేదో చదువుకుంటాను. ఏపత్రికకో, తమాషా నవీనకల్పన కథలు వ్రాసి పంపిస్తుంటాను. మా వారు, ఆఫీసుకు వెడతారు, పిల్లలు స్కూలుకు పోతారు. నేను తోచకుంటే, నీవద్దకిన్ని, మీటింగుంటే యక్కడికిన్ని అదీ లేకపోతే క్లబ్బుకిపోయి,

యే టెన్నిసో బ్యాడ్‌మింటనో, వార్తాపత్రికా వీక్షణమో, చేసివస్తాను. రాత్రికి మరల క్యారివస్తుంది. ఇలాంటి నా జీవితము సుఖమో-ఉదయాస్తమయములు, ఊపిరాడని చాకిరితో, పొయిసెగలతో కండ్లుపోవుచు, తల దువ్వుకొనుటకైన తీరికలేక చింపిరి జుట్లతో జిడ్డుముఖములతో, మలిన వస్త్రములతో, అలుకలతో, ఆక్షేపణలతో, అత్తాడుపడుచుల జగడాలతో, పిల్లల యేడ్పులతో, ఇల్లెగిరిపోవు యజమానికేకలతో, ఎంగిళ్ల విరాకులతో, ఇల్లు అడివిలాగ, ఇల్లాలు అసహ్యముగాను, పిల్లలు పెంటిల్లాగ, కనబడుచు, లోకజ్ఞానము, పుస్తకపఠన, వ్యాయామములకు విశ్రాంతిలేని మాబోటివారల జీవితము సుఖమో ఆలోచించు. కళ్లుమూసికొని భక్తి భక్తి అంటావు. కళ్లుతెరిచి లోకంపోకడలు చూడవు. ప్రాణనాథుని పదసేవనమే ముక్తిఅంటావు కాని. బాహ్యసౌఖ్యము లొకిఁచుక గనునించవు. ఏనాటి కథలో! నిజమో తెలియదు అబద్ధమో తెలియదు! పురాణములే నమ్ముకుని వాటినే ఆదర్శించుకొని సనాతన విద్యోలంటో, సంస్కరణాభిలాష లేక, తాతలనాటి పాత కథల చదువుతూ కూర్చుంటావు. ప్రపంచక మెన్నిరకాల మారుతోంది! ఎన్నిరకాల విమర్శనలు! ఎంత సంస్కరణ? నవీనులమగు, మనము నవీనయుగములో కాలచక్రముతో,బాటు పరిభ్రమణ మొనరించాలికాని, కూపస్థమండూకాల్లాగ, పోతన భాగవతము, శ్రీనాథుని జీవితము. పెద్దనమనుచరిత్ర; యిత్యాది గ్రంథ కాలక్షేపమేకాని, ప్రకృతి స్వభావ జనిత కవిత్వమాధుర్య రసాస్వాదినులము కామేమే? ఎన్ని మాసపత్రికలు బయలుదేరాయి! ఎందరు నవీన కవి యువకులు, యువతులు బయల్పడ్డారు. ఎన్నితరహాల కథలు, కబుర్లు, చిత్రాలు, భావాలు!! ఒకటేమిటి. పూర్వులు, అసూయాపరులు. అందుకు తార్కాణము, పెద్దపెద్ద కవులమని, ఏదైనా వారే వ్రాయాలి. ఇతరులు వినాలి. వారిపేరే ప్రబలాలి. వారు నీతు లుపదేశించుట, లోకులు వినుట, ఆ ప్రకారంచేయుట ఇప్పుడు వారికెంత సహనమో చూడు. ఇంతమంది కవిత్వ మల్లు శక్తిగల్గుటకు, ఇన్ని పత్రికలు వికసించుటకు అందరిని ప్రోత్సహించి, వ్రాయించి, ఆదరించుటయే. సనాతన, నవీనుల ప్రవర్తనలు విదితమగుచున్నవి. చూడుము ఈ మాసపత్రిక !! ఎట్టిసాంఘిక కథలు ! ఎట్టి లోకజ్ఞానము ! స్వభావము తెల్పుచుండు నిట్టివే మనకు ముఖ్యజీవితాధారములు. సరస్వతీ ! యిది చదువుము.

సర:—పుష్పా చదవడానికేమిగాని నా కివి కూడును. అది కూడకఅను అసూయ యెంతమాత్రం లేదుసుమా ! ఎంత యుపన్యసించావు. నీవు నవీన ముగ్ధవు. వీటిని నమ్మిన నిన్ను వచ్చబెట్టుటకు, 'భర్తృహరి సుభాషితము'లో చెప్పినట్లు బ్రహ్మకైనా తరంకాదు. పూర్వకవులను, కవిత్వాన్నీకూడ నెంతచర్చించావు. అట్టి కవిత్వరచనాసంపదిప్పుడేది? తాతలనాటి పాతకథలంటివి ! అట్టి యుత్తమ చరితల చరిత్రలవలననే, మన యార్యావర్త మన్నిఖండములలోనికి, పవిత్ర ఖండమని పేరెన్నికగన్నది. మహాపతివ్రతల నివాసదేశమగుటచేతనే, పతిప్రేమ, నిర్మల జీవనము, గృహసౌఖ్యము, సత్ప్రవర్తన, దైవభక్తికి నిలయమై, మనోనిర్మలతఁ జెందియున్నది. భౌతిక సౌఖ్యముకన్న, ఆధ్యాత్మిక సౌఖ్యము మిన్నకదా? అప్పటి విద్యావిధానమునకు, ఇప్పటి విద్యావిధానమునకు తేడా నీకు కన్పట్టుటలేదా? పూర్వం, ఋషులు, శృతి స్మృతి, పురాణేతిహాసములు రచించిరి. అంతా ధర్మబోధ. క్రమేసి కావ్యరచన, రూపక రచన యీవిధంగా క్షీణించి ప్రస్తుతానికి కల్పలతకి, గడ్డిపువ్వులకుండు వ్యత్యాసమంతతేడాతో విద్య వృద్ధి పొందింది.

నవీనుల కవిత్వంలో, పదగుంభన అర్థపొందిక, కవిత్వరచన, కల్పనా నిర్మాణము ఏమున్నాయని ఇట్టి కవిత్వానికి? ఎంతమంది కవులు బయలుదేరకేమవుతారు. ఆదరించుడాని కనేక పత్రికలు, ఉదు

పుట కంతకంటె పెద్దపెద్ద రచనలర్థముకాని యుభయభాషా విహీనలు!! అందుకనే గంతకుతగ్గ బొంతలున్నారు. మనవేదాంతము మొదలుపెట్టినచోట విదేశవేదాంత మంతమొందినదని విదితమే కదా? అట్టివారి యాశ్రితులమగు మన కింతకన్న యున్నత విద్య బలపడునా, మనది మరచితిమి. ఇతరులదిరాదు. ఈ మిడిమిడి భావాలతో సరస్వతీదేవి నిష్టమువచ్చినట్లు పీకను పిసికేస్తున్నాము. ఏమిటో మీటింగులకు నాబోటిది రానంతమాత్రాన, మీబోటి ఆంగ్లవిద్యాధురీణలకు కొఱతయా! ఏదో పేడపురుగులాంటి జన్మ మాది! వినువీధి నతిస్వతంత్రంగాతిరిగే పక్షులంటి వాళ్లు మీరు. ఏమి హక్కులు? గృహిణీపదంలో స్త్రీకి గావలసిన సమస్త హక్కులు ప్రకృతియే స్వభావంగా యిచ్చింది. ఆమె స్వభావం మంచిదైన యెడల, భర్తయు, బిడ్డలుకూడ, యదుగుదాటని యాజ్ఞానువర్తులై, సకల ఆలోచనలందును, మంత్రిత్వము వహింతురు. మాతృత్వశక్తి; గృహపాలనశక్తి స్వభావజనితంగా, స్త్రీ యధీనమే. ఇంక పురుషులిచ్చునది మనం పుచ్చుకునేది ఏమిటంటే, వాళ్లవలె, లేచిందిమొదలు, బిడ్డలనైన సరకుచేయక, స్వాతంత్ర్యాపేక్షతో, యిచ్చవచ్చిన చోటులకు వెళ్లడమేనా? ఇంకా, వారసత్వపు హక్కులని యాందోళన చేయుట బాగుగనే యున్నది. ఎందువలనయంటే, జోలెడాస్తి, తండ్రికాని, భర్తకాని, గణియించడమున్న, వారి యనంతర మీ స్త్రీకి పురుషసంతానము లేకున్నయెడల యే దాయాదియో, యే వారసుడో కర్తయై, యావదాస్తియు ననుభవించుచుండగా అగ్నిసాక్షిగా పెళ్లాడిన భార్యయు స్వగర్భజనిత యగు కుమార్తెయు, తమవారి యాదాయములోని యనుభవములేక, దరిద్రకష్టము లనుభవించుచున్నారు. వారి దుర్భర కష్టముల తొలగించుట కన్ని మీటింగులైన చేసి, యెన్నిపాట్లయినఁ బడవచ్చును కాని, పురుషులపై విజృంభణము, మనకుకూడదు. స్త్రీలపై విజృంభణము, పురుషులకు కూడదు. అవునా! పుష్పా!'

పుష్పా! 'ఏమో! నీమాటలు వింతగాయున్నవి. ఎన్నటివో ప్రాతవారి మాటలాడతావుకాని, ప్రస్తుత పురుషుల యవినీతులు నీవు కళ్లువిప్పి చూచుట లేదు. భార్యయుండగా మరలమరల తనకిష్టమువచ్చినంతమందిని ఏదో సాకుఁజెప్పి పెళ్లాడ్డమెందుకు? నల్లవారి కొకరీతి న్యాయము, తెల్లవారి కొకరీతి న్యాయము కూడదని యేలాతలంచుచుండిరో, అట్టి న్యాయమే మనవాళ్లు స్త్రీల కొకరీతిని, పురుషుల కొకరీతిని యేలాగ చెల్లుబడిచేయుచున్నారు? వాళ్లకి మనకు, సమానబాధ్యతఁగల బిడ్డలబాధలన్ని స్త్రీ యనుభవించడమున్న, సర్వకాల సర్వావస్థలందు వారితో వేగితంటాలు పడుమ, దేహారోగ్యములేక, వాహ్యాళిలేక, ఇండ్లలో మగ్గడ మన్యాయముకాదా? ఇవన్ని అణచాలి. అందుకనే, సర్వ స్వతంత్ర హక్కులు కావాలని, మహిళామణు లాందోళనము, సేయుచున్నారు. కండువా మార్చి కండువాలా, భార్యలను మారుస్తున్నారు గనుకనే, మన స్త్రీలకు కూడ విడాకులచట్ట మవసరమై యున్నది. నీ వింకా పెరటిదారినే యున్నావు. ఛాందసురాలవు సరసూ!'

సర— (పుష్పచుబుకము పుణుకుచు) పుష్పా! ఎంత నెఱజాణవే! అవా మీవిజృంభణము, మన పూర్వీకులకు, సీతా, దమయంతి మొదలగు కాంతలకీ తెలివిలేకనా? వారందరు, పురుషులు చెప్పుకొరికితే, తాము సిద్దకొరికే, భర్తలను నీతిమంతులుగాను, అనుకూలురుగాను చేశారా! తమ ధర్మబోధనశక్తిచే, అవినీతులను, నీతివంతులుగను, అననుకూలుని, యనుకూలఁనిగను, నొనరించుకొని బాగుపడిరి. పశుపక్ష్యాదులను, ప్రకృతినే విమర్శించి చూడుము. తల్లి సాకినట్లు, తండ్రి బిడ్డను పెంచఁగలఁడా? ఏడుగంతి తండ్రికంటె, ఏసులబుట్టంత తల్లిమేలని సామ్యమే యున్నది. స్తన్యపాన మెచ్చటకలదో, అచ్చటనే శిశుపాలన, రక్షణఁ జరగాలి. పంతముకొలది, పురుషుల పశము చేసి, స్త్రీలు పలుచోట్లకుపోతే, పదిసం

స్థలందు తిరుగు పురుషుడు బాహ్యవ్యాపారజనితాలోచనాధీనుఁడై, బిడ్డల నేమరియుండును. దాన మనకే నష్టము. దీనికొక తార్కాణము, పేపర్లలోనే యామధ్య వేసినారు. వినుము. పాశ్చాత్యసుందరి కున్న స్వేచ్ఛావిహార లచే, దాయీపరమునయుంచిన, బిడ్డ, వీధిలో నాడుచు, విధివశమున, తల్లివచ్చు కారు క్రిందనే పడి మరణించెనట. తల్లికంటె, దాయీ కెక్కుడాపేక్షయా, లేక, ఎక్కువ ప్రేమా! మగవాఁడు, సిగరెట్లు త్రాగినాడని, అవి మాన్పించడానికి, నయబోధనాశక్తి లేక, ప్రతిగా శాస్తిచేయుటకై, మనం కాల్చడమా! దీనివలన, వాళ్లు మానరు. మనకు, లేని దలవాటు! దుర్వ్యయమూ, రెట్టింపగుటయు స్త్రీగూడ, దుర్వ్యసనములందు చిక్కుట సంభవించును. ఇది మంచిదా?

పురుషులు ధర్మము మీరలేదా యనుచుంటివి. వారు పాశ్చాత్యగాలులచే, తమ ధర్మములు మరచినారని మాతృస్థానములమగు మనము, భూకంపప్రళయాలకు భూమితిరుగునట్లు, చలించుటేల? విడాకులుచ్చుకొని వారేమి బావుకొనుచున్నారు? ఏతప్పు, నీవు చేయకూడదని, పురుషుల నిందించుచుంటివో, ఆతప్పు తిరిగి నీవే కోరుటెందులకు? ఒకదొరసాని, పెండ్లాడిన మరుచటిదినమే, భర్తగుఱ్ఱు భరించలేనని, కోర్టులో విడాకులకు దరఖాస్తు చేసిందని, వార్తాపత్రికలో వ్రాశారు. ఇట్టి దాంపత్య మెంతటి విలువో, ఎంతటి స్థిరమో, ఎంతటి పవిత్రమో, ఆలోచించు. ఇఁక, నీయిల్లు, నీవాళ్లు, నీవి, అని, స్థిరమగు నివాస మెద్ది. మీ పిల్లలు, నా పిల్లలు, పోగడి, మనపిల్లలను కొట్టుచున్నారందిట, విడాకులు పొంది, ద్వితీయవివాహమాడిన యువతి, రెండవపెండ్లివాడగు భర్తతో. ఇట్టి స్త్రీని, ఎంతమంది భర్తలై, భరించెదరు? ఇది పబ్లికు వ్యభిచారిణి యగును. అందుచే, మనము భరించలేని కష్టము లిచ్చు భర్తలకొక మంచిదారి నిచ్చు నిబంధనల చట్టము లేర్పరుచుకొన నాందోళనములు సల్పవలెనే కాని, ఇట్టి ప్రాయశ్చిత్తములుకాదు వారికిచేయుట. ఇరువుర యవినీతులచే, క్రమంగా, సంఘము క్షీణించి, కుక్కగొడుగులవలె పుట్టు, సంఘాము లట్టె యంతరించి, పునః నాల్గువేల సంవత్సరాలక్రిందటి ధర్మాలు ప్రవర్తింపఁజేయు, పాట్లుపడవలనుండును. ఇట్టి యుత్పాతబుద్ధులు, అసలుకే మోసము తెచ్చును. మళ్లీ పునః సృష్టి చేయడానికి, మహాత్ము లుద్భవించి క్రొత్త విద్యలు సృష్టించి, మీటింగులు చేయాలి. ఇంకొకటి: అతిబాల్యవివాహాలవలన, చాలా నష్టములని శ్రీ శారదాగారొక ప్రౌఢవివాహచట్ట మేర్పరచి, కృతార్థులైరి కదా? ప్రౌఢవివాహములచే, బాలికలు, అనుకూలవరుల నెన్నుకొని, సుఖజీవిత లగుదురుకదా? ఇఁక, నట్టి దాంపత్యములో, విడాకుల కవకాశ మెద్ది? ఇట్టి సదవకాశము లభించిన సమయములలో, అధర్మయుతమగు విడాకులచట్ట పేర్పాటుల యాందోళన మేల? ఇంతకూ నాలోచిస్తే, నిజంగా, విడాకులు, ప్రౌఢవివాహబాధ్యులగు పాశ్చాత్యులకే కావలసి వచ్చింది. మన ఆర్యధర్మబద్ధ పవిత్రగృహిణి కక్కరనే లేదు. "స్వధర్మే నిధనం శ్రేయః, పరధర్మో భయావహః"యని, గీతలో శ్రీకృష్ణభగవానుఁ డానతిచ్చి యున్నాఁడు కదా? హిందువులకు, గీతయే కదా ఆదర్శము. పాశ్చాత్యుల బైబిలులను, వారతిక్రమించుచున్నారా? మహమ్మదులఖురానును, వారుల్లంఘించుచున్నారా? ఉభయభ్రష్టత్వముగా, మన స్వధర్మములు, మనము మీరి, పరధర్మానుష్ఠానబుద్ధి మనకేల? ఇంతేను, మన మిప్పుడు స్కూళ్లలో చదువు విద్య యట్టిది. దాని ప్రభావ ముగ్ధుల మగుటచే నట్టి కాంక్ష లుత్పన్నమై పీడించుచున్నవి. త్రిశంకు స్వర్గములాగ, మధ్య నూగాలికాని, మనము వారి దేశీయులముకాక, నలుపుదేహుల మగుటచే, వా రాదరించరు. స్వధర్మభ్రష్టుల మగుటచే, మనవా

రామోదించరు. ఇఁక మనగతి, గతేయగును. అందుచే, విద్యావిధానము నీతి, మత, ధర్మ, గృహపాలన, విధానములచే మారాలి. అంతవఱకు మనకింతే. హృదయపరివర్తనము, దేశమోక్షము, మనకు ముఖ్యములా? వాగాడంబరములతో, లేనిపోనివి కావలెనని మనసేరము లితరులతో మొఱపెట్టుకొని, వారి యధీనులమై, వారి శరణుఁజొచ్చుట మేలా! పుష్పా! నీ వీరాత్రంతా హృదయంలో విమర్శించు.

పుష్పా:—(ఒకించుక నాలోచనాధీనయై) "అక్కా! సరస్వతీ! మాతృస్వరూపిణివి. భౌతికానందురాలగు, నాజన్మమను, ఆధ్యాత్మిక బోధానందముచే, తరింపఁజేసితివి. అత్షణిక కోరికల నావలికి ద్రోయించి, శాశ్వతమైన, యనుభవపట్టిక నెలకొల్పితివి. నమస్కారమక్కా! ఇంతటినుండి, నీ యాజ్ఞానువర్తిని," అని సరస్వతి సెలవుపొంది, బిడ్డ లేడ్చుదు రేమో యను, భీతి యుదయింప, పతి ప్రేమ పొంగిపొరల, నిజగృహమున కఱిగెను.

అంతటినుండి, పుష్పావతి, హోటలుమీల్సు మానిపించి, స్వహస్తపాకము చేయుచుండెను. దాదుల యధీనమునుండి. బిడ్డలను తప్పించి, బిడ్డలస్వకృత్యముల, స్వంతముగాఁ జేసికొనుచుండెను. ఇంతయేల, సరస్వతివలె'గృహిణి'యని యనిపించుకొనుచుండెను.

దాంపత్యము

" సీ॥ ఇగురుజొంపంబుల నింపారు విరులను బలుపైనపొదల గ్రేవలకుఁదార్చి।
సెలయేరులందలి తెలినీటఁదనుపు సొంపెలసినగిరుల తెప్పలకుఁజేర్చి।
మావిమ్రోఁకల నెలదీవలఁ జెన్నొందు తోఁటలకడ నలి తోడఁబోఁది।
అలరునెత్తమ్ముల కలిమిఁజెల్వగు డిగ్గియలతీరభూముల నల్లబొంది।
నన్ను మనము నఁదేల్చి యానందమొందఁ గేలిసలిపెడు నీదగు లీలమఱవ।
నావశంబె ప్రాణేశ ప్రాణంబులిపుడ నిన్నకూర్చియే తెంతు నీసన్నకడకు ॥ "

భారతము.

మార్పుల మంగ

శ్రీమతి కూనిశెట్టి రామరత్నముగారు

గోదావరి గట్టున నొక భవనమున్నది. దానిచుట్టూ మంచి పిట్టగోడ, ఆగోడనిండా మాలతీలతలు బఠాణి తీగలు అల్లిబిల్లిగా నల్లుకొన్నాయి. ఆ తీగలనిండా యెప్పుడూ పువ్వులే. పగడాలు ముత్యాలు కలిపి పోగులు పోసినట్లు కన్నులపండువుగా కనబడతాయి. మంచి పరిమళముతో దూరమునుండే రమ్మని మర్యాదచేస్తాయి. ఆ ప్రాకారము, దేవిడి, చూస్తే ఆ భవనము ధనవంతులదని చెప్పక చెప్పుతాయి. ఆ భవనములో దాన ధర్మాలు తాండవమాడుతాయి. ఎపుడు చూచినా బీద సాదలకు అన్నప్రదానమే. ఎపుడు విన్నా వేదశాస్త్రఘోషే. సాయంకాలమయితే పురాణమో హరికథయో నిత్యము తప్పదు. గౌతమిలో గంగ వారియింటిలో భక్తి పొంగి పొరలుతున్నాయంటే నిజముగా నమ్మవలసిందే. లక్ష్మీసరస్వతులు అత్తా కోడళ్లపోట్లాటలు మానుకొని ఆ భవనములో సుఖముగా కాపురముంటూన్నారు. ఒకసారి ఆ భవనముచూస్తే కళ్లు మనస్సు చెప్పినట్లువిని తిరిగి మనవెంట రావు. లోనికి దూరి అన్నీ చక్కబెట్టవలెనని యువ్విళ్లూరుతాయి.

ఆ యింటి యజమానుడు రామశాస్త్రి మంచి శాస్త్రవేత్త; పూర్వాచారానికి పుట్టినిల్లు. ఈ కాలపు సంస్కారాలంటే మిక్కిలీ అసహ్యం. అతనిపేరుజెప్పితే సంస్కర్తలకు హడలు. ఆ యిల్లాలున్నూ అతనికి తగినదే. విసుగు విరామం లేకుండా యింట్లో పనిపాట్లు చేస్తూ ఉంటుంది. పెట్టడమన్నా, పొయ్యడమన్నా, మిక్కిలి సంతోషం. చీకటితోనే లేచి పట్టెడు పసుపు రాసుకొని స్నానముచేసి రూపాయంత బొట్టు పెట్టుకొని ఆ యిల్లాలు మహాలక్ష్మి, తులసి, పూజచేస్తూవుంటే పాతివ్రత్య కళలన్నీ అక్కడే తాండవమాడుతుంటాయి. ఆదంపతులకు లేక లేక చాల కాలానికి ఒకబిడ్డ పుట్టింది. ఆపిల్ల సుగుణాల కుప్ప. ముద్దులమూట. అందాలదీవే! ఆ పిల్ల పేరు మంగమ్మ.

ఆటపాటలలో అల్లర్లు ఎరుగని పిల్ల. మంగమ్మ బడికిపోతూవుంటే ముద్దులాటలతో మంగమ్మ బుగ్గలు గులాబీ పూవుల్లాగ యెఱ్ఱవారేయి. మంగమ్మ కోకిలకంఠమెత్తి పాడితే వీధిలో పోయేవారంతా తమతమ పనులు మరచిపోయేవారు. ఆ పిల్ల చదువు, బుద్ధి, చూచి బాల సరస్వతియని పిలవ మొదలు

పెట్టారు. మంగమ్మ భర్తను చూడాలని అందటికి సరదా. అమ్మాయీ నీ మొగుఁ జూస్తే చూపించాలి అని అంటూవుంటే, మంగమ్మ ముసిముసి నవ్వులతో సిగ్గుతో మోమువాల్చుకొని బడికి పారిపోయేది. మంగమ్మ చదువుముద్దు. ఆటముద్దు. పాట ముద్దు. ఇంట్లోముద్దు. బడిలోముద్దు. ఊళ్లో ముద్దు. అంతా ముద్దే. ముద్దులమూట మంగమ్మ.

రెండుజాములవేళ సూర్యుఁడు మండిపడు తున్నాడు. పోస్టుబంట్రోతు కార్డుతెచ్చి రామశాస్త్రిగారి కిచ్చినాఁడు. చూడగానే శాస్త్రిగారు పిడుగడచినట్లు హా సర్వేశ్వరా! అంటూ నేల కూలినాఁడు. శాంతమ్మ తొందరగా వచ్చి కార్డు చదివించింది. మంగా! మంగా! యని మొదలునరికిన అరటి చెట్టులాగు విరుగబడింది. తల్లిదండ్రులను జూచి మంగమ్మ బిక్కచచ్చిపోయి నిలవబడ్డాది. ఇరుగువారు పొరుగువారు ఊరంతా ఒక్కసారిగా తిరగ పడ్డారు. కన్నీళ్ల కాలువల గట్లు తెగిపొయ్యాయి. మంగమ్మను వెనకింటికి తీసుకపోయినారు. శీతలోపచారాదులు చెయ్యగా చెయ్యగా ఆదంపతులకు క్రమంగా తెలివివచ్చింది. నా మంగమ్మ మండిపోయిందని శాంతమ్మ మొత్తుకొని యేడ్చింది. నా వేదాలు, నా శాస్త్రాలు, నా పూర్వాచారాలు, నా దానధర్మాలు నన్ను కాపాడలేదూ! అని రామశాస్త్రి మొత్తుకున్నాఁడు. మంగమ్మను కౌగిలించుకొని తల్లి దండ్రులు హద్దూ పొద్దూ లేకుండ గోలపెట్టారు. వచ్చీరాని జ్ఞానం. తెల్లపోయి చూస్తుండేది మంగమ్మ. ముద్దంతా మంటలో కలిసింది. బడికి మాననని రోజూ మంగమ్మ యేడుపే. తల్లీ దండ్రీ అతికష్టంమీాద తెలియజెప్పి బడి మానిపించారు.

మంగమ్మ కిటికీలో కూర్చొని, బడికి పోతూవస్తూవుండే పిల్లలను పిలిచి, బడికబుర్లు మాట్లాడుతూ యేడుస్తూ ఉండేది. ఏదియేలాగున్నా, కాలమూగదు. కొన్ని సంవత్సరాలు గడిచాయి. శివరాత్రి వచ్చింది. చుట్టాలు పక్కాలు శాంతమ్మగారింటికి వెళ్లి బసచేశారు. శాంతమ్మతోను, శాస్త్రిగారితోను, ఖండితంగా చెప్పారు:—మీాదిపేరు ప్రతిష్ఠలుగల కటుంబము. మంగమ్మను ఇంకా ఆలాగు నుంచడం బాగులేదు. చాలా అపకీర్తి పాలై పోతారు. రేపు శివరాత్రి. కోటిలింగాల రేవున మొక్కు చెల్లించుడని—వారి ముల్లెంతా పోయినట్లు గట్టిగా చెప్పారు. రామశాస్త్రి కొందఱి స్నేహితులతో 'చూడండి! ఈ ఆచారం అంత న్యాయంగా కనబడదు. వైష్ణవులే ఈ విషయంలో మంచిఆచారం చేస్తున్నారు. మంగలిమాత్రం పరపురుషుఁడు కాఁడా? వానినిమాత్రము స్పృశింపవచ్చునా?' అని అన్నాఁడు. 'శాస్త్రిగారూ, మీారే ఆలా

గంటే ఈ పంచభూతాలు గతులు తప్పి పోతాయి. పూర్వాచారం బుగ్గిలో కలసి పోతుంది. మనసు రాయిచేసికొని రేపు ఆ శాస్త్ర కాం జేయ్యండి అని చెప్పి కట్టుగా చేసివేసేరు. శాస్త్రియిష్టంతో నేమిపని యుంది? మంగమ్మ కేశపాశం గౌతమిలో చిన్ని తెప్పలాగు మునిగిపోయింది.

అదిమొదలుకొని మంగమ్మ ఒంటిపూటలతోను వ్రతాలతోను సగం అయిపోయింది. ఎంత కురూపినిచేసినా ఎంత విరూపిని జేసినా, మంగమ్మ సొబగునకు విరుగు తరుగు లేదు. తల్లి దండ్రుల కంటికి అమృత వర్తి, మంగమ్మ నేడు అగ్నిజ్వాల అయింది. మంగమ్మను చూస్తే మంట. చూడకపోతే మంట. ఆ దంపతుల మనోమయకోశం నూరు తేళ్లు ఒక్కసారి కుట్టినట్లు, అగ్గిలోపెట్టి పుటంవేసినట్లు, యంత్రంలోపెట్టి పీల్చి పిప్పి చేసినట్లు, సమ్మెటపోటులతో కొట్టి సాగతీసినట్లు, మహా వేదనలో మునిగిపోయింది. వారి కంటికి జీవయాత్ర ఈ ప్రపంచము అంతా గాఢాంధకార బంధురమై పోయింది. ఆచారాలు వ్యవహారాలు నిష్టలు నియమాలు అన్ని, కట్టిపెట్టారు. మంచాలు పట్టారు. క్రమంగా బల్లులులాగు గోడకు అంటుకుపోయారు. శాంతమ్మ ముందుగా మంగా, మంగా, యని పరలోకయాత్ర సాగించింది. దీనితో శాస్త్రిగారిగుండె అప్పుడే జారిపోయింది. నెల తిరుగకుండగనే శాస్త్రి గారున్నూ శాంతమ్మను కలుసుకొన్నారు.

మంగమ్మకు పదునారేండ్లు నిండలేదు. దిక్కుమాలిన పక్షి అయింది. కొండంత సంసారం గోటిమూలకు వచ్చింది. ఎటు చూచినా దారి తెన్ను కనబడలేదు. ఆర్చేవారు తీర్చేవారు అంతరించారు. అమ్మ అబ్బలు లేరు. విసుగు ముసుగు క్రమంగా వచ్చాయి. కాని చదువులంటే చెవి కోసుకుంటుంది మంగమ్మ. పూర్వపు చెలికత్తెలు వచ్చి బోధచేయడంవల్ల కొద్దిరోజులకు సాహసం అవలంబించింది. వితంతు కళాశాలలో ప్రవేశించాలని నిశ్చయించుకుంది. తన సంసారం అంతా చక్కబెట్టుకొని చివరకు కళాశాలలో ప్రవేశించింది. మంగమ్మపేరు మనసునకు నచ్చలేదు. వెంటనే మార్చుకొంది. స్కూల్ రిజిష్టరీలో మాలతి. అయిపోయింది. కష్టాలను మరచి గాఢంగా చదువు మొదలుపెట్టింది. క్లాసు పిల్లలలో నగ్రస్థాన మలంకరించింది. ఉపాధ్యాయుల మెప్పువడసింది. శివలింగం వచ్చిందని తోడిపిల్లల వెక్కిరింతలకు తాళలేకపోయింది. వెంటనే కొంత మార్పును చేసింది. కొలదికాలంలోనే మంగమ్మకు కేశపాశం చీకటి రాత్రిలాగు వచ్చివేసింది. రోజు రోజునకు వేషంతోపాటు భాష కూడ బలుపెక్కింది. పూర్వము బాల సరస్వతిగానున్న దిప్పుడు తరుణ సరస్వతియై

పోయింది. నాటకాలకు; సినీమాలకు తప్పకుండా వెళ్లేది. మాలతితో సమానులు మఱి లేనేలేరు. వార్తాపత్రికలంటే చెవికోసుకొనేది. భారతి, గృహలక్ష్మి, పక్కనుంటేనే గాని నిద్రపోయేదికాదు మాలతి. కళాశాలలో నాటకాలు వేస్తూవుంటే శాకుంతలములో శకుంతల ఉత్తరరామచరిత్రలో సీత మొదలగు ప్రధాన పాత్రలను ధరించేది మాలతి. ఈ కాలంలో మాలతి డాబామీద కూర్చొని గౌతమిని చూస్తుంటే ఆతరంగాలు ఆ ప్రవాహాలతోపాటు తన సంకల్పాలు మనోరథాలు గట్టుతెగి పారుతూ ఉండేవి. తన మనస్సులోనే మాలినీతీరము. దానివెంట మునిపల్లెలు, వానిచెంత పువ్వులతోటలు, వానిలో దుష్యంతుడు, లేడిపిల్లలు, ప్రియంవద, అనసూయ, వారిమధ్య తాను-శకుంతల తటాలున అయిపోయేది మాలతి. గంగయొడ్డున వాల్మీకి యాశ్రమము దగ్గఱ సీత అయిపోయి వలవల యేడ్చేది మాలతి. గౌతమీ ప్రవాహవేగం జూచి యేమమ్మా! భర్తతో కలియాలని యీ నదికి యింత తొందర అని నివ్వెఱపడేది. పక్షులు తమ పిల్లలకు ముక్కులతో వెన్నులు పట్టుకొని కలసి మెలసి పోతూవుంటె వాటిప్రేమలో లీనమైపోయేది. రాత్రులు నిదురలేక మనస్సులో నేమేమో భావిస్తూ గడిపివేసేది. సంస్కర్తల వ్యాసాలు విసుగులేకుండ చదివేది. త్రోవా తెన్నులేని పూర్వాచారాలంటే చీదరించుకొనేది. పురుషులకు వివాహాల్లో సర్వస్వేచ్ఛయట. రజస్వల కాకపూర్వము స్త్రీలకు వివాహంచేయకపోతే తల్లి తండ్రి కన్యక బండకట్టుకొని భావిలో పడాలట! బజారులో కొయ్యబొమ్మలాగు ఈడుజోడు కుదిరిన పెండ్లికొడుకులు వందలు వేలు దేశంలోనుంటారా? నూరేళ్లు బ్రతికే బ్రతుకు తొందరపడి పనికిమాలిన వానిచేతిలో పెట్టమంటారా?

"పెండ్లియాడటానికి కర్త వరుడు. వానికి వయస్సు నిర్బంధం లేకుండా కన్యకు వయస్సు నిర్బంధం పెట్టితే అనురూపసంబంధాలు ఏలాగు సంఘటిస్తాయి అని లోకజ్ఞులైన మహర్షు లెట్లనుకొన్నారో నాకు తెలియదు. మనువు అనురూపమైన వరుడు దొరకకపోతె ఆమరణాంతము పెండ్లిలేకుండా కన్యను ఉంచివేయమన్నాడు. రజస్వల అయిన తరువాత మూడువర్షాలదాక తండ్రికి కన్యాదానమునకు అధికారం ఇచ్చినాడు. పిమ్మట కన్యకే స్వయంగా వివాహాధికారం ఇచ్చినాడు. ఇంత విశాలహృదయంతో లోకజ్ఞానంతో చెప్పిన మనువు ప్రమాణం కాదట. అమ్మా అబ్బాలేని శ్లోకాలు ప్రమాణమట" అని మాటిమాటికి తలపోసేది మాలతి.

ఆనాడు శివరాత్రి యాత్ర; తండోపతండాలుగా ప్రజలు వచ్చేరు. మాలతి స్వామి

దర్శనంచేసి వస్తూవుంది. ఒక ముసలమ్మ పావంచాలు దిగలేక తొట్రుపడుతూంది. మాలతి యామెచేయి పట్టుకొని భద్రంగా దింపింది. ముసలమ్మ దేవుని దర్శనం చేయించమని మాలతిని కోరింది. మాలతి చేయించింది. దుర్గకోవిలదగ్గఱ యిద్దఱు నిలబడి యుండగా ఒక యువకుడు వచ్చి ముసలమ్మ చేయి పట్టుకొన్నాడు. నాయనా! మాధవా! యెక్కడకు వెళ్లినావురా? అని ముసలమ్మ అడిగింది. అమ్మా! మా ప్రిన్సిపాల్‌గారు యాత్రకువచ్చి నన్నుచూచి పిలిచి వారి కళాశాలలో లెక్చరర్‌పోష్టు కాళీ అయింది. నన్ను దరఖాస్తు పెట్టమన్నారు. అందుచే ఆలస్యం అయింది అన్నాడు. మన దిగుళ్ళు తీరిగేయి కాబోలు నాయనా? ఈపిల్ల యెంత మంచిదో చూడు. నాకు నింపాదిగా దేవ దర్శనం చేయించింది. మనశాఖ పిల్లట అని చెప్పి చూపించింది ముసలమ్మ. మాలతీ మాధవుల చూపులు ముసలమ్మ తెరచాటున బ్రహ్మముళ్ళు వేసుకొనుటకు అప్పుడే ఆరంభించాయి. ఆ పరమేశ్వరుని యెదుటనే జంకుకొంకు లేకుండా విజృంభించాడు మన్మథుడు. హావాలు భావాలు అన్ని కుప్పతిప్పలుగా ఉప్పతిల్లేయి. యాత్ర ముగిసింది. ఫాల్గుణం వచ్చింది. మంచిముహూర్తాన యథావిధిగా పెండ్లి అయింది. మాలతియే దాత, మాలతియే కన్య. సంస్కర్తలే కాదు సనాతనులు కూడ లోలోన సంతసించారు. ఆ నూతనదంపతుల కష్టాలు దైన్యాలు ఆ నాడే గౌతమీప్రవాహంలో అడుగంటాయి. బ్రహ్మానందరసతరంగడోలికలలో వారు ఉయ్యాల లూగినారు. ఊగుతున్నారు. ఊగుతారు.

జాతకాల వెఱ్ఱిగురించి

'అనసూయ'

(మగని చెవిలో)

చదవవేస్తే ఉన్నమతీ పోయిందన్నట్లు యీ జ్యోతిష్యం యెక్కడ వచ్చింది? రాత్రీపగలూ యిదో పనిపట్టేరు! ఎంతసేపూ గురుడులో శనీ, శనిలో శుక్రుడూ, అంటూ కూర్చుంటారు! ఆసింహ తలాటం మురుగుల దిబ్బవాడొకడు బాగా దొరికేడు మీకు! ఇంత ప్రపంచజ్ఞానం లేకపోవడం నేనెక్కడా చూడలేదు! పెద్దపెద్ద చదువులు చదుకొన్న ప్లీడర్లమంటారు! ఇలాంటివాళ్ళ డచ్చీలన్నీ నమ్ముతూ ఉంటారు! ఏదో ముందు పెద్దబ్రహ్మాండమైన మహాదశ వెళిపోతుందని వాడు నాలుగు పొగడ్తమాటలు ఆడేసరికి భుజాలు పొంగిపోయి రోజూ వాడికి యింట్లో తిండీ, దక్షిణా, తాంబూలాలూ, చదివించేస్తూఉన్నారు! వాడేం మామూలు తిండి తింటాడా? ఘనాపాటీ! అందరూ వకయెత్తు, అగస్త్యమహాముని వకయెత్తు అన్నరకంలోనివాడు! ఏమిటని చెప్పి పొంగవేసేడు?

మీకు వాహనయోగము, రాజసన్మానము, ఉన్నాయా? స్థానచలనం కూడానా?

'నీ కెలాగు తెలిసింది?'

కొనముక్కలు రెండు చెవినిపడ్డాయి లెండి! మీరు యిలాగు వృత్తియందు లక్ష్యము లేకుండా టప్పాలు కొట్టుకుంటూ నోవల్సు చదివేస్తూ క్లబ్బులో కాలక్షేపం చేసివేస్తూఉంటే, జ్యోతిష్కుడు అక్కర్లేను, నేనే చెప్పగలను, తప్పకుండా ఈమూడు యోగాలు మిమ్మల్నిపట్టి ముద్దులాడతాయని! ఎలాగు పడతాయా?

'కోరికల బొంగి పనిసేయ కూరకున్న కలుగు నియ్యెడను ప్రయాణకారణంబు' అన్నమాస్తరుగా ఈపనిలో అంతకంతకు ఏమీ దొరకక, పార్టీల సొమ్ము తినేస్తే పట్టాకు భంగంవచ్చి రాజసన్మానం జరుగవచ్చును. లేకపోతే, రాబడిలేక ఆఖరికి డ్రైవరుపనిలో మీప్లీడర్లు కొందరు దిగినట్లు మీరూ దిగిపోతారు! కాని మీరు కొత్తపూజార్లు గనుక చేతకాక ఎవరినో మట్టించేస్తే పోలీసువారొచ్చి పట్టుకుంటారు! అప్పుడు రాజసన్మానం జరుగుతుంది! కేసు విచారణ అయినతర్వాత కంగాలీ మేస్ట్రీటు మీమీద కావేషీ మనస్సులో పెట్టుకొని కలెక్టరు ఊళ్లో లేనికాలము కనిపెట్టి శిక్షవేస్తూ తీర్పుచెప్పి మిమ్మల్ని హుటాహుటీని ఎగువకు కట్టివేస్తాడు! అప్పుడు స్థానచలనం సంప్రాప్తమవుతుంది!

ఈపాటి చెప్పినందుకు వాడికి పదిహేనురూపాయిలు పెల్లలలాగు చెల్లించియ్యాలా? నాకు ఒక్క మంచిచీర కొనిపెట్టి చూడండి! మీపుట్టుపూర్వోత్తరంనుంచి జరిగినవీ జరుగుతున్నవీ పూసగుచ్చినట్లు మీగురించి అన్నీ చెప్పేస్తాను! వాడు ఏమిటంత దాఖలాగా చెప్పేసేడు మీకు నమ్మకం పుట్టించడానికి!

'చెప్పకేం! చాలా చెప్పేడు!'

ఏదీ! కొన్ని చెపుదురూ విందాం!

'నాకు చిన్నప్పుడు జలగండం తప్పిందన్నాడు.'

చిన్నప్పుడు చెరువులో, యేటిలో, వెళ్ళని కుర్రవాడుంటాడా? వాడు అక్కడ గెంతుతూఉన్నపుడు

"రంగవల్లులఁ బెట్టు కురంగనయన"

'దృగ్విలాసము'

గృహలక్ష్మి

శ్రీమతి కంభంపాటి సుగుణమహాలక్ష్మమ్మగారు,
బి.ఏ. యల్.టి.,

పాకుడు పావంచామీద ఏమాత్రం చిన్నపిసరు కాలు జారినా అది జలగండం క్రిందనే లెక్క!

'నాకు అగ్నిగండాలు తప్పేయన్నాడు.'

ఔను! ఏమంటే, చెడామడా సిగరెట్లు కాలుస్తారుగదూ! రొయ్యి లాల్చీమీదో వాణీమీదో పడి కొంచెం అవి కాలిన తర్వాత ఆరిపోతూ ఉంటుంది! అవన్నీ అగ్నిగండాలు కావూ?

'నా తండ్రి నాకు ప్రాజ్ఞత రాకముందే పోయినట్లు చెప్పేడు! దీని కేమిటంటావు? పితృమారకం దాఖలాగ లేదూ?'

అయ్యో సత్యకాలమా! ఇంట్లో నాలుగురోజులు భోజనం చేసినవాడు మీఅమ్మగారి బుర్రచూస్తే ఆ పాటి చెప్పకోలేడూ? ప్రాజ్ఞత రాకముందంటే అర్థ మేమిటి? మీకు యిప్పటికి మాత్రం ప్రాజ్ఞత వచ్చిందా యేమిటి? చిన్నప్పటినుండీ ఇప్పటిదాకా ప్రాజ్ఞత లేనిలోనే జమ! ఎంత కష్టపడి చెప్పేడు పితృమారకము!

'సంతానసష్టం గురించికూడా చెప్పేను!'

సరి! శిశుసంరక్షణ సంఘంవారి లెక్కలు తీయిస్తే ఎవరైనా చెప్పవచ్చును-కానుపు నష్టంలేని ఆడది కలికాలంలోనే లేదని!

'ఇప్పుడు కొంచెం నలతరోజులుగా ఉన్నాయనీ. మనస్సు చికాకుగా ఉంటుందనీ, ఇలాగు ఇంకా చిక్కులు కొన్నాళ్ళుంటాయనీ, చెప్పేడు.'

అసంగతులు మీముఖం చూడగానే చెప్పవచ్చును! దానికి గ్రహాలు చూడడం యెందుకు? అసలు రోగం లేనివారు డాక్టరు దగ్గిరకి చేరనేచేరరు! అందుచేత, యిట్లు చేరిన మీలాంటి ప్రతీవారికీ యీ అసంగతులు చెప్పవచ్చును. ఇంకా యేమిటి చెప్పేడు?

'ద్వికళత్రయోగం ఉన్నట్లు జాతకంవల్ల కనిపిస్తున్నా దన్నాడు!'

అల్లా మేష్టరుకి కూడా అలాగే చెప్పేడట! అతని పెళ్ళాం మొన్నను తిడుతున్నాది! అయితే మీలాంటివాళ్ళందరికీ అది సంతోషమైన కబురు గదూ! ముసలికాలానికి ముచ్చట్లు! కర్ణమంత్రాల కాలానికి కామతంత్రాలు! ఇది లోకరివాజు! కొత్త ప్రియం, వేడిరుచి! ఈపాతపెళ్ళాలు మరెందుకు! మలిపెళ్ళాం మామిడిపండు! అయితే ఎంతట్లో పడుతుందన్నాడు మీకు ఈద్వికళత్రమహారాజ యోగం?

'ఇంకా మరో దశపోతే జరుగవచ్చునన్నాడు?'

సరి! యీభై పొలిమేరనా? అప్పటికి మీముసలి ప్లీడరు పోతాడు, వాడి చార్జి మీరు అందుకుంటారు కాబోలు! అప్పటికి మీ రెక్కడో యీజ్యోతిష్కు డెక్కడో! మును పెవడో మూడు నాలుగేళ్ళలో అన్నాడేమో? అప్పుడే నాయొక్క గ్రహాలు మారి పోయేయా యేమిటి? లేకపోతే నామారకగ్రహాలన్నీ వీడిని చూచి మారు మూలలంట దాగుతున్నాయా? పిల్లలనుగురించి యేమైనా చెప్పేడా?

'ఏమి చెప్పితే నేం! నీకు నమ్మకం లేనప్పుడు?'

అలాగు కాదు! వాడియొక్క దగాశక్తి చూద్దాం చెప్పండి!

'మన రుక్మిణికి గొప్పధనం ఉన్న సంబంధం దొరుకుతుందిట!

మన శాఖలో అల్లా పౌరోహిత్యాదులా గుంటాడు, వాడు తప్ప మరెవడూ గొప్పవాడు కనబడ లేదు! వాడి కొడుక్కి యిచ్చీయండి! గొప్పసంబంధం అవుతుంది పిల్లకి! అయినా యీగొప్పసంబంధాలంటే నాకు ఒళ్ళుమంట! కోడలు వస్తుందనగానే ఆ వున్నమట్టుకు పిప్పీ పిసరూ అత్తగారు తనపేర రాయించేసుకుంటుంది! కొడుక్కి నెత్తికి చేతులే! కోడలు కాలుపెట్టిన దగ్గిరనుంచీ అదబ్బున్న అత్తగారు సాధించడం మొదలెడుతుంది! అవిడె ఆడింది

ఆటా, పాడింది పాటా! ఏమంటే డబ్బున్నాది నాయిష్టం! ఇలాంటి సంబంధాలకన్న ఏకరగ్పూరు లోనో, కాళీమట్టీలోనో స్వతంత్రంగా రవ్వా రష్టూ లేకుండా యాభైరూపాయిలైనా తెచ్చుకుంటూన్న వాడికి యిచ్చేస్తే మేలుగాని యీడబ్బున్న సంబంధాలంటే నాకు తలనొప్పి! అల్లా పింఛినీఇంజనీరు అప్పూ సప్పూ చేసి నాలుగువేలు ఖర్చుపెట్టి పెద్ద సంబంధం అని పెళ్ళిచేసేడు! యిరవైమంది ఉన్న యింట్లో పడేసేడు! తాను కాళ్లు చాచేసేడు అప్పులతో! ఇక పిల్ల సంగతా! దాన్ని అత్తవారు 'నూరుకొని తాగేస్తూన్నారట! ఆపిల్లకి నోటమాట లేదు, కళ్ళచూపు లేదు, ఎప్పుడూ ఒదిగి ఒదిగి బెదురులేడిలాగు ఉంటుంది! అందుచేత, నేనుబ్రతికి ఉండడమే ఉంటే గొప్ప సంబంధం అన్నమాట కానివ్వనను కోండి! ఇంకా మరేమిటిచెప్పేడు!

మనపెద్దబ్బాయికి బాగా చదువువస్తుందిట,

మీకు చదువువచ్చి యింత వియ్యామ్మణించేము; వాడు చదుకొన్నతర్వాత ఇంకా విరగబడబోతాము! మీకాలంవాళ్లే ఇలాగు దిక్కులేక దేవులాడుతూఉంటే, ఇంకాముందు వచ్చేవాళ్ళకు గతేమిటిఉంది? ముల్లాలు ముష్టెత్తుకుంటూఉంటే పీర్లకు పంచదార యెక్కడి నుంచి వస్తుంది?

నాకు పంచాననయోగం ఉన్నదిట! మరో అయిదారేళ్ళు పోయినదగ్గరనుండీ మంచి ప్రభగా ఉంటుందనీ, అప్పుడు చాలా రాబడీ ధనార్జనా ఉంటుందనీ చెప్పేడు?

అలాగా! ఇప్పటి ప్లీడర్లందరూ అప్పటికి స్వర్గస్థులైపోయి కట్టలన్నీ మీమీద పారేస్తారా యేమిటి? లేకపోతే కట్టలకి కాళ్ళు వస్తాయా, పూర్వం కొండలకి రెక్కలు వచ్చినట్లు? మీకు పంచాననయోగం నాకుకాలసర్పయోగం చాలాకాలంనుంచీ పట్టిఉన్నాయి! మరేమిటి కొట్టేడు?

తర్వాతకొంతకాలానికి ఈ ఉద్యోగ పరివర్తన జరిగి ఏ జమీందారీలోనో మంచి రాబడీన్నీ అధికారమున్నూఉన్న దివానుగిరీలాంటి ఉద్యోగంకూడా అవుతుందన్నాడు! అప్పట్లోనే వాహనయోగము, రాజసన్మానము, స్థానచలనము, కలుగుతాయట!

ఓహో! మీకోసమేనా యిప్పుడు జమీందార్లందరూ తల్లడిల్లి పోతున్నారు! నేను వేసుకుంటానంటే నేను వేసుకుంటానని ఒకరిమీద ఒకరు పోటీకి వస్తున్నారు! మీరువెళ్ళి చక్కబెడతారనే కాబోలు వాళ్ళిప్పుడు అప్పులుచేసేసి గ్రామాలకి గ్రామాలూ, తనఖాలూ తాకట్లూ పెట్టేస్తున్నారు! ఎవడికండీ పట్టింది అంత దరిద్రం, మిమ్మల్ని దివాంజీగా తీసికెళ్లడానికి! అసలులో బ్రాహ్మణజన్మ! అందులో వైదికపుజాతి! అందులో ప్లీడరువృత్తి! ఆవృత్తిలో అడుగుమెట్టు! ఎవడికి కావాలండీ మీరు! ఏపింఛినీమేస్రీటో, ఏనత్తికలెక్టరో, ఏరిటైర్డు సబు జడ్జియో, ఏకోడిగుడ్లు తినేవాడో గొర్రెలు తినే వాడో, ఎవడో ఒకడు చెన్నపట్నంలోనే సిఫార్సు చేయించేసుకొని దిగిపోతాడుగాని మిమ్మల్ని చూచే వాడెవడండీ! ఏమో ఆవుతుంది కాబోలు దివాను పని! ఏ యానువారపుపేటకో ఏ ముష్టిఅగ్రహారానికో మిమ్మల్ని రాజసన్మానంకోసం తీసుకొని వెళతాయి కాబోలు మీగ్రహాలు! ఈచుట్టుపట్ల ఉన్నాయికావూ ఈపూటకిఉంటే ఆపూటకులేని జమీందారీలు! అప్పిస్తే దివానుపని యిస్తారు! మీ అమ్మగారిని అప్పు యివ్వమనండి, మీరు దివానుపని చేతురుగాని! పాడుకోటలో ప్రభుహోదా చెలాయించవచ్చును! రాజుగారు తిరిగివచ్చినతరువాత దివానుగారు ఆ సవారీలో ఎక్కవచ్చును! తోటాలు లేని తుపాకీపట్టుకొని ఉద్యోగంలేని బంట్రోతు వెనకాతల యీడిగిలబడి నడుస్తూఉంటే మాన్యాలు లేని చాకళ్లు సవారీమోస్తూఉండగా పనిలేని గుంటలు ప్రక్కలంట పరిగెడుతూఉంటే ఇలాగు రాజలాంఛనాలతో దివానుగిరీ చెలాయింతురుగాని!

ఆహా! వాడికంటే మతిపోయింది కాని మీ రెలాగు నమ్మేసేరండీ! దివానుపనులు కొట్లస వేలాడుతున్నా యనుకొన్నారా దులిపేసి తీసుకొందుకి! పాపము, కష్టేస్తున్నారు కాబోలు ఆకాశసౌధాలు! ఏదో పెద్దజమీందారీలో దివాంజీగా జొరబడి ఏదో మిషపెట్టుకొని అటూయిటూ తిరిగి హుజూరులో భత్యాలూ, లోసఫరులో సప్లయిలు మస్తుగా కొడదా మనుకొంటున్నారు కాబోలు! జరగని దానికి యీచిల్లర జమీందారీ లెందుకు? ఏమైసూరో, ఏ హైదరాబాదో, అటువంటి ఏ స్వతంత్రరాజ్యంలోనో దివానులైపోతాగనే అనుకుంటూఉండండి! మనస్సులో పాలుత్రాగడానికి జిల్లేడాకు దొప్పల ప్రారబ్ధమేమి? * * *

. అయితే మాతృమారకం యెప్పుడన్నాడు?

'ఇంకా గండుదశలు జరిగిపోవాలన్నాడు?'

అనరూ! ఆవిడె తలుపుసందునుంచి చూస్తూ శకిలిస్తూ మీమాటలన్నీ చెవలపిల్లిలాగు వింటున్నాదని పసిపట్టేడు! ఏమైనా తభావతు చెపితే పేడనీళ్లు పోసేసి దూలగుండాకు రాసేసి చీపురుకట్టతో వెంట తరుముతుందని తెలునును.

అయితే మీకు దివానుపని అవుతుందా! ఆహా! ఏమి అదృష్టమండీ! మనపిల్లలని దివానుగారి పిల్లలని అంటూ ఎత్తుకుంటూఉంటారు కాబోలు! అవును గాని, వాడు యీవూరువచ్చి యెన్నాళ్లైందో తెలుసునా? నెల్లాళ్లైంది! ఎలాగు తెలుసునా! రోజూ చెరువునుంచి స్నానంచేసివస్తూ కనపడుతున్నాడు! ఎందరిళ్లలో తిష్టవేసి యీజాతకాలు చెపుతున్నాడో తెలుసునా? ఇదివరకు అయిదుగురి యిళ్ళలో అయిదుగురికి దివానుపనులు ఇచ్చివచ్చేడు! మనది ఆరో యిల్లు! ఎక్కడనుండి ఊడిపడతాయో గాని ప్రతీ వాడికీ దివానుపనే! ప్రాక్టీసులేని ప్రతీప్లీడరుకీ మంత్రిపదవే! మీ రెలాగు నమ్మేసి పొంగిపోయి వాడిచేతులో దోసెడురూపాయిలు పోసేసేరండీ! నాకు చిత్రమౌతుంది!

'నేనూ అలాగే అన్నాను! ఈ కాలంలో మాలాంటివాళ్లకు రాజకీయోద్యోగా లెక్కడ, అని నేనంటే వాడొక లెక్చరుకొట్టి కథచెప్పేడు!'

ఏమిటి చెప్పేడు?

"అయ్యా! మనుష్య బలములో ఏమున్నదండీ? గ్రహబలమే బలము! ఇవాళ ముష్టివాడు రేపు రాజు కావచ్చును! ఇవాళ రాజు రేపు ముష్టివాడు కావచ్చును! పెద్ద చదువులు చదువుకున్నవాడు నిర్ధనుడు కావచ్చును! నిరక్షరకుక్షి లక్షాధికారి కావచ్చును! మీవూరు సొట్టకోమటి నిళానిగాడైనా నిఖారంగా రెండులక్ష లార్జించేడా లేదా? అంతెందుకు? ఇక్కడ పెద్ద ప్లీడరు మీకన్న ఏవిధంగా గొప్పవాడో చెప్పండి? మీయీడు, మీజోడు, విద్య యెక్కువా, బుద్ధియెక్కువా? కాని అతడు తారాజువ్వలాగు మీదికి లేచిపోయేడా లేదా? మీరింకా అడుగు మెట్టున అంటిపెట్టుకొని ఉండడము మీదినముల సామాన్యం గాక మరేమిటి? అందుచేత, ఎంత దిగ్దంతులైనా వారి కలిమికి కారణము గ్రహబలమే గాని మనిషిలో లేదు! కాలం కర్మం కూడితే ఎటువంటివాడైనా గొప్పవాడై పోతాడు! గ్రహబలమే దైవబలమనుకోండి! రాసు ఉండాలిగాని ఎన్నివింతలైనా జరుగుతాయి! ఎట్టి అసాధ్యాలైనా సాధ్యాలవుతాయి! స్వప్నమందనుకోనివికూడా సంభవిస్తాయి! అయితే మనరాను బాగున్నప్పుడు ఇదంతా మన ప్రయోజకత్వమే అనుకుంటాము! రోజులు బాగులేకపోతే గ్రహాలవైపు తిరుగుతాము గాని రోజులు బాగుంటే సర్వానికీ స్వశక్తి సామర్థ్యాలే కారణమని నమ్ముతాము! అలాంటివాళ్లకి యెప్పుడో గ్రహాలు తిప్పికొడితేనే గాని కంటిపొర విడదు! పని బర్తరఫు అయిపోయి సంచీ భుజాన్న వేసుకొని చప్పులాగు కూరలు కొనుక్కొనే సబు

ఇన్స్పెక్టరుకీ, ఇన్స్పెక్టరుగా ప్రమోషను అయినట్లు అప్పుడే ఆర్డరు అందిన సబ్ ఇన్స్పెక్టరుకీ కంటిపొరలలో ఎంత తేడా ఉంటుంది? వాడికి ప్రతివంకాయలోనూ గ్రహాలే కనబడుతూ ఉంటాయి! వీడికి ప్రతివస్తువులోనూ జార్జి చక్రవర్తిగారి కిరీటాలు ధరించిన తన బొమ్మలే కనబడుతూ ఉంటాయి! అందుచేత గ్రహబలము చేయలేని దేదీలేదు! పూర్వము మీవంటి అపనమ్మకపువాడి కొకడికి ఎవడో గొప్ప జ్యోతిష్కుడు ఫలానారోజున నీకు రాజసన్మానం జరిగి మహోన్నతపదవి సంప్రాప్తమౌతుందని చెప్పినాడట! వీడుమాత్రం నమ్మలేదట! మీను మిక్కిలి ఆ చెప్పినరోజున రాజుగారిని కొట్టి రాజుగారికాగ్రహం పుట్టిస్తే వీడిజ్యోతిష్యం ఏమి అవుతుందో చూద్దామని నిశ్చయించి అలాగే రాజుగారు సభతీర్చి నిండుకొలువున సింహాసనం మీద కూర్చొనియుండగా వీడు చరచర లోపలికి వెళ్లి ఫడాలున రాజుగారి దవడమీద అదిపెట్టి లెంపకాయకొట్టినాడట! లెంపకాయ కొట్టగానే రాజుగారి తలపాగా క్రిందపడిపోయిందట! దానిలో పెద్ద నాగుపాము ఉండి పాగా క్రిందపడగానే అది బుస్సుమని పైకి వచ్చిందట! అప్పుడు రాజసేవకులు దానిని చంపివేసినారట! సభవారున్నూ రాజుగారున్నూ వీనిని చూచి ఇంత అద్భుతంగా పాగాలో పామున్న సంగతి పోల్చుకొని ధైర్యముగా వచ్చి ప్రాణం రక్షించినాడని చాలా సంతోషించి గౌరవించినారట! రాజుగారు వెంటనే వానికి మంత్రిపదవి యిచ్చినారట! అతగాడు చెప్పేడు!'

మరేం! రేపు మధ్యాహ్నం కోర్టుకు వెళుతూనే మీకలెక్టరునో జడ్జీనో ఒక్క లెంపకాయ కొట్టేసి రండి! అప్పుడు మీకే కాకుండా మీకు చెప్పిన జ్యోతిష్కుడికి కూడా గాజసన్మానము, స్థానచలనము, ఉద్యోగపరివర్తనము, అన్నీకూడా సంప్రాప్తమౌతాయి! అయ్యో! అమాయకపు బ్రాహ్మడా! మనవాళ్లు ఈపాటి కథలు కల్పించలేరండీ! మీరు రోజూ చదివేనవలలూ నాటకాలూ ఏమిటండీ? మనిషియొక్క ఊహనుబట్టి చమత్కారంగా ఇట్టి కథలు కల్పిస్తారు గాని దివాను పనులు ఇప్పించడం, కట్టలు లాక్కురావడం, ఇవేనా గ్రహాలకు పని? ఇంతకూ మీరు నమ్మడానికి నాకాశ్చర్యంవేస్తుంది! ఇదివరకు చేతిగీతలవెర్రి! ఇటీవల ఈజాతకాలవెర్రి! పూర్వం కొన్నాళ్లు మంత్రాలవెర్రి! మొదటినుండి కొనదాకా సాలిగ్రామాలవెర్రి! తంత్రాలంటే సరేసరి! ఎవడైనా ఈచేతిలో రూపాయి ఆచేతిలోనికి తెప్పిస్తే వాడేదో గొప్పసిద్ధుడని మీకు నమ్మకం! అలాంటివాళ్లకు అయిదేసి రూపాయిలు యిచ్చేసేవారు! కర్ణపిశాచాలు ఉన్నాయని కొందరు, తలచుకున్నది చెప్పేస్తామని కొందరు, చెయ్యిమీద చక్రంవేస్తామని కొందరు, ఇలాగు మిమ్మలిని టోపీ వెయ్యనివాళ్లులేరు! మీదగ్గిర డబ్బులాగనివాళ్లులేరు! తొడలో మచ్చ ఉన్నాదని ఎవడో చెప్పేడని ఆవేళ పొంగిపోయి పుంజెడు రూపాయిలు యిచ్చేసేరు గదా మిమ్మలిని ఏమిటంటే తప్పవుంది? దెయ్యాన్ని చూసేనని చెప్తే దేవతాదర్శనమైనంత సంతోషం! కాని, బాగా చదువుకొన్న పండితుడో లేక శాస్త్రజ్ఞుడో వస్తే కాతరు లేదుగదా! కానీ అయినా యివ్వరు! పాపం! మీరు ఏమంత్రాలూ పారేయికావు! ఏసిద్ధులూ సిద్ధించేయికావు! ఏ ఉపాసనలూ ఉద్ధరించేయికావు! దేనివల్లనైనా సులభంగా కడుపులో చల్ల కదలకుండా ధనార్జన జరుగుతుందేమోనని, కుంమకికుండా ఒక్కమారువచ్చి పడిపోతుందేమోనని, ఏ ఆశ్రమమో కాలనేమిలాగు కల్పించుకొని కాలక్షేపము చేయవచ్చునని, చాలా ప్రయత్నాలు చేసేరుగాని సాగలేదు! మంత్రతంత్రాలుమర్దనా చేసి మానేసేరు! లాటరీలకుకట్టి విసుకెత్తిపోయినారు! సాలగ్రామాలు సంపాదించి సంచులు నింపేసేరు! పాతుడు గురించి వాడి ధర్మమా అని యెవడూ ఆశపెట్టలేదు గాని లేకపోతే యీపాటికి

రెండుమూడు నూతులు తవ్వించవలసినవారే! భర్తృహరి చెప్పినట్లు 'నిధియను శంక భూతలము నిచ్చలు త్రవ్వితి' అన్న మోస్తరుగా చేసేరు. ఫలం దానిలో చెప్పినట్లే అయింది! ఇకను ఇప్పుడు జాతకాలమీద పడ్డారు! ముందుముందు గురుడో శనో ఎవడోవచ్చి పిలకపట్టుకొని యెత్తేసి పట్టాభిషేకం కట్టేస్తాడని చెప్పిన వాడికల్లా నమస్కారాలుపెట్టి నాలుగూ అయిదూ దాఖలు చేసుకుంటున్నారు!

ఇలాంటి డాబుసరాయుళ్లని పెట్టుకొని గురుడులో శనీ, శనిలో శుక్రుడూ, అని అస్తమానమూ కూర్చుంటారుగదా ఏమిపని యింక! ఎందుకొచ్చింది? కూడుకు పనికొస్తుందా, గుడ్డకు పనికొస్తుందా? ఇదివరకు అలాగు పార్టీలు అరుగుమీద పడుక్కునేవాళ్లు! ఇప్పుడు అరుగుమీద కుక్కలు సందడేగాని పార్టీవాళ్ల అలికిడే లేదు! ఇలాగు రాబడి సన్నగిల్లిపోతూ ఉన్న ఈరోజులలో ఇదో దూబరాఖర్చు ఎందుకు పెట్టేస్తూంటారు? మనజాతకాలు మన ముఖాల మీదనే వ్రాసిఉన్నాయి! నేను చెప్తాను వినండి! ఈయింట్లో ఉన్నంతకాలం మీకు మనస్వాస్థతఉండదు! ఈవృత్తిలో ఉన్నంతకాలం మీకు రాబడి ఉండదు! ఈరెండూ ఇలాగుఉంటే మీకు ద్వికళత్ర యోగంకాదు, త్రికళత్రయోగం కూడా పడుతుంది! ఇక ఉద్యోగ పరివర్తనమా! గురుడులో శని రానియ్యండి, శనిగాడు.శుక్రుడిని భుజాలమీద గుర్రపుపందు వేసుకొని మీకచేరిసావిట్లో నాట్యమాడనియ్యండి: మీకు ఈ ఉద్యోగముపోదు! మరొక ఉద్యోగంరాదు! ఎందుకు వృథాగా డబ్బు వాళ్ల క్రింద విరజల్లుతారు! ఇక చాలించండి ఈ జాతకాలవెర్రి.

ప్రైవేట్ ట్యూషను—వడుగు

తాత కృష్ణమూర్తిగారు బి.ఏ; యల్.టి.

గొట్టికాయలాడకుండా మావాణ్ణి ఖాయిదా చేస్తే యెంత చదువైనా వొస్తుంది." "నాదగ్గిర గొట్టికాయలు, గిట్టికాయలు పనికిరావండి. పుస్తకం అంటుకుపోవాలి, అలాచదివిస్తానండి."

కన్యాశుల్కము.

ఇంటివద్ద కొన్నాళ్లదాకా ప్రైవేట్ ట్యూషన్ చెప్పించి, మా బావ నన్ను టవున్ స్కూలులో నాలుగోతరగతిలో ప్రవేశ పెట్టినాడు. కాని ఆయేడు పరీక్షలో నాకు మార్కులు తిన్నగారాలేదు. అయినప్పటికీ, మా బావవద్ద మొగమాటంచేత కాబోలు హెడ్ మాస్టరు నన్ను ఫెయిల్ చెయ్యలేదు.

"అబ్బాయీ, నీచదువు సంధ్యలు ఏమీ బాగులేవు. ఇటుపైని అయినా, శ్రద్ధగా చదివి బుద్ధిగా చదువుకుంటానని అంటేనే కాని నిన్ను పైక్లాసుకు ప్రమోషన్ చెయ్యను" అన్నాడాయన కళ్లెర్రజేసి.

అతి వినయంగా చేతులు నులుపుకుంటూ తలవంచుకొని ఆయనయెదుట నిల్చున్నాను. ఏం చెప్పడానికీ తోచలేదు నాకు. పరీక్షలు, మార్కులు, ప్రమోషన్లు—వీటి అర్థం ఇంకా నాకు సరీగా తెలియదు. 'చదువు కోవడం కదా ముఖ్యం? ఏక్లాసైతే నేం?' అనుకునే వాడిని.

ఫస్టుఫారానికి వచ్చినతరవాత నాకు యింటివద్ద చదువు చెప్పడానికి కొత్త ట్యూటరు కుదిరినాడు. అతగాడు మా హెడ్ మాస్టరు గారి మేనల్లుడే. పేరు పార్వతీశ శర్మ. కాని అందుచేత మేనమామ బలవంతంమీద నాకు ట్యూటర్ గా కుదురుకున్నాడు. మనిషి చిన్నవాడే. జుట్టుమాత్రం అక్కడక్కడ నెరుస్తూవుంది. ఒక కన్ను కొంచెం మెల్ల. బక్కపలచగా, చామనచాయగా ఉండే వాడు. నన్ను కొట్టకుండా మచ్చికచేసుకొని, ఓపికతో పాఠం చెప్పేవాడు.

మొదట నాకు ట్యూషన్ ప్రారంభించి నప్పుడు మంచిరోజుచూసి, వర్జాలు అవీ లేని సుముహూర్తాన నాచేత పుస్తకం చదివించాడు. నాకుగల లోకజ్ఞానం, భాషాపరిచయం, తెలివితేటలు యేమాత్రమో చూదామని కాబోలు, ఆవేళ నన్నొక కాంపొజిషన్ వ్రాయమన్నాడు.

"దేనిని గురించి రాయమన్నారు?"అని అడిగాను, కాగితం పెన్సిలుతీసి క్షణం ఆలో

చించి, "లొట్టిపిట్టనుగూర్చి వ్రాయి." అన్నాడాయన.

"దానినిగూర్చి నాకట్టే భోగట్టా తెలియదు. అది ఎట్లా ఉంటుందో నేనెన్నడూ చూడనైనా లేదు. బొమ్మలలో తప్ప. కొన్నాళ్ళదాకా 'లొట్టిపిట్ట' అంటే, ఏదో పిట్ట కాబోలనుకునే వాడిని. తరవాత తరవాత తెలిసింది, అదొక వంకర టింకర మెడగల పెద్ద జంతువని. దానిని గూర్చి అట్టే తెలుసుకోవలసిన అగత్యంకూడా ఎన్నడూ కలగలేదు. సామితె మాత్రం యెరుగుదును. 'సంగీతానికి నేను; అందానికి మాఅప్ప లొటిపిట!' అన్నదట గాడిద." అని చెప్పాను.

"పోనీ, నీకు బాగా తెలిసిన జంతువును గూర్చే వ్రాయి. గుర్రంగూర్చి వ్రాయగలవా?" అన్నాడాయన నవ్వుతూ.

'ఓ' అని ధైర్యంగా చెప్పి వ్యాసం వ్రాయడానికి ప్రారంభించాను.

'చూడూ, నువ్వు చదువుకున్న వాచకాలలోని గుర్రంపాఠం అప్పజెప్పమనికాదు నా ఉద్దేశం. నీ అంతట నువ్వు స్వంతంగా ఆలోచించి వ్రాయాలి. పుస్తకాలలోని ఎంగిలి ముక్కలకు దేవులాడకూడదు. 'ఒరిజినాలిటీ' ఉండాలి నువ్వు వ్రాసేదానిలో. నీయిష్టం వచ్చినట్లు స్వేచ్ఛగా వ్రాయి!' అని ఉపదేశించి ఆయన గదివెలుపలికి వెళ్లి, సిగరెట్ ముట్టించి, పచారుచేయడం మొదలుపెట్టాడు వరండామీద.

అరగంట అయింది; ముప్పావుగంట అయింది. నావ్యాసం పూర్తిఅయేటట్లు కనిపించలేదు.

నా వద్దకువచ్చి ఆయన, 'ఏమిటోయి, యింతసేపు వ్రాస్తున్నావు భారతంలాగ? ఆ వ్రాసింది చాలునులే. చూడనీ.' అంటూ నావ్యాసం అందుకొని తనలోచదువుకుంటూ నవ్వుకున్నాడు, కడుపు చెక్కలయేటట్లు, ఎందుకో.

నేను వ్రాసినది యిది:—

గుఱ్ఱము

గుఱ్ఱము గాడిదజాతి జంతువులలో నొకటి. గేదెవలె దానికి కొమ్ములుండవు కాని, స్వాములవారి పాంకోళ్ళవంటి టక్కుటక్కులాడు డెక్కలుండును. దానికి నాలుగు మూలలను మంచము కోళ్ళవలె నాలుగు కాళ్లుండును—ఇనుపనాళ్లతోనున్న రాళ్ళవంటి డెక్కలతో! గుఱ్ఱమునకు బలమంతయు వెనుక కాళ్లలోనే యుండును.

ముఖమున కెదురుగా దానికి నిడుపైన పెద్దతోక యుండును. సహజముగా పెరుగనిచ్చినయడల, తోక ముచ్చటగా ఆడపిల్లల

జడవలె మెదిగి వ్రేలాడుచు, పట్టి యీడ్వ వలెనని బాలురకు బుద్ధి పుట్టించును. కాబట్టి కొందరు తోకను పొట్టిగా కత్తిరించెదరు. తోక పొడవునుబట్టి, గుఱ్ఱములలో రకములేర్పడును. పొట్టితోక గుఱ్ఱమును స్వారి గుఱ్ఱమందురు. పొడుగుతోక గుఱ్ఱమును 'పోనీ' అందురు. మధ్యరకము తోక గుఱ్ఱమును జట్కా గుఱ్ఱమందురు.

ఇంకా తెల్లగుఱ్ఱము, నల్లగుఱ్ఱము, ఎఱ్ఱగుఱ్ఱము, బొల్లిగుఱ్ఱము, పంచకళ్యాణి గుఱ్ఱము, పెద్దగుఱ్ఱము, చిన్నగుఱ్ఱము, కర్రగుఱ్ఱము, తట్టగుఱ్ఱము, డంకాగుఱ్ఱము, ఆటగుఱ్ఱము, గుడ్డిగుఱ్ఱము, కుంటిగుఱ్ఱము, గుగ్గిళ్ళగుఱ్ఱము, తాపులగుఱ్ఱము, నీటిగుఱ్ఱము, అని అనేక రకముల గుఱ్ఱములుండును. బగ్గెబగ్గెలున్న పెద్దపులివంటి గుఱ్ఱమును, 'జీబ్రా' అందురు. మా స్కూలులో ఉమామహేశ్వరరావును శంఖుమూతి గుఱ్ఱమందురు.

అన్నిటికన్న హిందూదేశములో జట్కా గుఱ్ఱములే జాస్తీ. అవి ముందుకు, వెనుకకు కూడ నడువగలవు. ఒక్కొక్కప్పుడవి రోడ్డు మీద అడ్డముగా కూడ నడచుచుండును,— గిర గిర గుండ్రముగా తిరుగుచుండును— దారిపోయే మనుషుల మీదికి దుముకుచుండును.

పూర్వము మనదేశములో రాజకుమారులందరకును కీలుగుఱ్ఱము లుండెడివి. వాటికి రెక్కలుండెడివి కాబట్టి, అవి సప్త సముద్రములను దాటుచుండెడివి.

గుఱ్ఱము మిక్కిలి దుష్టస్వభావము కల జంతువు. వీపుమీద స్వారిచేయుటకు ముచ్చటపడు బాలురను మోసముచేసి, క్రింద పడవేయుటే దాని ముఖ్యలక్షణము. అదిగాక, మూతిపళ్లురాలున ట్లది వెనుక కాళ్లతో తన్నగలదు. లేదా వెక్కిరించునట్లు పండ్లిగిలించి, పైబడి కఱవగలదు.

తక్కిన జంతువులవలె గుఱ్ఱము పనికివచ్చే జంతువుకాదు. మన పూర్వులకాసంగతి తెలియక, గుఱ్ఱములను శ్రద్ధగా పెంచి వాటికి దంతధావనము కూడ చేసెడివారు. అందుకనే మావాళ్లు నన్నొక్కొక్కప్పుడు, 'ఏమిరా, ఇంతసేపును నీ వేమి రాచకార్యము చేయుచుంటివి? పెద్ద గుఱ్ఱమునకు పళ్లుతోముచుంటివా?' అని యడుగుచుందురు. ఇంట్లో గుఱ్ఱమున్నయెడల ఉపయోగము తక్కువేకాని, ఉలవల ఖర్చు యెక్కువ! ఎక్కి తిరుగుదామంటే, దానిమీదినుండి పడి, కాళ్లు, చేతులు విరుచుకుంటామేమో అని భయము. గుఱ్ఱమును బండికి కట్టినా ప్రయోజనము లేదు. మీదుమిక్కిలి, మొంత చక్కని బండి అయినా, మూడురోజులలో ముక్కలవక తీరదు. పర్లాకిమిడిలో రాజుగారి గుఱ్ఱ మొక

మాటు బగ్గీతోసహా చెఱువులోనికి దుమికినదట!

కాని, చాకలి పెళ్లిలో పెండ్లికొడుకును కూర్చోబెట్టుటకు గుఱ్ఱము పనికివచ్చును. వైద్యులు కొందరు గుఱ్ఱపు చెమటతో అశ్వగంధలేహమును చేసెదరు. పూర్వము మనరాజులు అశ్వమేధయాగమని, యేదో పండుగ చేసుకొని, గుఱ్ఱములను చంపి తినెడివారు.

మొత్తముపైని గుఱ్ఱము గాడిదకంటె విరుపయోగమైన జంతువు అందుకనే మనవాళ్లు తరుచుగ మొగపిల్లడిని తిట్టవలసివచ్చినప్పుడు, 'ఓరి గాడిద! ఓరి పశువ! పెద్ద అడ్డగాడిదలాగున్నావు కదా, బుద్ధిలేదూ?' అనెదరు. అంతేకాని, 'ఓరి గుఱ్ఱమా!' అని తిట్టరు. ఆడపిల్లని మట్టుకు, 'మంచి యేపైన గుఱ్ఱమువంటి పిల్ల! ఇంకా పెళ్లీ లేదు, పెడాకులులేవు.' అనెదరు.

*   *   *

'చబాష్! నిజంగా 'ఒరిజినాలిటీ' ఉందోయి నీ వ్యాసంలో కాని జాగ్రత్తసుమా, పరీక్షలలో కూడా యిట్లాగే వ్రాశావంటే, సున్న వస్తుంది నీకు!' అన్నాడు ట్యూటరు నవ్వుతూ.

'ఏం?' అన్నాను ఆశ్చర్యంతో.

పరీక్షలలో విద్యార్థులు తమ సొంతభావాలను ప్రకటించుకో కూడదనీ, 'ఒరిజినాలిటీ'ని పూర్తిగా చంపుకోవాలనీ, పుస్తకాలలో చదువుకున్న ముక్కలే చిలుకపలుకులవలె అప్పజెప్పాలనీ, యింకా ఏవేవో కొన్ని ధర్మ సూత్రాలు బోధించాడాయన.

నాతో సమానంగా ఆడుతూ, పాడుతూ, నన్ను కొట్టకుండా, తిట్టకుండా, బుజ్జగించి, శ్రమతీసుకొని పాఠాలు చెప్పేవాడు. మొత్తానికి, ఆయేడు పరీక్షలలో ఆయనకు మాట దక్కించి, మంచి మార్కులే తెచ్చుకో గలిగినాను.

ఆయేడు వేసంగి సెలవులలో నాకు ఉపనయనం చేస్తామన్నారు మావాళ్లు, చోర్లంగిలో—మా చిన్నఅన్నయ్య సారెతోపాటు! ఖర్చువెచ్చాలు కలసివస్తాయని కాబోలు, రెండు సుముహూర్తాలు ఒక్కమాటే పెట్టుకున్నారు. చుట్టాలు, స్నేహితులు చాలామంది వస్తారని తెలిసింది. శర్మగారిని కూడా నాతో చోర్లంగి రావలసినదని ఎంతో ప్రార్థించాను. మా బావచేత కూడా చెప్పించాను. కాని ఆయన మొగమాటంపడి రాలేదు.

మంచి వైభవంగానే జరిగింది నావడుగు! ఒకనాడు హరికథ, ఒకనాడు వీణపాట— ఇట్లా రోజూ ఏదో ఒక కాలక్షేపం ఉండేది. నాకు మాత్రం నలుగురిలో తలెత్తుకొని తిరి

గిందుకే ఎందుకో సిగ్గుగా ఉండేది. నా పంచ సిగలు, పసుపుగోచి, నా వేషం, చూసి అందరూ నవ్వుకుంటున్నారా అనిపించేది నాకు. కళ్ళు, కాళ్ళు ఎగరవేస్తూ సానివాళ్ళు ఆడుతూఉంటే, సభలో అందరికీ బలే ఉల్లాసంగా ఉండేది. నేనూ అప్పటికి అట్టే చిన్నవాడినికాను; పన్నెండేళ్లవాడిని. కాని ఎందుకో ఆ వేశ్యలను చూస్తే నాకు కోపంగా ఉండేది. వచ్చిన బంధువు లెవరికీ నామీద దృష్టేలేదు. ఆ పందిళ్ళు, ఆ సంతర్పణలు, ఆ బాజాలు, ఆ హడావిడి,—అవన్నీ నా వడుగుకు సంబంధించినవికావు కాబోలు !

ఇక ఆడవాళ్లందరూ మా వొదిన గదిలో చేరేవారు. సారెపెళ్లికూతురని దానికి పళ్లు, పువ్వులు, రవికలగుడ్డలు, మిఠాయిపొట్లాలు, అన్నీ తెచ్చి యిచ్చేవారు. వాసననూనెతో తలదువ్వి, జడలో పువ్వులుపెట్టి, దాన్ని ఎంతో చక్కగా సింగారించేవారు. జరీచీరలు, అత్తరులు, మిఠాయిలు, తాంబూలం, అన్నీ దానివంతు ! దీక్షాకౌపీనం, పంచసిగలు నా వంతు ! రాత్రి అయేసరికి మా వదిన గదిలో ఎంతో అలికిడిగా ఉండేది. ఆడవాళ్లు, పాటలు, ఫలహారాలు, తాంబూలాలు, నవ్వులు, అత్తరు ఘుమ ఘుమలు,........

ఆ వేడుకలలో, ఆ గడబిడలో నన్ను చూసేవాళ్లెవరు—ఒక్క ఆ పురోహితుడు తప్ప ? ఉదయం, సాయంత్రం, అగ్నిహోత్రం వద్ద గంటలకొద్దీ పొగలో నన్ను కూచోబెట్టి, చెవికోసిన మేకవలె ఏదో వల్లిస్తూ ఉండేవాడాయన. నాచేత సంధ్యావందనం తిన్నగా చెప్పించలేక, నానా చికాకూ పడి కళ్లెర్రజేసి, పళ్లుకొరుకుతూ, నన్ను తిట్టి, తనుతిట్టుకొని, యేదో అవస్థ పడేవాడు.

పెంకె కుర్రవాళ్లు వీలు చిక్కినప్పుడల్లా నాతలమీద చరిచి, నన్ను కేళిచేసేవారు. ఉపనయనమంటే మొదట యేమీ తెలియక సంబరపడ్డానే కాని, జంధ్యప్పోస మెడల్లో పడడం పీకకు ఉరిపోసుకున్నట్లనిపించింది చివరకి. అర్థం తెలియని యీ సంధ్యావందనం, గాయత్రీజపం వల్లెవేయడ మెందుకో? తీవ్రంగా ఆలోచించేవాడిని, ఉపనయనమంటే ఏమిటని! ఎవరినడిగినా సమాధానం చెప్పరు సరికదా, మీదు మిక్కిలి యెగతాళి చేసేవారు. జంధ్యంతో వీపు గోక్కోవచ్చుననీ, జంధ్యం కుక్క మెడలో పడేస్తే చప్పున పెళ్లి అవుతుందనీ, జంధ్యం ముడి గట్టిగా నొక్కితే దెయ్యాలు వశమౌతాయనీ, 'గాయత్రీ సాక్షి!'అని జంధ్యం పట్టుకొని ప్రమాణం చేస్తూ యెంతేసి అబద్ధాలైనా చెప్పవచ్చుననీ, వడుగైతే హాయిగా బ్రాహ్మణార్థాలుచేసి బ్రతికేయవచ్చుననీ, ఎన్నో చెప్పేవారు.

"వడుగువలన నిజమైన ప్రయోజనం

ఏమిటండీ?" అని ఒకనాడు అడిగాను మా సాంబన్న మాస్టరు గారిని.

నవ్వుతూ ఆయన, "వడుగు అవడమంటే బిచ్చమెత్తుకుందుకు హక్కు పొందడమన్న మాట. ఉపనయన కాండకల్లా ముఖ్యమైనది భిక్ష!" అన్నాడు.

వడుగులో నేను మా బంధువులందరికీ ఒక్కొక్కరికే నమస్కరించి, 'భిక్షాం దేహి' అనడం, వాళ్లు నా పళ్లెంలో రూపాయలు, ఉంగరాలు వెయ్యడం, అన్నీ జ్ఞాపకం తెచ్చుకున్నాను. తుదకు తల్లిదండ్రులు, బంధువులు, పురోహితుడు, అంతా యేకమై, కుర్రవాళ్లకు వడుగునాడు చేసే మహోపదేశం ముష్టి నెత్తుకోవడమా అని నా మనస్సు చాలా కించపడింది.

"ఆకాస్త నూలుపోగూ మెడలో పడితేనే కాని, మొహానికి బ్రాహ్మణకళ రాదు!" అనేది మా నాయనమ్మ వడుగైన తరవాత. అద్దంలో చూసుకుంటే, ఒళ్లు మండుకొచ్చింది నాకు. అందవికారంగా తల గొరిగించి, పంచ సిగలు పెట్టి, యీగలు ముసురుతూ నెత్తిని చిన్న బెల్లంముద్ద నొక్కి, 'బ్రాహ్మణకళ వచ్చింది, చూసుకో!' అంటే, యేమైనా అర్థం ఉందీ? 'బ్రహ్మచారీ శతమర్కటః' అంటారు. అంటే, 'నూరుకోతుల అందం వస్తుంది వడుగైనవాడికి!' అని అర్థం. అదే కాబోలు 'బ్రాహ్మణకళ' అంటే?

ఆడపిల్లనై పుట్టివుంటే నాకీ గ్రహచారం పట్టకపోవును కదా? చదువు, సంధ్య చక్కగా ప్రైమరీతో ఆఖరు! మాస్టర్లు, దెబ్బలు, పరీక్షలు, ఇంగ్లీషు—ఏగొడవా ఉండదు. అప్పుడీ 'బ్రాహ్మణకళ', సంధ్యావందనం, పురోహితుడి తిట్లు యేవీ అవసరం లేకపోయేవి. ముచ్చటగా పదిపన్నెండేళ్లకి పెళ్ళి. పువ్వులు, మిఠాయిలు, అత్తరులు, వీటితో సారె. ఒంటినిండా నగలు, ఇంటినిండా పిల్లలు. పురుళ్ళు పుణ్యాలు, నోములు, అత్తగారితోను ఆడపడుచులతోను దెబ్బలాటలు, నగలకోసం చీరెలకోసం మొగుడితో సాధింపులు,— బలే తమాషాగా ఉండేది జీవితం! ఎందుకొచ్చిన మొగజన్మ?

స్త్రీలు—గురుకులములు

బుర్రా వెంకట సుబ్బారాయుడుగారు

హిందూదేశంలో స్త్రీలయందు విద్యావ్యాప్తి అయితేనేగాని దేశంలో సాంఘికాదిదురాచారములు పోవనిన్నీ, సాంఘిక నైతిక పరిస్థితులు బాగుపడితేనే తప్ప దేశము అభివృద్ధికాంచదనిన్నీ అందుచేత స్త్రీలకు విద్య చాలా ఆవశ్యకమనిన్నీ, సనాతనులలో ఏ కొందఱో తప్ప మిగతా వారందఱూ ఒప్పుకొంటున్నారు. కాని ఆ విద్యను కఱపే విధానాన్నిగూర్చి మాత్రం అందఱూ తలొక పంథా తొక్కుతున్నారు. కొందఱు బాలురకు ఏవిద్యనైతే హిందూవిశ్వవిద్యాలయములన్నీ ఆమోదిస్తున్నాయో, అదే బాలికలకుకూడా మంచిదంటున్నారు. బాలురతో సమానముగా కలసి బాలికలుకూడ చదువవలెనంటారు వీరు. ఈ పద్ధతి పాశ్చాత్యదేశాల్లో ఉందనిన్నీ, అట్లా చదవడంవల్ల బాలికలలో inferiority complex (న్యూనతా భావము) పోతుందనిన్నీ, వీరు పెద్దవారైన తరువాత పురుషులతో పాటు సమానంగా సాంఘిక, నైతిక సమస్యల నెదుర్కొని, అవలీలగా సాంఘికాదిదురాచారాల్ని రూపుమాపగలరని, వీరంటారు. మఱికొందఱు బాలురకు కఱపబడే విద్య—ప్రస్తుతము విశ్వవిద్యాలయము లన్నిటిలోను చెప్పబడేది—బాలికలకేమాత్రము తగదని, అటువంటివి నేర్పినట్టయితే ఆ బాలికలు మగవీరులౌతారని ప్రపంచములో స్త్రీపురుషులు సంచరించే తావులే వేరనిన్నీ, అందుచే న్యూనతాధిక్యతా బుద్ధికి గాని, గొప్ప తక్కువ అనే తారతమ్య బుద్ధికిగాని అవకాశమే లేదనీ, ఎవరి ఆవరణలో వారు స్వతంత్రులే అనిన్నీ, అటువంటి సందర్భంలో మగవాండ్ర కుండవలసిన విద్యకు, ఆడువాండ్ర కుండవలసిన విద్యకు భేదముండవలెనని అభిప్రాయపడుచున్నారు.

నిజం చెప్పడానికి మనకు 100 కి 99 సందర్భాలలో కనపడే దేమిటంటే ప్రస్తుతం విశ్వవిద్యాలయమువారు స్థాపించిన విద్యాపద్ధతిలో చదువుకొన్న బాలికలు విద్యాభ్యాసము పూర్తిచేసి గృహస్థావస్థలో ప్రవేశించగానే, వారు తమ వెంట పవిత్రమై ప్రశాంతమైన హిందూగృహములోనికి అనుమానం, అవిశ్వాసం, దౌర్బల్యము, అమితవ్యయం అనేవాట్లను తీసుకు వస్తున్నారు. ఈ విషయాల్నే సాంఘిక నవలలోను, మాసిక దైనిక పత్రికలలోను కథారూపాన్ని వ్యక్తపరుస్తూంటే, దానిని సహించలేని కొందఱు మగవాండ్రు, ఈర్ష్యచేత, అసూయచేత, యిట్లా వ్రాస్తూయున్నారు అంటారు. కాని యీ పత్రికలు, నవలలు, ప్రజల ప్రతిధ్వనియే కదా. ఇవి పక్షపాతము వహించలేదే! ఆంగ్లవిద్యావతియైన హిందూయువతినే కాకుండా, యివి ఆవిద్యను నేర్చిన యువకునికూడా అవసరం వచ్చినప్పుడల్లా నిందిస్తూనే ఉన్నాయి.

దీనికి అంతకూ కారణం ఏమిటి—అసూయా? ఒకరిద్దఱికి అసూయ ఉండవచ్చునుగాని మగజాతి అంతకును అసూయ ఉండునా? అదేకాదు. హిందూసంఘము యీ విద్యకు అలవాటుపడలేదు. ఈవిద్యను, హిందూదేశపు నమ్మకములకు పరిస్థితులకు, అలవాట్లకు భిన్నముగా ఉన్న నమ్మకములతోను పరిస్థితులతోను అలవాట్లతోను కలసి పెరిగినదాన్ని, అట్టి అలవాట్లేమీ లేని మనదేశంలో నెలకొల్పవలె నంటే

ఎంతకష్టము? మగవాండ్ర విషయంలో ఈ అభ్యంతర మేమైనం దంటారా? మూడువందల ఏండ్లైనదికదా మనకీ విద్యతోడి సాంగత్యముకలిగి. నేడు ఎంతమంది ఇందులో ఆరి తేరినవారు? పోనీ ఆ సంగతి అటుండనిచ్చి వీరేమైన ఈ విద్యలేనివారికన్న ఎక్కువ సుఖమనుభవించుచున్నారా? సుఖముమాట అలాఉండగా అనేక నూతన సమస్యలను తెచ్చిపెట్టినదీ విద్య. ఈ విద్య నభ్యసించినవాడు పూర్తిగా ఆ విద్యను సంబంధించిన అలవాట్లను, అలవర్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడు. కాని అది కొనసాగక పోవుచున్నది. అందుచేత ఫలితము త్రిశంకు స్వర్గము—వీధులో దొరవేషం ఇంట్లో శుద్ధ బ్రాహ్మణ్యం—వేషంలో అనుగున సూటు—పైన పాగా—క్లబ్బులో...... ......పుచ్చుకోవడం formality manners—అందుచేత అలవాటు లేకపోయినా కాస్త పుచ్చుకోవాలి—లేకపోతే యూరోపియన్ friends గేలిచేస్తారేమో! ఇల్లా ఉంది ఈవిద్యయొక్క మహాత్మ్యము మగవాళ్ళపట్ల.

హిందూసంఘం స్త్రీలను అతిపవిత్రంగా తలుస్తోంది. అందుచేత ఈ విద్య పురుషులలో చేసిన అతి వినయమును, స్త్రీలపట్లకూడా చేయుటకు ఒప్పుకొనలేదు. అందుచేతే యీఅల్లరి, యీఘోష, ఈఅభ్యంతరము, స్త్రీలు ఆంగ్లవిద్య అభ్యసించడానికి, దీనిని Conservatism అనండి ignorance అనండి, పాశ్చాత్యసంఘము పరపురుషునితో ఒకస్త్రీ చేతిలో చేయివేసికొని మాట్లాడుచున్న హర్షించ గలదు: హిందూ సంఘము సహించలేదు. ఇది హిందూసెంటిమెంట్ (Sentiment)కే సరిపడదు. తురుష్క సంఘముమాట చెప్ప నవసరమే లేదు. అందుచేతనే ఆంగ్లవిద్య నభ్యసించినప్పటికి, హిందూయువకుని హిందూరక్తము యీ దృశ్యమును చూడలేక ఉడికిపోవుచున్నది. పై నుదహరించిన నవలలు మొదలగువానిలో కథలు వ్రాసినవారు ఎవరందురు? సనాతనులా కాదు. చాలమంది ఈ ఆంగ్లవిద్య అభ్యసించినవారే. ఇదియేమని తెలుపుతోంది? ప్రస్తుతము ఉన్న విద్యాపద్ధతి బాగులేదనే కదా.

దీనిని బట్టి యాలోచించగా సంఘముయొక్క అలవాట్లనుబట్టి విద్యాపద్ధతి ఉండాలికాని ఎవరికో యెక్కడో ఓ పద్ధతి ఉంది కాబట్టి అది మనకుకూడా ఉంటే బాగుంటుందని అనుకోడం పులిని చూచి నక్కవాత పెట్టుకోడం లాంటిదే. ఇటువంటి విషయ పరిస్థితు లన్నీ ఆలోచించి "ఆర్యప్రతినిధి" సభవారు హైందవనారీమణులకు తగిన విద్యయెట్టిదా అని ఆలోచించి అనేక సుప్రసిద్ధ విద్యాభిమానుల సలహాలను పొంది గురుకులపద్ధతి, కన్యకల విద్యాభివృద్ధికి మంచిదని దెహరాడూన్ (Dehradun)లో కన్యా గురుకులమని ఒక దానిని స్థాపించారు. దీనిని గూర్చి హైదరాబాదు వాస్తవ్యులు శ్రీ చందవర్కరు, M. A. గారు, అభినందిస్తూ కన్యాపాఠశాలల కన్నిటికి యది ఒక ఆదర్శమని దేశమందలి కన్యాపాఠశాలలన్నీ దీనిని అనుకరించినట్టయితే చాలాబాగుంటుంది అని హిందుసారస్వతానుబంధంలో వ్రాశారు. ఇందలి విద్యాపద్ధతియొక్క గొప్పతనము దూరదేశములగు కర్ణాట మహారాష్ట్రములనుండికూడ బాలికలు వచ్చి ఇందు చదువుచున్నారనే విషయము ప్రకటిస్తోంది.

ఈ కన్యా గురుకులము ఒక క్రొత్త పంథా త్రొక్కింది. ఇది బాలికలకోసమే నియమింపబడి ఉంది. ఇక్కడ పఠనాక్రమం, రామ్‌దాసే మొదలైన విద్యాప్రముఖులు శోధించి, నెలకొల్పారు. ఇక్కడ చదువుచెప్పే వాళ్ళందరూ స్త్రీలే. ఆంగ్ల భాష ఐచ్ఛికం—కోరితే చెబుతారు. అదైనా కడపటి తరగతుల్లో. సంస్కృతం, హిందీ, మాతృభాష వీట్లకు ప్రాధాన్య మివ్వబడినది. అన్ని విషయాలూ హిందీలో చెపుతారు. ప్రాచీనగురుకులాలకు మల్లే వీటిని నడుపుదామని సంస్థాపకుల అభిప్రాయం; అందుచేత పిల్లలందరు ఇక్కడేఉండాలి చదువుకున్నన్నాళ్ళు-

Residential అన్నమాట. ఉన్నతవిద్యకూడా అభ్యసించవలెనంటే 15 సంవత్సరములు పట్టునట ఇక్కడ చదువుకొన్నవారికి కేవలము మానసికాభివృద్ధికే గాక శారీరకాభివృద్ధకిని సౌకర్యము లున్నవి; ఇది డేహరాడూన్ ఊరి వెలుపల నున్నది.

ఇక్కడ సంస్కృతము తప్పకుండా చదువవలసి ఉంది. ఆ చదువడంలోకూడా, వేదములు, ఉపనిషత్తులు, తమంతటతాము అర్థము చేసికొనగలుగు సమర్థత బాలికలకు కలుగ చేస్తున్నారు.. విమర్శాబుద్ధితో సంస్కృతము నేర్చుకున్నట్లయితే, ఆ సంస్కృత జ్ఞానము సనాతనులజ్ఞాన మల్లే కాకుండా, అనేక సంఘదురాచారములను పారద్రోలుటకు హేతువగుచున్నది.

నవీనశాస్త్రములోని (Modern science) శబ్దముల ననువదించుటకూడా, మాతృభాషలో తగిన పదాలు లేకపోవడంవల్ల సంస్కృతం మనకి యెక్కువ ఉపకరిస్తోంది. ఈ విషయాల్నన్నీ కనిపెట్టే, యీకన్యాగురుకుల సంస్థాపకులు సంస్కృతం నిర్బంధంచేశారు. సంస్కృతం మృతభాష అంటారుకాని దీనికి అర్థం లేదు. ఇది మనలోనే జీర్ణించి ఉన్నది. అలవాట్ల రూపంగాను, నమ్మకముల రూపముగాను, అదీ కాకుండా చూడండి సంస్కృత పదం ఉపయోగించకుండా ఒక పదినిమిషాలు మాట్లాడండి: అల్లా చేస్తే అచ్చతెనుగులో కవులన్న మాటే: ఇల్లాగే, మన దేశంలో అన్నిభాషలలో, అంటే సంస్కృతం మూలంగా గల భాషలలో, సంస్కృతం అంతర్భూతమై ఉంది. అటువంటి సంస్కృతాన్ని, విదేశీయులైన జర్మను బాలికాబాలకులు 'అమరం'దగ్గఱనుంచీ చదువుతోంటే, మనం చదవకుండా ఉండడం ఎంత శోచనీయం. ఈవిషయంలో మాత్రం సంస్కృతాభిమాను లందఱును ఈ గురుకులము మెచ్చుకొన తగి ఉంది.

ఇక్కడ సైన్సు (శాస్త్రము), గణితం మొదలైనవి కూడా చెపుతారు కాని, జీవితంలో సామాన్యంగా అవసరమైన విషయాలకి మించకుండా, నిత్యగృహకృత్యాలలో స్త్రీలకి కావలసినవి వదలకుండా, సంఘసంస్కారాదులలో స్త్రీకి పనికివచ్చే విషయాల్ని వదలకుండా, ప్రపంచజ్ఞానం బాలికలకు కలుగజేస్తున్నారు యీ గురుకులమువారు. వీనిలోనే, హిందూదేశచరిత్ర, గృహ్యశాస్త్రము, శిశుపోషణ, ప్రసూతిశాస్త్రం, మొదలైనవి చెపుతారు. ఇచ్చట విద్యాపద్ధతి మూడుభాగాలుగా ఉంది.

ప్రాథమికశాఖలో Kindergarten తో మొదలుపెట్టి-క్రమంగా సీత సావిత్రి, కౌసల్య, గార్గి, సులభ, మొదలగు పతివ్రతల కథలు చెపుతారు. 4 వ తరగతిలో కుట్టుపని చెప్పడం మొదలుపెడతారు. ప్రాథమిక, మాధ్యమిక శాఖల్లో ఆఱు తరగతు లున్నాయి. వీట్లమీద రెండే తరగతు లున్నాయి. ఈ ఉన్నతశాఖలోనే బాలిక ఆంగ్లమును చదవాలని కోరితే చెపుతారు. అట్లు కాకపోతే దేశంలోని ఏదైనా ఒక వాడుకభాషను తీసుకోవాలి.

దీనిపై ఉన్నతవిద్య మూడేండ్లు ఉంది. ఈ తరగతుల్లోనే విశ్వవిద్యాలయాల్లో చెప్పే భౌతిక సాంఘిక, రసాయనాదిశాస్త్రాలను చెపుతారు. సంగీతము, వేదాంతము, చరిత్ర మొదలైనవాటినికూడా యిచ్ఛానుసారంగా చదవవచ్చును. చందవర్కరుగారు వీరి పరీక్షాపత్రాలుకూడా మిగత విశ్వవిద్యాలయములకు చెందిన కళాశాలల పరీక్షాపత్రాలను తీసిపోవని తలపోస్తున్నారు. బుద్ధికుశలతను పరీక్షించుటకప్పుడప్పుడు చిన్నచిన్న పరీక్షలగుచుండునట.

ఇచ్చట జాతిభేదము లేదు. ఆహారము శాకాహారము.

వీని నన్నిటిని చూడగా చందవర్కరుగారు చెప్పినట్లు, ఈగురుకుల వ్యవస్థాపకులు స్త్రీవిద్యాభిమానుల కందఱికీ అభివందనీయులని తోస్తుంది.

మన ఆంధ్రదేశమున యీరీతిగా లేకపోయినను, యిట్టి ఆదర్శములుగల నికేతనాలు కొన్ని ఉన్నాయి. కాని తగినంత పోషణ లేకున్నది. ఇటువంటి గురుకులములను దేశమంతటను స్థాపించినట్లయితే, స్త్రీవిద్య త్వరలోనే వ్యాపించుటే కాకుండా ప్రస్తుత మనుసరింపబడుచున్న ఆంగ్లవిద్య వెంబడే ఉన్న పైనచెప్పిన దోషాలకి తావుండదు. అందుచేత స్త్రీవిద్యాభిమాను లందఱు యిట్టి కన్యాగురుకులములను పోషించి ప్రోత్సహించినట్లయితే సాంఘిక దురాచారాలు అనేకము పటాపంచలై నశించిపోతాయి. తల్లిదండ్రు లీగురుకులములకే తమ ఆడుపిల్లలను పంపుదురని నమ్ముచున్నాను. విశేషములు కావలసినవారు పై కన్యాగురుకులంవారి కార్యదర్శిగారివలన తెలిసికొనవచ్చును. (*)

(*) పంజాబునందును, సంయుక్తరాష్ట్రములలోను యిట్టి గురుకులాలు—బాలురకు—అనేకములున్నాయి. మొదటలో వీనిని ఎవరును లక్ష్యపెట్టలేదు. కాని యిందులో చదివి యింగ్లాండు మొదలైన చోట్లకువెళ్లి డాక్టరుపదవులు సంపాదించి కొందఱు రావడంవల్ల వీని గొప్పతనం యిటీవల బయల్పడుతోంది. ఇందు కుదాహరణ కాశీహిందూ విశ్వవిద్యాలయములో, అర్థశాస్త్రపండితులుగా ఉన్న డాక్టరు ప్రాణనాథుగారు. వీరు ఒక గురుకులంలో చదివి లండనువెళ్లి తమప్రజ్ఞవలన బిరుదములను పొందినవారు. ఇట్టివారు పంజాబు విశ్వవిద్యాలయములలో మఱికొందఱున్నారు.

అందంలోని ఆరాటము

శ్రీమతి సహ యనమంతుల కుంతలగారు

నేను మొదటినుంచీ సౌందర్యం అంటే చాలా ప్రేమించేదాన్ని. లోకంలో ప్రతీ వస్తువుకంటె ధనంకంటె ఆరోగ్యంకంటె భోగాలకంటె కూడా సౌందర్యమే మొట్ట మొదటిదని నావిశ్వాసం. 'ధనమూల మిదం జగ'త్తను మాటను పాటించేదాన్ని కాను. ప్రపంచకంలో ఎంతమంది ధనవంతులో ఉన్నారు. అల్లాంటివాళ్ల ముఖాల్లో కొన్ని అయినా సౌందర్యచిహ్నాలు లేకపోతే ఆ ధనానికి పేరు ప్రతిష్ఠ ఉండడం ఎలా సంభ విస్తుంది.

'ఆరోగ్యమే మహాభాగ్య'మనే మాటను విన్నప్పుడుకూడా 'సౌందర్యం అనేది ఏదీ లేకుండా మొద్దులాగ ఇంత తిని కడుపే కైలాస మనుకుంటూ ఇడ్డెనులాగ శరీరాన్ని లావుచేసుకోడం కాబోలు' అని అనుకొనే దాన్ని. 'గుణాః పూజాస్థాన' మనే సామెత కూడా నాకు నచ్చలా. హరిశ్చంద్రుడు సుగుణాలు కలవాడే అయినా భోగా లను భవించడాని కతని జీవితంలో ఏమయినా అవకాశం చిక్కిందా.

భోగేంద్రుడైన నలకూబరుడు రంభను ప్రేమించాడంటే ఆ ఏమ్మెలాడి తళుకుబెళు కుల కులికే కాదూ! సీత పసిడిలేడిని ప్రేమించిందంటే దాని బిత్తరిచూపులకు పర వశంచెంది కాదూ! దేవేంద్రుణ్ణిలాగి లెంప కాయ కొట్టే రావణాసురుడు సయితము సీతను ప్రేమించాడంటే ఆ మహాతల్లి శరీర లాలిత్యాన్ని చూచి కాదూ! ఇనపకచ్చ డంతో బిగించుకున్న విశ్వామిత్ర ముని మేనకకు లొంగిపోయాడంటే ఆ వగ లాడి వాల్చూపు తూపులకంటె ఇంకో టేమున్నది కారణం? ఆమాట కొస్తే నేను నా స్నేహితురాల్ని నా ప్రాణాలకంటె ఎక్కువగా ప్రేమిస్తున్నానంటే సౌందర్యమే గా అక్కడకూడా కారణం!!

అందుచేతనే 'సౌందర్యానికి లొంగిపోని పదార్థమే లేదు ప్రపంచకంలో' అని ప్రచా రంకూడా సాగించాను. నే నీ అభిప్రా యాల్లో ఉంటూండగానే నా స్నేహితు రాలికి పెళ్లి కుదిరింది. వరుడు జయంతుడు లా ఉంటాడని విన్నాను. "నన్ను పెళ్లికి రావలసిందని ఒట్టు వేయించుకొంది. కార ణాంతరాలవల్ల పెండ్లినాటికి వెళ్లలేకపోయినా పెళ్లి మూడోరోజుకు వెళ్లగలిగేను. నన్ను చూచి ఆమె చాలా సంతోషించింది. 'కన్యా

శ్రీమతి హాబ్దీ ఎడిబ్

శ్రీమతి నేసమని పాల్

'బాలం ముకుందం మనసా స్మరామి'

వరయుతేరూపం' గనక నా స్నేహితురాలే ఇతగాన్ని ప్రేమించిం దనుకున్నాను. ఆ వధూవరు లిద్దరూ పెళ్లిపీటల మీద కూర్చుంటే చిలకాగోరువంకల్లా గున్నారు. మాట్లాడుతున్నట్లే మంత్రాలను విరజిమ్మే స్తున్నారు పురోహితులు. దిష్టి తగలకుండా కాబోలు నీరాజనా లిస్తున్నారు ముత్తైదువులు. పెళ్లి సుఖంగా కొనసాగింది.

అప్పుడప్పుడు నాచెలి నాతో ఇలా అంటూ ఉండేది:—'కుంతలా! నీకుకూడా ఇలాంటి...' దీనికి నేనూ ఆనందించేదాన్ని.

ఒకప్పుడా అమ్మాయిని చూద్దామని వాళ్ల ఊరికి బయల్దేరాను. ఆమె భర్త చాల రోజులనుంచీ వ్యాధిగ్రస్తుడై ఉన్నట్లు త్రోవలోనే తెలిసింది. అతి కంగారుతో ఎలాయితేనేం వాళ్లయిల్లు చేరుకున్నాను. ముద్దుమురిపెములతో సమంగా నాచెలికి ముచ్చటన్నా తీరలేదు. ముఖంలోని సౌందర్యమంతా మటుమాయమై పోయింది. పెదవిమీది చిరునగవులో పేలవం ప్రవేశించింది. నిర్జీవ నైపోయాను.

అప్పటి కప్పుడే నా ప్రాచీనాధునాతన భావాల్లో వైలక్షణ్యం అంకురించింది. మంచి చెడ్డల పరిశీలనలో అనుభవానికి కూడా కొంత పని కలిగించాను. అప్పుడు నాకు తట్టిన నిశ్చితాభిప్రాయం యిది. 'విధివశమున వికల చిత్తుండై క్షుత్పిపాసలకు దూరుండై ధూళి ధూసరితకాయుండై గ్రహాగృహీతునట్లు చూపఱులకు వెఱపును గలిగించు నాండాతని యంద మేచందముననో పోవును. వికలాంగుండై పిశాచరూప మేర్పడినపుడాతని మందస్మితమే యమంద సాధ్వసనిదానంబగు ననుటకు సందియముండదు. ధైర్య స్థైర్యములు లేనివాండు నిర్గంధ కుసుమముకంటె గౌరవ హీనుండగుట యనుభవైకవేద్యము. నిండుచందురు చందమున నలరారు మోముందమ్మి కాలవశంబున హృదయరంజక మగుటకుమాఱుగ హృదయ భంజక మగుచున్నది.'

కావున సౌందర్యం ప్రేమించ తగ్గగుణం కాదని నిశ్చయించుకున్నాను. ఈ ప్రత్యక్ష దృశ్యం చూచినతరువాతనే 'గుణాః పూజాస్థాన'మనిచెప్పిన అనుభవజ్ఞులను వందనాలతో ఆదరించాను. నా కామె ప్రియాతిప్రియ అవడంచేత, ఆమె దుఃఖమే నా దుఃఖమని భావించడంచేత నా కీ పరిజ్ఞానం ఏర్పడ్డది.

'గుణాః పూజాస్థానం గుణిషు నచలింగ నచవయః'.

కవివాక్సిద్ధి

బి. పట్టాభిరామయ్యగారు

తృతీయాంకము—ప్రథమరంగము

(కళింగపట్టణమున సముద్రతీరము—విజయభూపతి యోచనామగ్నుడై ప్రవేశించును.)

విజయభూపతి:—నే నాతనికి కప్పము గట్టుచున్నాను నిజమే కాని, వానిగర్వోక్తులను వినియోర్చుటకు నేను బానిసను గాను. పుట్టుకచేతను దత్తతచేతను నేను వానివలెనే రాజపుత్రుఁడనే. కావున నిఁక నన్ను సవారిచేయనీయను. చిన్ననాడు నా ప్రియమిత్రుఁడును, సహపాఠియును, నాతో నాడినవాడునయ్యు, నేటికాలమునకుఁ గొంత లక్ష్మీకటాక్షము బ్బుటచేత నతి గర్వితుఁడై దైవసముఁడనని తన్నుఁదా ననుకొనుచున్నాఁడు. వీనియన్న బాల్యముననే వ్యాఘ్రహతుఁడు గాకున్న నీగంగఁడు నేను పేరుప్రఖ్యాతులు లేకుండువాఁడే గదా! శిఖిముఖిముండి వెడలు నిప్పుకలు చిచ్చుముట్టించునట్లు వీని గర్వోక్తులు గొందరనుచరుల కతృప్తిఁ గల్గించుచున్నవి. ఇట్లీతనిరొడ మనను నొచ్చినవారలలో జయవర్మ ముఖ్యుఁడు. నే నాతనికి లంచము లిచ్చియో, దుర్బోధన సేసియో ఆతని ప్రీతిలేమిని కేవలము ద్వేషముగ మార్చెద. ఇట్లు నే ముట్టించు సమరాగ్నిచేఁ గళింగ గంగుని విభవము గర్వము సైతము దగ్ధములగు. ఆతని కిరీటమును నేను ధరింతు. ఆతని గద్దియ నెక్కుదు. ఆతని కపఖ్యాతిఁ గల్గించ నా శక్తికొలఁది పాటుపడుదు.

ఆహా! ఏమి నాభాగ్యము! రాజజ్యోతిష్కుఁ డిటు వచ్చుచున్నవాఁడు. (పరశురామ దైవజ్ఞుఁడేమో యాలోచించుచుఁ బ్రవేశించును]. విప్రవర్యా నమస్కారము.

పరశురామ దైవజ్ఞుఁడు:—దీర్ఘాయుష్మాన్ భవ!

విజయ:—ఎద్దియో గాఢాలోచనలో నున్నారు తమరు. ఏమి విశేషము సంభవించినది?

పరశు:—దానిం జెప్పిన నాతలవోవును.

విజయ:—రాజుగారి కేమైనఁ గీడు వాటిల్లనున్నదా యేమి? శ్రీరామునిపాదము లాన! ఆ రహస్యము నే నెరితోఁ జెప్పను.

(దైవజ్ఞున కొక ముల్లెనిచ్చును. దైవజ్ఞుఁడు సంతృప్తుఁడై చిరునవ్వు నవ్వును) నీ శుభవార్త కిది ప్రథమ బహూకృతి.

పరశు:—మనలో మాట! (ఎవ్వరులేరు గదా యని యిటునటు చూచి) ఇఁక నొకపక్షములో రాజు పదభ్రష్టుఁడగునని నాకుఁ దోఁచెడిని.

విజయ:—ఎవ్విధముగ నది సంభవించును?

పరశు:—ఒక కవిశాపమునొంది రాజు శత్రువు వలన రాజ్యముం గోల్పోఁ గలఁడు.

విజయ:—ఏకవచనమేల? పెక్కురాతని గర్వోక్తులు సైపఁజాలక యతనివైరులై యాతనిం దిట్టుచున్నారు.

పరశు:—రాజున కిది చెప్పుటకు భయముగ నున్నది: మహదాగ్రహముం బూనును. అయినను చెప్పుట నా విధి గావునఁ జెప్పక తప్పదు.

విజయ:—(మఱికొంతసొమ్ము నిచ్చును.) మఱి మీరు సెలవు పుచ్చుకొనుము. రాజుతోఁ జెప్పకుము. ఏమియుఁజేయుమనియుఁ జెప్పుమనియు నిన్ను నే గోరలేదు. మిన్నకుండుటయే చాలును. దీనితో నీ మనస్సాక్షిని యూరకుండుమనుము.

(నిష్క్రమించును).

పరశు:—ఓరీ, రాజద్రోహీ! నేతప్పక చెప్పెద. నా సంతకములేక యొక చీటిని రాజున కంపెద. సర్వేశ్వరుఁ డాతని రక్షించుఁగాత! (నిష్క్రమించును.)

తృతీయాంకము—ద్వితీయరంగము.

(రాజ సభామందిరము. శ్రీహరియు, చిన్న చీటిని చేఁబట్టి పరశురామ దైవజ్ఞుఁడును. ప్రవేశింతురు)

శ్రీహరి:—మనయేలిక కడ్డమైన విపత్తు సంభవించనున్నయెడ వారితో మనవిసేయుట నీ విధి గదా?

పరశు:—ఇదిగో! 'జాగ్రత!' యని వ్రాసియున్నచీటి. దీనినిచ్చుట యుక్తమా, లేక చెవిలో రహస్యముగఁ జెప్పుట యుక్తమా? ఇట్టి యశుభ వార్త నెఱింగించినందులకు నామీఁద మండిపడును. కావున నేను దీనిపై సంతకము చేయలేను. దీనినిచ్చుటకు వెఱచుచున్నాఁడ.

శ్రీహరి:—దాని నిటుల యిమ్ము. నేను ముందడుగు వేసెద. కోపగించినను సరే (తూర్యకాహళరవములు వినిపించును.) రాజుగారువేంచేయుచున్నారు. మనము ప్రక్కకు నిలచి యాహ్వానము సేయుదము.

(వారు ప్రక్కకుఁ దొలఁగి, కేలు మోడ్చి నిలతురు. కళింగగంగు, లక్ష్మోజిరావు, జయవర్మ, విజయభూపతి మున్నగు సామంతరాజులు, రాజసభ్యులు, గాయకులు, నాట్యకర్త్రులు, భటులు ప్రవేశింతురు.)

భృత్యులందఱు:—జయ జయ శ్రీ కళింగగంగు మహారాజ! శ్రీ వారికిఁ జిరాయువు, యశస్సుం గల్గుఁగాతి! (రాజుకూర్చుండును.)

(నాట్యకర్త్రులు నృత్యముసలుప, గాయకులు పాడుదురు *శంఖనాదముతో సంగీతము ముగియును. ప్రధాని యితర సభ్యులుఁ గూర్చుందురు: లక్ష్మోజిరావు చెవిలో నెద్దియో చెప్పఁగా రాజు మోము కలతనొందును.)

శ్రీహరి:—(దైవజ్ఞుఁడు వ్రాసిన చీటిని రాజున కిచ్చును) మహాప్రభూ! క్షమింపుఁడు. అలస్యము సేయఁదగని విషయము గావున నిట్లు తెగించి తమ కిచ్చితిని (భీముఁడు ప్రవేశించి రాజునకు నమస్కరించును. రాజాతని నొక పీఠముపైఁ గూర్చుండ సంజ్ఞ సేయును.

కళింగగంగు;—ఇంతటితో నేటిసభ చాలించినాము. ప్రధాని, శ్రీహరి, దైవజ్ఞుండువక్క యితరులు సెలవుపుచ్చుకొండు.(భీమునితో) ఎవరు మీరు?

భీముఁడు:—

మ॥ ఘనుఁడన్ వేములవాడ వంశజుఁడ,
దాక్షారామ భీమేశనం
దనుడన్, దివ్యవిషామృత ప్రకట
నానా కావ్యధుర్యుండ భీ
మన నా పేరు వినంగ నెప్పితిఁ
గళింగాధీశ! కస్తూరి కా
ఘనసారాది సుగంధవస్తువులు వే
గఁ దెచ్చి లాలింపుమా॥

కళింగగంగు:—ఛీ! ఛీ! పొమ్ము వెడలి.

భీముఁడు:—

(* అనుబంధమున పాటఁ జూడుడు.)

♦ క॥ శో॥ క౦.॥ వీరేశలింగంగారి కవిజీవితమునుండి పాఠాంతరము.

కం॥ ఓకి! రాజాధమ విను!
మీరీతిగఁ గవినిఁ దిట్టితివి చూడుము రా!
నీరాజ్యశ్రీ తొలఁగుచు
వైరుల పాలగును గాక - వచ్చెడి నెలలో॥

(భీముఁడు కోపముతో నిష్క్రమించును. విజయ భూపతి మదిలో సంతసించును.)

అందరు:—ఆహా! ఎంతటిశాపము!

కళింగ:—ఆ పొగరుబోతు బ్రాహ్మణుని చావఁదన్ని బుద్ధిచెప్పువారెరును లేరా?

పరశురామ దైవజ్ఞుఁడు:—దేవరా! శాంతింపుఁడు.

లక్ష్మీజీరావు:-ఏలినవారు సభచాలించిరి గావున నుండ నక్కరలేనివారు వెడలిపొండు.

(ప్రధాని, దైవజ్ఞుఁడు, శ్రీహరియుఁ దప్ప యితరులు నిష్క్రమింతురు.

పరశు:—

క॥ రవిలిన కోపముతోడను!
కవి శాపంబిడిన, ఫలము - గల్గును నుమ్మీ!
కవికిం గోపముఁ దెచ్చుట!
యవివేకం బండ్రు నూరు - లవనీనాథా!॥

శ్రీహరి:—మహాప్రభూ! జ్యోస్యుఁడు చీటిచే ముందు మనవిచేసిన యట్లే తమకుఁ గీడువాటిల్లెఁ గదా! ఆహా! ఇది యెంతదుర్దినము!

కళింగ:—ఇక చాలించు గ్రుడ్లగూబవలె నీ దుశ్శకునపు పలుకులు!

పరశు:—ఏలినవారు కొంత పొరపడు చున్నారు. శ్రీహరి కంటెను రాజభక్తికలవాఁ డొకఁడు లేఁడు. తమ యాగ్రహమునకు వెఱచి యీ చీటిని మీ కిత్తునా మానుదునా యని నేను శంకించుచుండ, దానిని తమ కిచ్చుటకు యీతఁడు తాఁ బూను కొనియె.

కళింగ:—కావున నా మన సాయాసపెట్టుటకు మీ రిరువురుఁ దలచితిరా? సరే. యిద్దరిని శిక్షించెద మీ రిరువురిని రాజ్యమునుండి బహిష్కరించితిని. సభనుండి యిప్పుడే వెడలుఁడు. ఇఁక నెంతరువాత యీ రాజ్యమున మీరు గన్పించినచోఁ దలఁ గొట్టించి వైతును.

శ్రీహరి:—కథలో మేకునుఁ దెతికిన కోఁతి వలెనే, గీడుఁ దెచ్చుకొంటిని. కానిండు తమయెడ నేఁజేయఁదగిన సేవఁజేసినాఁడ, నంతియు నాకుఁ జాలును. యథార్థవాద మేరికిని రుచించదు గదా!

పరశు:—నా మనవిఁ గైకొని, యీ యన్యాయమును సైరించి, నిరపరాధి యగు శ్రీహరిని మన్నింపుఁడు. ఈ జ్యోస్యము నాది. నే వద్దనినను తాఁదెల్పఁబూనె. భక్తియే యీతని నీగతికిఁ దెచ్చినది.

కళింగ:—మే మొసంగిన శిక్ష యన్యాయమని నీవా సొద్దుపెట్టఁదగినవాఁడవు? ఇరువురు నీ క్షణముననే వెడలిపొండు.

[రాజుకు నమస్కరించి, శ్రీహరియుఁ బరశురామ దైవజ్ఞుఁడును నిష్క్రమింతురు]

లక్ష్మీజీరావు:—నాకు నీశిక్ష తమ రొసంగినను సరే. మనసులోనున్నది మనవిసేయుటకు సెలవిండు. [రాజు శిరమూపును]. ఏలినవారి గర్వితచర్యలు బలుకులును తమరికి ముప్పుఁ గల్గఁజేయుచున్నవి. తమరిని రాజ్యభ్రష్టులఁ గావింప ప్రయత్నములు జరుగుచున్నవని నే విన్నాఁడను. ఉపరి, వాక్సిద్ధిగల కవికి నాగ్రహము దెప్పించి యాతని శాపము నొందితిరి. ఇఁతయుఁ గాక, రాబోవునది మేలైనం గీడైనను, తమతో విధిగా మనవిఁ జేయవలసిన జ్యోస్యునిన్ని, అతఁడు లిఖి

యించిన హెచ్చరికను తమ కిచ్చుటకు వెఱచుచుండ నిర్భీతిగాఁ దమ కిచ్చిన శ్రేయోభిలాషియగు శ్రీహరినిన్ని, రాజ్యమునుండి బహిష్కరించితిరి. తమరి కాగ్రహము వచ్చినను, చెప్పఁదగినది చెప్పుటయే భృత్యులకు విధియని యెంచి మనవిఁ జేసినవారి రాజభక్తి విలువ తమ రెఱుంగరైతిరి. అట్టి రాజభక్తిచేతనే, తమ రాజ్యము నపహరించుటకు జరుగుచుండు కుతంత్రములగూర్చి గూఢచారులద్వారా నే విన్నది మనవి సేయుచున్నాను. తమకు ముఖ్య వైరి విజయభూపతి. అసంతుష్టులనెల్ల యాతఁడు చేరఁదీసి, జయవర్మకు లంచములిచ్చి యుద్ధమునఁ దమరిని వదలిపోవుట కేర్పాటు చేసియున్నాఁడఁట. ఇప్పుడైనను తమయెడల భక్తిగలవారిని తమరు చేరఁదీసిన మేలు. ఏలనన, వారి సాయము త్వరలోఁ దమకుఁ గావలసియుండును. చెప్పఁదలచినది మనవిఁ జేసినాఁడ. నన్ను తమరు మెచ్చినను శిక్షించినను సరే. ఏలినవారి చిత్తము.

కళింగ:—విజయభూపతిని సైతము రాజ్యము నుండి బహిష్కరించినాఁడ.

లక్ష్మీజిరావు:—కఠినశిక్ష ప్రీతిని సంపాదించఁ జాలదు. ప్రేమయేగద హృదయముల నాకర్షించి భృత్యులకు నేలికకును వీడని బంధము గల్గించును? కొంత దయఁజూపి, చల్లని పలుకులాడినచో, ఇఁక పైన యీ విజయభూపతినిఁ బరమభృత్యునిగఁ జేసి, యీ కుతంత్రముల భంగపరుపవచ్చుననియే నా నమ్మకము.

కళింగ:—శిక్ష నే నొసఁగితిని. విజయభూపతి రాజ్యబాహ్యుఁడే. నీవును నేటినుండి నా సభకు రాఁదగదు. [కోపముతో నిష్క్రమించును].

లక్ష్మీజిరావు:—

గీ॥ రాజ్యముం గోలుపొమ్మని-వ్రాసె ధాత।
అన్యథా రాజు గుణవంతుఁ-డయ్యు, నొక్క।
గర్వముం జేసి యాతఁ డీ-గతినిఁ బొందు।
బుద్ధి యిఁక నైన నొందనీ-పోయెద సిద॥

——o——

తృతీయాంకము, తృతీయరంగము

కళింగపట్టణము చెంత నొక యడవి. ఇరు ప్రక్కలనుండి విజయభూపతియుఁ గడ్డముఁ బెంచి జీర్ణవస్త్రముల ధరియించి పరశురామదైవజ్ఞుఁడును ప్రవేశింతురు].

విజయభూపతి:—అయ్యా! ఎప్పుడు కళింగగంగునిరాజ్యము పోవునోఁ దెలియఁజెప్పుము. తదనుగుణ్యముగ నేను నాయెత్తులు వేసెద.

పరశు:—నీవు రాజవైరి వని నే నెఱింగినచో నాడు నే నీ వార్త నీ కెఱింగింపకనే పోయి యుందును.

విజయ:—అవును కాని నీ విప్పుడు రాజ్యబహిష్కృతుఁడవు. నేను నిన్నేమి చేసినను చేయవచ్చును. అందుచే నీ విప్పుడు చెప్పుట తప్పదు (దైవజ్ఞుని బట్టుకొనును)

పరశు:—ఏమైనఁగానిమ్ము. నే రాజద్రోహము సేయఁజాల. (వృనాగ విడిపింపుకొను ప్రయత్నముఁ జేసి) నన్ను వదలిపెట్టుము.

విజయ:—ఏలయింత తొందర? నేనెంతకాలము రాజ్యము సేయఁగలనో చెప్పుము.

పరశు:—నీకుం దెల్పినచో, జ్యోస్యము రచింపదని నే నమ్మకపూర్వకముగ నెఱుంగుదును. నేఁ జెప్పఁబోవునది యింపుగ లేనిచోఁ గోపగించవుగదా?

విజయ:—నాకెంతమాత్రము కోపము రాదు. నమ్ముము. చెప్పుము.

పరశు:—నీ యుచ్చదశయు జీవితమున్ను స్వల్ప పరిమాణము గలవే. ఇఁక నొక సంవత్సరములో రెండు నంతమొందును.

విజయ:—[దైవజ్ఞుని గొట్టుచు] నీచుఁడా, అనృతవాదీ! నీ ప్రేలుడు నే వడ్డసేయును. నా కిప్పుడు భాగ్యదశ గలదు.

పరశు:—ఇప్పటి కుండవచ్చును గాని, శాశ్వతము గాదు. ఇదియేనా నీ విచ్చిన యభయము?

విజయ:—[దైవజ్ఞుని తన్ని త్రోయుచు] ప్రాణముతో నిన్ను వదలితిని. అందులకు సంతసింపుము. నీ జాతకమునే నీవు చూచుకొనినయెడల యిప్పుడు మృత్యుప్రాప్తి నుంతలోఁ దప్పినదని యెఱుంగగలవు.

పరశు:—నా జ్యోస్యముతో నా శాపముగూడఁ గొనుము. ఓరి! రాజద్రోహీ! (నిష్క్రమించును].

విజయ:—

గీ॥ కొనెద నే వచ్చు లక్ష్మిని కొలఁదికాల ।
మైన నెక్కెద గద్దియ నాసదీర ।
వసుధ నే నేలుచుండ, నెవ్వాఁడు రాజ్య ।
చ్యుతునిగా నన్నుఁజేయునో చూతుఁగాక ॥

[మీసము దువ్వుచు నిష్క్రమించును].

—o—

తృతీయాంకము—చతుర్థరంగము

[యుద్ధరంగ సామీప్యప్రదేశము. దేహమంతయు నెత్తురుగార, చినిగినబట్టలతో గిరీటములేక వడఁకుచుఁ గళింగగంగు ప్రవేశించును].

కళింగగంగు:—నా సైనికులు పోరాడమింజేసి, నే నోడిపారిపోవలసివచ్చె. ఆహా! లక్ష్మి యెంత చంచల! యెంత క్రుద్ధిసి! నిన్నటివరకీ రాజ్యమంతయు నాదియే. నే డీ కళింగ రేడు రాజ్యమంతయు నోడి సామాన్యులతోఁ గలసె. నిన్నటివఱకు నా భృత్యుఁడై నాకు నతులొనర్చుచున్న యీ విజయుఁడు నేఁడు రాజాయెఁ గదా! ఈ నీచుని కెంతయదృష్టముపట్టినది! అవమానమునుండి కాపాడుటకై నా రాణిని మాదుగులలోఁ బుట్టినింటికి ముస్నే పంపుట మంచిదైనది. ఆ కవి నన్ను శపించిన నాటనుండి యశుభసూచకములగు తలంపులే నా మనమునం బుట్టందొడంగె. నా గర్వముచే నా స్నేహితులం బోగొట్టుకొంటిని. గర్వమునకుఁ దగిన శిక్ష యనుభవింపక తప్పునా? మనుజజీవితమే యతిహాస్యమైయుండ, నందలి సౌఖ్యము లింకను క్షణభంగురములు. అయినను పదచ్యుతుఁడగుట యెంత దుర్భరము! ఒక దేశపాలకుండనై యుండి, సిరిసంపదల ననుభవించి, యానందవార్ధిం దేలి నిరంకుశాధికారము సలిపి, ఉన్నట్టుండి లిప్తకాలమున నీ యైశ్వర్యమంతయుఁబోయి నిలచుట—హా! సర్వేశ్వరా!—భరింపఁజాలని శిక్షగదా! అయినను తగిన శిక్షయే. గర్వము నాశకారి. చంద్రుఁడు శుక్లపక్షమునఁ బెరిగినను, కృష్ణపక్షమున క్షీణించిన గతి, గర్వితుఁడు గొంతకాలము మహైశ్వర్యముల ననుభవించినను, తుదకుఁ దప్పక దుర్గతినొందును.

[భీతిఁగొని యిటునటుఁ జూచుచు నైదుగురు భటులు ప్రవేశింతురు].

మొదటి భటుఁడు:—చూడండీ! రాజుగారిచ్చట నేయున్నారు.

రెండవ భటుఁడు:—మహాప్రభూ! పారిపొండు, పారిపొండు. వైరులు వెంటఁ దరుముచున్నారు.

మూడవ భటుఁడు:—దేవరా! పారిపొండు. ప్రాణముఁ గాపాడుకొనుఁడు.

కళింగ:—ఇఁక నన్ను 'దేవరా', 'మహాప్రభూ' అని పిలువకుఁడు. ఇప్పుడు మీకంటె నెక్కువ వాఁడనుగాను. నే నిచ్చటఁ బ్రాణత్యాగముఁ జేసి. కొన్న నేమి? నాబాకు చేతనే యున్నదిగదా?

నాల్గవ భటుఁడు:—ఆత్మహత్యచే నవమానము, పాపముగూడ సంభవించును. మహాప్రభూ! వలదు, వలదు.

కళింగ:—అట్లయిన నే నిచ్చట నేయుండి యోధులకు విధ్యుక్తగతిని రిపులతోఁ బోరాడుచు మడిసెద. మీరలు పారిపోయి ప్రాణములం గాపాడు కొనుఁడు.

అయిదవ భటుఁడు:—దేవరా! అట్లు సెలవియ్యకుఁడు. మేము మీతోఁ జత్తుము.

కళింగ:—నిష్కారణముగ నిందరఁ జంపనొల్ల. మీరందరు మాయెడలఁ బ్రీతిగల సద్భృత్యులు, మగుడ మాకు రాజ్యప్రాప్తి గల్గెనా మిమ్ములను మేము మరువము. ఇదియే మా తుది యానతిగఁ గైకొని పొండు.

భటులు:—ఏలినవారికి పునరపి రాజ్యప్రాప్తి గల్గుటకై మేము భగవంతునిఁ బ్రార్థింతుము. [కళింగగంగుకు నమస్కరించి నిష్క్రమింతురు.]

కళింగ:—నా యశ్వము నెక్కినచోఁ గడు దవ్వునకు నన్నది కొనిపోయియుండును. కాని యది సకిలించి నన్ను బయలుపెట్టునేమో యని భీతిఁగొని మానివేసితిని. నా శ్వేతాశ్వమా! చంద్రునిఁబోలు చంద్రా! నా వైరిని సకిలించుచు నానందముతో నిన్నెక్కనిత్తువా? నే నమ్మను. [పరశురామ దైవజ్ఞుఁడు సాధువువలె వేసముఁబూని ప్రవేశించును.]

పరశు:—జై! సీతారాం!

గీ॥ శ్రీవివర్జితుఁడైన యో-క్షితిపతీంద్ర! ।
చింతఁగొనకు మైశ్వర్యమ-స్థిరముగాన ।
భాగ్యవంతులున్నట్టు ని-ర్భాగ్యమొందఁ ।
బేదలకుఁగల్గు నిమిషానఁ-బెనుపుసిరులు ॥
ఇడుమలెల్ల నరాళికిఁ-గడుయశస్సు ।
సద్గుణంబులనిడెడి యం-జనములయ్యు ।
శోకతప్తుఁడవై చెందు-నుగుణమీవు ।
జానకీరామ పదపంక-జముల నమ్ము ॥

కళింగ:—[నమస్కరించుచు] మహనీయా! తామెవరో తెలియఁగోరెద. తమ రాడినమాట లిప్పటి నాయవస్థ కెంతయుఁ దగియున్నవి

[సాధువు రాజుచెవిని రహస్యముఁ జెప్పును. కళింగగంగురాజు జులికిపడి యచ్చెరువొందును. వేవేగ రాజునకు తన సాధువేషము వేయును.]

పరశు:—నా వెంటఁ జెచ్చెరరండు. మీకై వైరులు వెదకుచున్నారు. [నిష్క్రమింతురు].

—o—

తృతీయాంకము—పంచమ రంగము

[యుద్ధరంగసమీపమున వేరొక ప్రదేశము? విజయుఁడైన విజయభూపతి కళింగరాజ్యపతాకముం బట్టుకొని తెచ్చెడి యనుచరులతోఁ బ్రవేశించును.]

విజయభూపతి:—భేష్! నా నేస్తకాండ్రందరు బాగుగఁ బోరాడినారు. ఇక రాజ్యము నాదియే. కళింగరాజు పారిపోయె. వాని బట్టితెచ్చువానికి నేను వేయి మొహరీలు బహుమతినిచ్చెద. ప్రమాణముఁజేసెద. నమ్మండి. చక్కఁగఁ బనిచేసి యాతనిఁ బట్టి బహుమతిఁ గొనుఁడు. మీరు నా పక్షమున యుద్ధముఁ జేసినందులకు మీకు సొమ్మిచ్చి పంపెదఁ గాని నాకు విరోధముంబూని యెన్నఁడైన నడచెనా, వాడు వెంటనే చచ్చును. నమ్మండి.

[నిష్క్రమించును].

మొదటి యనుచరుఁడు:—యీ డెక్కడి రాజు మనకు దొరికాడుటా. యీడిమాటలు ప్రమాణాలు చూడఁగా మధ్యవచ్చిన యైశ్వర్యముచేఁ బొగరెక్కినవాని జాడలే. శ్రీ కళింగగంగ మహారాజెక్కడ, వీఁడెక్కడ! ఆ ద్రోహి, జయవర్మ, మనల నీ గతికిఁ దెచ్చినాఁడు.

రెండవ యనుచరుఁడు:—మా బాగా శెప్పావు రా. సేనానాయకుఁడు దిట్టముగా లంచాలు పుచ్చుకొన్నాఁడు. కళింగగంగరాజుకు కాస్త రాజస

ముండేను. మర్యాదకులోటు జరికితే ఒప్పేవాఁడు కాఁడు. అంతే ఆయనతోనుఁడిన చిక్కు. యీడి యొంటిమీద కుళ్ళుకాలవకంపున్నది. ఈ నడిమాంత వదుష్టంబట్టినోళ్ళకల్లా అనుమానా లెక్కువ. క్రూరము, ఇట్టె కోపంరావడం, యియన్ని యుం టాయి. యీడితో యేగడం కష్టం సుమీ. పాపం! ఆ కళింగగంగరాజు నెలా యేటంఢ్తున్నాడో చూడండి.

[మఱియొక్క యనుచరుఁడు ప్రవేశించును].

క్రొత్త యనుచరుఁడు:—యినండత్తోయి! కబురు! కబురు! యిజయబూపతి నవ్వుతూ జయ వర్మను దగ్గరికి పిల్చి సంపేశాఁడు.

రెండవ యనుచరుఁడు:—నాను శెప్పానుగానా? యీడ్తో చారడం మా శెడ్డతెలివి తక్కువైంది.

మూడవ యనుచరుఁడు:—పాపం! కళింగగంగ మారాజు కన్యాయంజేశాం. అయితే ఆ పాపమంతా శేనానాయకుడ్దే.

మొదటి యనుచరుఁడు:—భగవంతుడాణ్ణి తగి నట్టు శిచ్చించాడ్లే.

మూడవ యనుచరుఁడు:—ముందో యెనకో మన తప్పు సవరించుకోవా లబ్బి. మళ్లా శ్రీ కళింగగంగ మారాజు కనిపించెనా ఆరి పాదాల్మీదపడి, చమిం చండని, ఆరికై పోరాడి, మళ్లా రాజ్యం సంపాదిం చియ్యాల. అందరికి సమ్మతమేనా?

అందరు—ఆ, సమ్మతమే. యెల్దాం లెగండి.

[నిష్క్రమింతురు]



మహిళామహాసభ

అధ్యక్షురాలు: శ్రీమతి పొణకా కనకమ్మ గారు

(నడుమనున్న వారు)

ఆకాశ దీపస్తంభము

స్త్రీ విద్యా విధానము

కర్త్రి:—శ్రీమతి భువనగిరి లక్ష్మీకాంతమ్మగారు

(ఏలూరు, చదలవాడ ధర్మరాజుగారిచే నిర్వహింపఁబడుచున్న "స్త్రీ విద్యా విషయిక—పద్యరచన పరీక్షా పీఠము" తృతీయ (12-12-34) వార్షికోత్సవ సందర్భమున పంపఁబడి బహూకరింపఁబడిన కవిత.)

ఉ॥ ఆరయ స్త్రీలకైనఁ బురుషాళికినైనను విద్య యెంతయున్
గౌరవ కారణంబగునుగాన, శ్రమంపడి, విద్యతో, సదా
చారము శీలరక్షణము క్షాంతియు, ధైర్యము, సాధువృత్తి, సం
సారము నిర్వహించుటయుఁ జక్కఁగ నేర్పవలెన్, బడంతికిన్.

క॥ పురుషుఁడు సంపాదింపను । నిరతము గృహకృత్యములను నెలతుక తీర్పన్
బరిపాటి యయ్యె భారత । వరదేశమునందు సంఘబద్ధవిధంబై

ఆ॥ వె॥ బాల బాలికలకుఁ బ్రారంభ విద్య తా । నొక్కతీరుగానెయున్ననవలె
భావి గృహిణికాన బాలిక గృహకృత్య । ములకు దగిన విద్యఁబొందవలయు

తే॥ గీ॥ విద్యవలనను జ్ఞానంబు వెలయు గాన । స్వల్పకాలంబులో విశేషముగ నేర్వఁ
దగిన దేశీయవిద్యను దరుణులెల్లఁ । బొందుగా నేర్చి జ్ఞానమున్ బొందవలయు

క॥ తెలివియు, ధనమును, గలిఁగిన । వలసిన సద్విద్య నేర్వవచ్చును గాకి
య్యిల నెట్టి విద్యనేర్చిన । గులధర్మము విడువఁదగదు కోమలి యొదున్

తే॥ గీ॥ స్త్రీలు ధర్మంబువిడిచినచేటువచ్చు । వంశమున, కట్లుగావున వనజముఖికి
విద్యతోఁబాటు ధర్మవివేకవిధము । శీలరక్షణ విధమును జెప్పఁదగును.

ఉ॥ కాలను, వ్రేలదున్నకొనుఁగాక ధనంబు నగల్ సమృద్ధిగాఁ
దాలిచి యుండుఁగాక వివిధంబగు విద్యలునేర్చుఁగాక దు

శ్శీలము పట్టుబడ్డయెడ స్త్రీలకు గౌరవ మబ్బకుండు స
చ్ఛీలము ముఖ్యమైనదని చెప్పుట ధర్మము విద్యనేర్పుచోన్

శా॥ నీతిన్ వీడక శీలరక్షణకునై నిర్భీతితోఁ బ్రాణముల్
ప్రీతిన్ వీడిన భారతాబ్జముఖులన్ బేర్కొన్న చారిత్రముల్
చేతో మోదముగాగ బాల్యముననే చెప్పందగున్ స్త్రీలకున్
పాతివ్రత్యము యుక్త వర్తనముఁ దద్భావంబులో నాటుకోన్

తే॥ గీ॥ అరయ దేశాభివృద్ధి, భాషాభివృద్ధు । లనిన బాలుర భావివర్తనమునందె
నిలచువారలఁ బెంచెడు నెలఁతుకలకు । దేశచారిత్రకథన రీతియును లెస్స.

క॥ భారత చరితము లెల్లనుఁ । గూరిమితోఁ జెప్పిచెప్పి కొమరుని నెంతో
ధీరునిగాఁ జేయదె జిజి । యారమణి ధరిత్రి నిట్టిదగువిద్యయనన్

క॥ స్త్రీలకుఁ బ్రథమచికిత్సయు । బాలెంతల వైద్యమందు బ్రావీణ్యంబున్
వీలుగ శిశుపోషణమును । వాలాయముగాగ నేర్పవలయునుఁ బేర్మిన్.

క॥ కళలన విద్యలనంగా । నిలభేదము లేదు. స్త్రీలకివియును నేర్పన్
వలె; ముఖ్యముగాఁ బొలఁతియె । కళలకు సధిదైవతంబు కావున ధరణిన్

చ॥ సలలితమైన గానమును జక్కని కుట్టుపనిన్ గరంబు నిం
పొలయు కవిత్వమున్ ముదమునొందఁగఁ జేసెడు చిత్రలేఖనన్
గళలని యండ్రు పెద్ద. లివికాంతలునేర్చిన భుక్తికిన్ గృహాం
బుల ధనలాభమున్ మిగులఁబొందుచు సౌఖ్యము లందకుందురే

ఉ॥ సన్నుత విద్యలన్నిఁటినిఁ జక్కఁగ నేర్పుట కిండ్లయందు సం
పన్నులకైనఁ గష్టమగు బాలికలన్ దలిదండ్రులెప్డుఁ బే
రెన్నికఁ గన్న సంస్థలను నింపుఁగ లాభము నొందఁ గోర్కెలన్
జిన్నతనంబునందుననె చేర్పవలెన్ సతతంబు నెమ్మితోన్

క॥ చదువఁదగు నాంగ్లభాషను । చదువంగాఁ దగును స్త్రీలు సంస్కృతభాషన్
జదువఁదగు నితరభాషల । జదువుల ధర్మంబువిడిచి చను టనుచితమా

తే॥ గీ॥ వయసు వచ్చినబాలికావళికి । బురుష పాఠశాలలయందు నభ్యాసవిధము
కూడ; దది వంశ, శీల, సద్గుణవివేక । ప్రాణమాన ప్రమాద కరంబుగాన

తే॥ గీ॥ బీదలకు విద్య జీవనోపాధియగును । భాగ్యవంతుల కర్హతాఁపాదియగును
జదువు నేర్చుట యసమానశక్తిగనుట । విద్యకెనయైన దున్నదే విశ్వమందు

తే॥ గీ॥ పూర్వ యుగముల నున్నట్టిపుణ్యకాంత । లెల్ల పురుషులతో విద్యలెల్లనేర్చి
జాతిధర్మాలఁగాపాడి ఖ్యాతిజెంది । నట్లు తెలుపును మనల గ్రంథాళియెల్ల

తే॥ గీ॥ దేశవేషాల మార్చుట తెలివిలేక । యన్యజాతి వివాహంబులాడుటయును
ధూర్తతయుఁగాదు చదివినందులకు ఫలము । జ్ఞానమును బొందుపఱచుట
[కాని తలఁప

తే॥ గీ॥ వసుధనాంగ్లము నుద్యోగవాంఛనిచ్చు । సంస్కృతంబిచ్చు విజ్ఞానసరణినెల్ల
దేశభాష ప్రపంచకస్థితినిఁ దెలుపుఁ । గళలొసంగును బుద్ధికిఁగౌశలంబు

తే॥ గీ॥ మాతృభాషలఁ జక్కఁగా మట్టుపెట్టి । చదువుచున్నార లన్యదేశంపుఁజదువు
సాగుపాటున్న, భర్త యుద్యోగియైన । వీధికెక్కుదు రుద్యోగవేషవాంఛ

సీ॥ ఉద్యోగ కాంక్షతో నూళ్లను విడనాడి
సంసారములు బాసిచనిన పిదప
భర్త వేఱొకచోట భార్య వేఱొకచోట
బిడ్డలు నౌకర్ల పెంపులోన
వేఱొకచోఁ బ్రేమ వేఱొకచో మైత్రి
సేవ వేఱొకచోట చింతవేఱ
సహజ లావణ్యంబు సహజ కోమలతయు
సహజమార్దవమును సహనశక్తి

తే॥ గీ॥ తొలఁగ నుద్యోగవతియైన తోయజాక్షి
బొందుసౌఖ్యమ్ము వర్ణింపఁబోలదెందు
దుఃఖమే గాక కష్టంబు తోడఁగలుగు
ద్రవ్యనష్టను నంతయుఁదలఁపవశమె ?

క॥ జాతినిఁ గులధర్మంబును । బ్రీతినిఁ గాపాడునట్టి విద్యలునేర్పన్
లోఁతగు పునాదితీయుచు । ఖ్యాతిగ నిలుపంగవలయు గాంతలవిద్యన్

క॥ గురుకులవాసముకై వడి । పరగెడు స్త్రీ సంస్థలందు బాలికలుండన్
సరసంపు విద్యలెకా కల । వరగుణమగు సహనశక్తి వర్ధిలుచుండున్

తే॥ గీ॥ స్త్రీల విద్యావిధానంబు-చెప్పికొనుటె । కాని దారిద్ర్యభూతంబు కౌగలించి
యున్న భారత దేశాన-నున్నవిద్య । మార్పుచెందిన గతిలేదు? మానినులకు

మ నో ర మ

రా జ కు మా రి

(జనవరి సంచిక తరవాయి)

తదనుగుణముగ నప్పుడు పార్థసారథియు నిట్లు పలికెను.

"దేవా, ఆమహారాజు నాస్థానమున నా కొక సహోదరియున్నది. ఆమె యెల్లప్పుడా రాజకుమారి చెంగటనుండును. మా జ్యేష్ఠ సోదరి యొకతె ఆమహారాజు నాప్తులలో నొకరిని పెండ్లాడి అచటికిఁ బోయియుండుట తమకు తెలిసియేయున్నది. కొంతకాలము క్రిందట నామెభర్త మరణించినాఁడు. మా యక్క యతనితో సహగమన మొనర్చినది.

అట్లు చేయుటకుముందు మా రెండవ యక్కయగు శకుంతల యిచ్చటనుండి వెళ్లి వారియింట నుండుటచేత మా పెద్దయక్క తనచిన్నబిడ్డ నామె కొప్పగించి ప్రాణత్యాగ మొనర్చెను. ఇప్పుడు మాశకుంతల ఆదేశ మున నొకదుర్గాధికారిణియై ఆరాజకుమారి యొద్ద నెచ్చెలియై సంచరించుచున్నది. ఆమె మూలమున నీ విషయమును పరిష్కరించు కొనవచ్చునని నాయూహ."

అప్పుడు కృష్ణవర్మ మెల్లగ—

"నన్నుగూడ మీవెంట దోడ్కొని పొండు." అని, నవ్వుచు నాతో "ఒకవేళ మీ కాదేశమున నీయావేశములేవైన వచ్చిన యెడల నేమి కావలసినది? యథార్థమెద్దియో మీ రెట్లు నిర్ణయింపగలరు? నిస్సంశయముగ నెట్టిగహన స్థితియందైన మీకై నా ప్రాణము లర్పింపఁగలను. ఆయుధోపజీవినగు నేను సాహసకార్యములకు మొగమువాచి త్రుప్పు పట్టియున్నాను." అని పలికెను.

"వలనుకాదు. మీరు వెళ్ళుట నాకిష్టము లేదు. మేము స్వయముగఁబోయి గంద్ర తనమున నాబాలిక నిర్మించుకొనుచున్న ఆకాశసౌధములను నేలమట్టముగ గూల్చి వేయుదుము. ఈపనికి క్షత్రియోచితములగు ఖడ్గముల తళతళ లావశ్యకముగాని యువకుల యవలోకనములును, నగవులును, దలపు లును ఆవశ్యకము లుకావు. ఒకసారి మన ఖడ్గములత్రుప్పురాల్చి వాని నారాజునకు జూపివచ్చి గౌతమి నీటియందుఁగత్తులను కడుగుకొనవలసియున్నది." అని మాతండ్రి గారు సెలవిచ్చి తమ సభ నంతటితోఁ జాలించి లోనికి వెడలిపోయిరి.

నాకు హృదయమున దుపానువలె నంటెను. నేను తక్షణమే మాప్రాసాదమునుండి ఈవలకు వచ్చి వసంత సౌభాగ్యము మెఱసి పోవుచున్న పురోపవనమునకుఁ బోయి అచ్చట నిర్మానుష్యమగు నొకతావున నేకాకినై యాలోచింపఁ దొడంగితిని. నా హృదయమునకు చేరువగనున్న నా మనోహారిణి చిత్రపట మీవలకు దీసి దానిని పువ్వులపై నుంచి మహా మనోహరమగు నాతరులతాదిపత్రముల నడుమ ఆ సౌందర్య మూర్తిని తదేకధ్యానమున జూచుచుఁ గూర్చుంటిని.

ఇప్పు డామె ఏమి యూహించుచున్నది? ఎట్టి యెట్టి యాకాశసౌధముల నిర్మించుకొనుచున్నది? ఎట్టి పట్టుదలతో నున్నది? ఏల యామె కీ కల్యాణ విషయమున నింత యుదాసీనత? అంతమహావైభవముగ జరుపఁబడిన ఆ ప్రధాన మహోత్సవము నేల తృణప్రాయముగఁ దలంప సాహసించినది?—— అను నిట్టి భావతరంగము లుప్పెనవలె నా హృదయమును కలంచివైచుచుండెను.

ఆమె యోష్ఠమున దప్పక నొక విధమగు తృణీకారభావ మున్నది. నే నీ విధముగ నూహించుకొనుచుండగా తీవ్రవేగమున దక్షిణా పథమునుండి వాయువేతెంచి ఒక్కమారుగ గంటఁ గోయిలల కుహూకుహూత్కారములను, మదపుటీగల ఝూంకారములను, తుమ్మెదల రొదలను ఒక్కయూపున గలంచివైచెను. ఆమహా మారుతాగమనముతో నొక్కధ్వని 'ఏల యాలసింతువు? ఆమె నన్వేషింపుచుఁబొమ్ము. తప్పక నీకు జయము చేకూరగలదు' అని నాకు వినుపించిన ట్లయ్యెను.

తరువాత నా శుక్లపక్షమునందలి చవితి చంద్రుని సన్ననిరేక పౌర్ణమినాటి నిండు చంద్రుని మూర్తివైభవమును బూర్ణముగఁ జెందులోపుననే నేను నడికిరేయియందు మా రాచనగరును వదలి నా ప్రాణమిత్రులగు కృష్ణవర్మయుఁ బార్థసారథియు వెన్నంటి వచ్చుచుండగా మా రాజ్యమున దెలిసినవా రెవ్వరును మమ్ముజూడకుండ నా మనోహారిణికై బయలుదేరితిని. నగరమున నిశ్శబ్దముగఁ బిల్లులవలె నడుగుల సవ్వడియైనఁ గాకుండ జాగరూకతతో నడచి పోయితిమి. ఆ నిశీథ సమయమున గోటలో నెవరు మేల్కాంతురో, ఎవరు మా యలుకుడు నెఱిగి మాకు విఘ్నమొనర్తురో, మా వెనువెంట మాతండ్రిగా రెవ్వరినిఁ బంపి మమ్ము హతాశులుగా నొనర్తురో యని గుండెలు దడబడలాడుచుండగ నక్కుచు, దారుచుఁ బ్రతిక్షణమును మా తండ్రిగారి యాగ్రహ మహోదగ్రత్వము నూహించుచు నా మహాదుర్గోపరిభాగమున నొక రహస్యస్థలమునకుఁ జేరుకొంటిమి.

కోట బురుజుపై నప్పు డప్పు డొకరిద్దఱు రక్షకభటు లొండొరులను హెచ్చ

ద్రించుకొనుచుఁ గావలి గాయుచుండుట మాకు శ్రవణపుట గోచరమగుచు వచ్చెను. తరువాత నంతయు నిశ్శబ్దము. సాలెపురుగుల వలె మే మొకరివెనుక నొకరము మా కోట గోడనుండి త్రాళ్లను బట్టికొని వ్రేలాడుచు నీవలకు వచ్చి మారాజ్యము నతి త్వరితముగా నతిక్రమించి దక్షిణాపథముగఁ బ్రయాణముచేసి కమలాకరవర్మ రాజ్యమునకుఁ జేరుకొంటిమి.

నేను మిత్రులతో నారాజును సందర్శించితిని. అతఁడు మమ్ములను మిక్కిలి గౌరవించి మూఁడుదినములు మాకు వివిధోపచారములొనర్చి, మహార్హ మజ్జన భోజనంబుల మమ్ము సంతర్పితులం జేసిన తరువాత నాలవనాడు నే నాతనితో మా రాకకుఁగల కారణమును తెలియజేసితిని. సామాన్య జీవిత వ్యాపారములతో నతనిని జూచువాఁ డెవ్వఁడును అతఁ డొకరాజ్యమునకుఁ బరిపాలకుఁడని తలంపజాలఁడు. రాజ్యలాంఛనములఁగాని, చిహ్నములఁగాని అతఁ డెప్పుడును ధరింపఁడు. అతడెప్పుడును మెల్లగ మాట్లాడు నలవాటుకలవాఁడు. మొగ మంత తేజోవంతముగ నుండదు. నవ్వుటయందుకూడ మిగుల కళావిహీనముగ నిరానందకరముగ నవ్వున ట్లుండువాఁడు. ముడుతలువడి శుష్కమై యున్న యతని శరీరము మిగుల చిన్నదయి చూచువా రెవ్వరికిని అతఁ డొక మహారాజనుకొనుటకు వీలులేన ట్లుండెను.

నేను వచ్చుటకు నిమిత్తమును తెలిసికొని యాతఁ డిట్లు చెప్పెను. “కుమారశేఖరా! నీ రాకవలన మేము గౌరవింపఁబడితిమి. మహోత్సాహ జనకమగు యౌవనమున ప్రేమించుట యనగ నెట్లుండునో నాకుఁ జక్కగ జ్ఞాపకమున్నది. ఎన్నో శరత్కాలముల క్రిందట మాకును విజయరామ రాజేంద్రునకును మా కుమారికా కల్యాణ విషయమైన యొడంబడిక యొకటి నిశ్చయముగ జరిగినది. అది కృష్ణవేణీనది పొంగి వచ్చి మారాజ్యమంతయు జలార్ణవముగ జేసిన సంవత్సరము. ఇప్పటికి గూడ నీ వామెను పాణిగ్రహణ మొనర్చుకొనుటయే మా కానందకరము. ఇది నేను మనఃపూర్వకముగ జెప్పుచున్నాను—అయిన నేమి చేయుదును? పురుషద్వేషిణులగు నిరువురు ప్రౌఢాంగనలు మాయంతఃపురమున నామెకు సహచారిణులయి దాని నింతవఱకుఁ దీసికొని వచ్చిరి. శకుంతలయు, భానుమతియు నను ఈ స్త్రీలు—వారు మహా విద్యావతులట! నా కది తెలియదుకాని చాల నుగ్రమనస్కలగుట నిశ్చయము. వా రామె సిద్ధాంతములకు దోహద మిచ్చుచు వచ్చిరి. గండ్రతనమున ప్రాణగొడ్డమైన నుపదేశములను, చర్చలను, చర్యలను నొనర్చి వారీ రాజ్యమున మా ప్రాసాదమున నొక యాట

యాడిరి. రాత్రియనక, పగలనక, రాజమందిరము లనక, రహస్యప్రదేశము లనక, రాజపురుషులనక, రాణివాసము లనక చెవులు తడికలుగట్టి పోవునట్లు 'సరియైన యవకాశము లేర్పడిన యెడల ఆడుది మగవానికెందును దీసిపోవ'దని ఒక్కటే రొదగ జెప్పుచు వచ్చిరి. ఇదియే వారామె కుపదేశించిన మహా మంత్రము. శ్రీ మొదలితిశ్రీ వఱకు వారికథయం దిదియే పరమోపదేశము. మా యాస్థానమున నంద ఱిదియే చర్చ. విందులలో గూడ నిదియే గొడవ. దినమిరువదినాలుగు గంటలును మారాజహర్మ్యములు ఈ పరమ సిద్ధాంతములతోనే ప్రతిధ్వనించుచు వచ్చినవి. వానితో నా చెవులు చిల్లులు పడిపోయినవి. జ్ఞానోపార్జనమే మనుజ జీవితమునకు ముఖ్యలక్ష్యమై యుండవలెనట. ఇదియే నా కుమారికకుఁ బట్టుకున్న ముఖ్యాభిసంధి. వా రింతవఱకు జ్ఞానమెఱుగని శిశువులవలె నుండి పోయిరట. ఇప్పుడు వారు తమ 'శిశుత్వము'ను విడల్చుకొని నికరమైన 'స్త్రీత్వము' నలవరించుకొనవలెనట. అంతేకాదు. ఆమె ఏతద్విషయమును గూర్చి దారుణమైన గేయములను గూడ రచించుచు వచ్చినది. నిశ్చయముగా నవి పరమ దారుణమైన సిద్ధాంతముల నభినివేశముతో ఘోషించుననుటకు సందేహములేదు. ఒక్క గేయములందే కాదు. ఆమె యే మొనర్చినను మిగుల దారుణముగనే చేసివేయును. ఆ గేయములందు కూడ నిదియే కథ—తమ శిశుత్వమును విడల్చుకొనవలెనట. ఇంకను ఒక క్రమములేకుండ, ఒక పద్ధతి లేకుండ, ఒక హేతువులేకుండ మానవలోకమున నిక గొప్ప పరివర్తనములు కలిగితీరునని ఆమె యక్షరములబెట్టి, పద్యములల్లి ఘోరములగు సిద్ధాంతముల నుద్ఘాటించుచు వచ్చినది. వీనిని స్త్రీలు విధివిరామములు లేకుండఁ బాడుచువచ్చిరి. ఇట్టి కవితా విషయముల దెలిసినవా రందఱు—నే నందురా, నేనంత విమర్శకుఁడగాను; నాకు శాంతియే కావలసియుండెను—విమర్శకాగ్రేసరులట, వా రవి కవితయం దప్రతిహత ప్రతిభావంతములని మెచ్చుకొందురు. నిశ్చయముగా నన్నవి అప్రతిభునిగ జేసివైచెను.

"చివర కామె నన్నొకవరముఁ గోరినది. మీ రాజ్యపు సరిహద్దులలో నేను వేసవికాలమున బోవుచుండు మహాభవన మొకటి యున్నది. దానిని తనకీయవలసినదని నన్నడిగినది. నేను వలదంటిని. అయినను మార్దవమగు మార్గమున బోవువాఁడనగుటచేత దాని నామె కిచ్చివేసితిని. తదుత్తరక్షణముననే కన్యా మహావిద్యాలయ మొకటి ప్రతిష్ఠింపవలయునను నుత్సాహముతో విద్యుద్వేగమున నచ్చటికి వెడలిపోయెను.

“ఇంతకంటె నధికముగ మాకేమియును దెలియదు.— కేవల మీయొక్క విషయమే. వాండ్రచ్చట పురుషుల మొగమైన జూడరు. ఆమె తన సహోదరుఁడగు నజయునిగాని, తరువాత కవలై బుట్టిన రామకృష్ణులను గాని జూచుట కొప్పుకొనదు. వారు తమ యక్కవంటి ప్రతిభాశాలిని లేదని గర్వమునఁ జెప్పుకొనునట్టివారు. అయిన వారిని సహిత మామె చూడదు. ఇఁక నేను—క్షమింప వలయు.—నాకును, నావారికిని నడుమ విరోధమును బెట్టుకొనుటకు నా కెంతమాత్ర మంగీకృతము కాకపోవుటచేత నేనామె కిట్టి స్వతంత్రమిచ్చి సరిపెట్టుకొనుచున్నాను. అయినను మన మిదివఱలో జేసికొనిన యొడంబడికను బట్టి కొంతవఱ కీ విషయమున నేను బాధ్యుఁడనని మీరు భావించుచుండుటచేత—అట్లు మీరు భావించుట యుక్తమే!—ఆమెపేర నుత్తరములువ్రాసి మీ కీయగలను. కాని నిజము చెప్పవలయు నన్నచో మీ కామె వశమగుట కెట్టి యవకాశమును లేదని నేను భావించుచున్నాను.”

ఆ రా జట్లు చెప్పునప్పుడు ధారాళమగు నంతఃకరణమితోఁ దన కుమారికా విషయమైన చరిత్రమును దాచుకొనకుండ బలుకుచున్న ట్లింతయభినయించినను శాస్త్రోక్తముగా జరిగిన మా ప్రధాన మహోత్సవమును గూర్చి కొంత లాఘవముగా దలంచుచుండెనాయని నాకు స్ఫురించెను. అయినను నావధూమణి నన్వేషించు తహతహ నన్నుఁ దొందరపెట్టుచుండుటచేత నే నాతని వీడ్కొని బయలుదేరితిని. నా మిత్రులతో మఱల వచ్చినదారినే మారాజ్యపు సరిహద్దు ప్రాంతములకు వచ్చి అచ్చట దుర్గమమగు కొండలకుఁ జేరువ గోదావరియొక్క పవిత్రోదకమున మహా ఫలవంతముగ నున్న భూములకు వచ్చి సాయంకాలమగుచుండగ నొక ప్రవాహ తీరముననున్న చిన్న నగరమునకుఁ జేరుకొంటిమి.

ఆ నగరమున కావలితీరమున నా మనోహారిణిచే శాసింపబడుచున్న స్త్రీలస్వైర విహారక్షేత్రములున్నవి. నే నా పురపాలకుని సందర్శించి ఆతఁడు మమ్ములను యోగ్యముగ సంభావించిన తరువాత మారాకకు కారణమును దెల్పి రాజిచ్చిన యుత్తరముల నతనికిఁ జూపించితిని.

అతఁడు వానినిఁజూచి తెల్లబోయి దీర్ఘాలోచనముఁ జేయువానివలె మమ్మవలోకించుచు తుదకీవిధముగఁ జెప్పెను.

“ఇచ్చటి శాసనములఁ బట్టి మగవాఁడనువాఁ డెవ్వఁడా భూమిపై నడుగుఁ బెట్టుటకు వలనుపడదు.”

మఱల నంతలో నేమనుకొనెనో కాని, యిట్లు పలికెను. “మారాజే ఇట్టి యుత్తర

ముల వ్రాసినప్పుడు ఇక్కడి చట్టములఁబట్టి నే నేలకలుగఁ జేసి కొనవలెను! మీ రే మొనర్చినను తప్పక మామహారాజు నాకు బాసటమై యుండగలడు. కావున ముందుగ మీ రిట్టి వా రిచ్చటికి వచ్చిరని వారి కెఱుక చేయువాఁడను కాను.”

అతఁడు వాచవియగు మదిరారస మానుచు నది రక్తమున కుత్సాహమిచ్చుచుండగ తిరుగ నిట్లనెను. “నిస్సంశయముగ మీరీ విషయమున నన్ను దోషరహితునిగ జేయఁ గలరు. ఆమె యొకసారి ఈమార్గమున వచ్చినది. అప్పుడామె భాషించుచుండగ వింటిని. హా! హా! ఆమె వైఖరి నాకు మిగుల భీతావహమైనది. లోకప్రాణము లకాధార హేతు వాదిశక్తియని పూర్వులాడు మాట నాకుఁ బ్రత్యక్షముగ ననుభవమైన దని నేను భావించితిని. ఇందఱాడువాండ్రలో 'నభూతో నభవిష్యతి' యని చెప్పదగిన వైఖరి నామె కానుపించినది. ఆహా! ఆమెకు పురుష జాతిపై నెంత రోత! ఎంత అసహ్యత! ఎంత మహాద్వేషము! మగజాతిని మాడ్చివేయుటకు ఆమెచేయు ప్రయత్నములన్నియు తెలియ వచ్చినప్పుడు మొదట నాకొడల రణకంప ముదయించి చావునకు సిద్ధమైతి ననగ మీరు నమ్ముదురా?—ఇట్టి యాడుది మఱి యే దేశమున, యేజాతియందును నింతవఱకు బుట్టి యుండలేదని ఘంటాపథముగఁ జెప్పగలను. అయిన నేమి? ఆమె మా మహారాజుగారి గాదిలి తనయ. రాజవంశమువా రన్న మా కుండవలసిన భక్తితాత్పర్యము లామె యందు త్రికరణశుద్ధిగ మా కుదయించుచునే యుండును. ఆమె సిద్ధాంతముల నొకసారి దెలిసికొనిన తరువాత మా రాచనగరునుండి ఆమె కేమేమి యుత్తరప్రత్యుత్తరము లందింప వలసివచ్చినను—మగవారా సీమల నడుగిడ రాదు కావున—నా కొమార్తె కొకపరిచారికను తోడిచ్చి ఆడుగుఱ్ఱములపై నెక్కించి పంపుచుందును. వారి స్వతంత్రసీమలలో గొన్నివందల మైళ్లవఱకు దేశమంతయు నాడువాండ్రే సేద్యము చేయుదురు. నాగలి కైన వారెద్దుల నుపయోగించరు. అన్నియు నావులు. అక్కడి గుఱ్ఱములన్నియు గోడి గలు. కుక్కలన్నియు—”

ఈవిధముగ నతఁడు హాస్యమాడుచుండగా నాకస్మికముగ మెఱపుమెఱసిన ట్లొక యాలోచనము నా కుదయించెను. దానిని వెంటనే కార్యరూపమునకుఁ దీసికొనివచ్చితిని. మా రాజభవనమున మేము మువ్వుర మును కాళిదాసాదుల నాటకముల నభినయించుచు అందు స్త్రీపాత్రముల నప్పుడప్పుడు ధరించుచుండుట నాకు జ్ఞప్తికి వచ్చెను. నే నాపురపాలకునకు ధన మిచ్చి మాకై స్త్రీలదుస్తులను గొనిరా నియోగించితిని. అతఁ దుల్లాసలక్ష్మిని గై సేసినట్లు

నవ్వుకొనుచు వెడలిపోయి కొంతసేపటికి కన్యకాజనయోగ్యమైన చీరలను దెచ్చి తానే మాకు శృంగారింపఁజేసెను.

ఆ పురపాలకుఁడు మా స్త్రీవేషధారణములను జూచి నోరుమూసుకొని యుండునట్లు వలసినంత ధన మాతనికి లంచమిచ్చి మేము ఆ స్త్రీస్వాతంత్ర్యసీమలలో మిగుల సాహసమునఁ బ్రవేశించితిమి.

ఆసరిత్తీరము ననుసరించి మే మశ్వారూఢులమై అర్ధరాత్రిసమయమప్పు డాకన్యామహావిద్యాలయ పరిసరమునకుఁ జేరుకొంటిమి. అచ్చటి కాభవనమునందలి దీపము లంధకారమున మిణుగురు బుర్వులవలె మెఱసిపోవుచుఁ గానవచ్చెను. అచ్చటి సింహద్వారమున నూర్ధ్వభాగమున నర్ధచంద్రాకారముగ మిగుల నున్నతముగనుండి జూపరుల కా విద్యాలయౌన్నత్యమును బ్రకటించునట్లుండెను. దానిపై స్త్రీవిగ్రహమొకటి ప్రతిష్ఠింపఁబడియుండెను. ఆవిగ్రహమున కిరుపార్శ్వములందును ఱెక్కలున్నట్లు నక్షత్రముల కాంతిని దెలిసికొంటిమి. ఆద్వారముఖమున మఱియు నేదో వ్రాసియున్నది కాని రాత్రియగుటవలన మే మావ్రాతను గుర్తుపట్టజాలకపోతిమి. మేము ముందునకుఁబోయి లోన నొక యుద్యానవనమునఁ బ్రవేశించితిమి. అందొక చిన్నవీధియున్నది. అందు ద్వారపాలకురాలి నివాసగృహ మున్నది. అది ఎంతరాత్రివేళయైనను మిగుల సందడిగ నుండెను. భూగర్భమునుండి చిత్రప్రతిమల చేతులనుండి ఈవలకు వర్షపుజల్లువలె గొట్టఁబడుచున్న నీటితుంపరలవలనను, మిగుల నెత్తైన ప్రదేశమునుండి క్రిందకు బలితమై గొట్టుకొనివచ్చున ట్లమర్పఁబడిన జలపాతముల హోరువలనను, అప్పటప్పటికి వినిపించుచున్న గడియారముల ఘంటాఘోషములవలనను, మిగుల గ్రొవ్వియుండిన కోకిలల యాలపధ్వనులవలనను మాలో మే మాడుకొను మాటలే మా కస్పష్టముగ వినుపించుచుండెను.

అక్కడ భరతమాత యాకృతివలె నొక ఱాతిచిత్రమున్నది. మఱియు భూగోళము వలెను, బ్రహ్మాండమువలెను గోళాకృతినున్న గాజుగొట్టములలో నమర్పబడి రెండుదీపము లక్కడ జీకటి యుండకుండ దూరముగా బంపివేయుచుండెను. అచ్చటనే ద్వారపాలకురాలి గృహముండుటచేత మే మక్కడనున్న బహిర్ద్వారమువద్దకుఁ బోయి తలుపుతట్టితిమి. వెంటనే ఇరువురు పరిచారికలువచ్చి మ మ్మశ్వావతరణ మొనరింపఁజేసి మాగుఱ్ఱములను లాయములోనికి దీసికొనిపోయిరి.

అంతలో నాగృహాధికారిణివచ్చి మమ్ము లోనికిఁ బిలుచుకొనిపోయెను. ఆమె కొంచెము స్థూలమగు దేహముఁగలది. అయినను మిగుల యానందమును వెల్లడించుచు

బంతివలె నెగిరిపడుచున్నట్లు త్రిప్పుకొనుచు నడువ నేర్పుగలది. ఆకన్యామహావిద్యాలయమును గూర్చి మే మామెను జాలవిషయము లడిగి తెలిసికొంటిమి. విద్యాలయమున విద్యగఱపు గురువులలో నెవ్వ రగ్రశిఖామణులని మేము ప్రశ్నింపఁగ నామె 'శకుంతలాదేవియు, భానుమతీదేవియు' నని బదులుచెప్పెను.

'ఇరువురలో నెవతె యెక్కువ సౌందర్యవతి? ఎవతె యోగ్యతరమైన స్వభావము కలది?' అని తిరుగ నామెను బ్రశ్నించితిమి.

'శకుంతలాదేవి' యని ఆమె బదులు చెప్పెను.

'అట్లయిన మే మామెవారము' అని మేము మువ్వుర మేకగ్రీవముగ నంటిమి.

నే నంతట గూరుచుండి యొక లేఖ వ్రాసితిని. అది స్త్రీజనస్వభావమైన లిపిలో నుండవలెనని నే నూహించి అందలి యక్షరములు తూర్పుగాలి గొట్టుటవలన 'దాసోహ' మ్మని వ్రాలిపోవు వరిపైరువలె గన్పడునట్లు చేసితిని.

'ఆంధ్రమున భారతీస్వరూపిణియగు రాజకుమారీమణి కనేక వందనములు—

ఉత్తరాంధ్రదేశమునుండి మువ్వురు యువతులము మీావిద్యాలయమున విద్యోపార్జన మొనర్పవచ్చితిమి. శకుంతలాదేవిగారి శిష్యవర్గమున మమ్ము జేర్చుకొనవలసినదని వినయపూర్వకముగ వేడుకొనుచున్నాము.'

ఇట్లు వ్రాసి దానిపై నొక లాక్షాముద్రికను వైచితిని. ఆ ముద్రయందు మన్మథుఁ డంధీభూతుఁడై ఏవో యక్షరములను చేత బట్టుకొని యుండెను. అతని వెనుక పార్శ్వమున రతీదేవి నిలచి యతని నేత్రాచ్ఛాదనము తొలగించుచున్నట్లుండెను.

ఆ యుత్తరమును వేకువజాముననే లోనికిఁ బంపవలసిన ట్లేర్పాటుచేసి నేను శయనించితిని. శయనించియుఁ జాలవఱకు జాగ్రదవస్థయందే కనులు మూసికొంటిని. సగము నిద్రయం దేదో యంధకారమున గొట్టికొని పోవుచు మహోదధియందలి తరంగడోలికలపై నాట్యమాడు చంద్రు నుపలక్షించుచున్నట్లుండెను. ఆవలిదిక్కున నంధకారమున మొదట నగమ్యగోచరమయ్యు, తరువాత నంతలో తేజస్వంతముగ గనుపించిన భాగ్యవంతమగు దేశమొకటి తళుక్కున గానవచ్చెను.

ఇది మనోరమ యను వచనకావ్యమున
కళావతియను నామెచేఁ జెప్పఁబడిన
రాజకుమారియను కథయందుఁ
బ్రథమభాగము.

గృహోద్యాన శీర్షిక

గులాబి

గుమ్మలూరు సత్యనారాయణగారు, బి.ఎస్‌సి.ఎజి.

(గత సంచిక తరువాయి).

అంట్లు చెడిపోవుటకు కారణములు

1. వేళపట్టున నీరు తేమ లేక వేళ్లువచ్చు యంటు భాగమున నేల యెండిపోవుట.

2. అజాగ్రత్తగా నెక్కువ నీరు పోసినను, లేదా పెద్దవర్షముచేతనైనను, వేళ్లువచ్చు భాగమున నేల కొట్టుకుపోయి లోని వేళ్లగపడుట.

ఖండములు

ఖండముల ద్వారా నీ దిగువరెండు లాభములు రాగలవు.

(అ) తల్లిమొక్కయొక్క కులసాంప్రదాయములు నిలచును. మొక్కకు కులసాంప్రదాయములన్న పెక్కురకు నవ్వు రాకమానదు. వివాహములందు చిక్కుపెట్టు కులసాంప్రదాయము లిక్కడ కూడను రావలెనా యని.

(ఆ) ఒకొక్కప్పుడు తల్లిజాతి బ్రతుకులో కని విని యెరుగని గుణములు వింతగా నుదయించుచుండును. (Sports)

ప్రవర్థనావిధానము—కొంచెముబలముగానున్న 10, 12 అం|| పొడవుగల ఖండము నొక కొమ్మలో నుండి వాడిగల చాకు లేక కత్తెరతో తీయుము. (ఇట్టి పనులకు వాడిగల పనిముట్లు అత్యవసరము. వాని నుపయోగించకున్న మొక్కలోనున్న ముఖ్యమగు 'విభాజ్యకణములు' (Cambium cells) చెడిపోవును. గ్రామదేవతల గుడులదగ్గర జంతువులను బలివేయునపుడు, ఒకొక్కప్పుడు, వాడిలేని కత్తుల వలననేమి, గురితప్పి తగిలిన దెబ్బలవలననేమి, తల సరిగా తెగక యొక్కసారి కనుమూతలో మరణించుటకు మా రెంతబాధపడి, కొట్టుకొని, కొట్టుకొని, యరచి, చావలేక జంతువు చచ్చుచున్నదో యూహించుకొనిన యాబాధ మొద్దుపనిముట్లవలని మొక్కల నష్టమునకు సరిపడగలదు. పిదప నాఖండమునకు దిగువభాగమును యేటవాలుగాను, మీది తుద గుండ్రము లేక సమముగాను జేసి, మీది తుదను కొంచెము మైలతొత్తు కలిపిన పేడముద్దలో ముంచుము. అట్లు చేయుటవలన ఖండములోనిపదు నిగిరిపోదు. కోసిన పిదప నాఖండమును చాలకాలము గాలిపాలించినను, కుళ్ళినపేడలో ముంచినను, కొన్ని క్రిములు ఖండములలోనికి జేరి మొక్కను జెరుప గలవు. ఖండముయొక్క క్రిందిభాగము నేటవాలుగా నుంచుటవలన, యెక్కువ విస్తీర్ణమునుండి గోలెము లోని తేమను పీల్చుకొనును.

ఇట్లు ఖండమును దయారుచేసి 6'X5"X4" గల చిన్నగోలెములలో 1 భాగము బొగ్గుగుండ, 3 భాగములు సన్నని యేటియిసుక 1 భాగము తోటమన్ను మిశ్రమము వేసి యందు పాతవలెను. లేదా, 1'—6" మూతి, 6" ఎత్తుగల పెద్దగోలెము (Seedling pan)లో ఎఱ్ఱమన్ను, ఇసుక, పశుగెత్తము, పెంటయెరువు-అన్నియు సరిపాలు గలిపి వేయవలెను. ఏవిధములోనైనను, క్రింది కన్నములపై బిళ్లపెంకులను, మీద పెద్దబొగ్గులను వేయుట మరువరాదు.

(సశేషము)



సౌందర్యపోషణ

కండ్లు

శ్రీమతి యమ్. యస్. కమలమ్మగారు

అక్షియే యాత్మకు వెలుగైయున్నది. ఇల్లెంత నిర్మలముగాను, వైశాల్యముగాను, వైకల్యములేక యందమిచ్చురీతినిగట్టబడియున్నను గవాక్షములు లేక సర్వలక్షణసంశోభితంబవదు గదా! శరీర చ్ఛాయ యెంత సుందరరూపాలంకారవిలాసములకు గురియగుచున్నను శోభాయమానముగా తళతళ మెఱయు కండ్లు లేనిచో రాణింపదు. సర్వేం ద్రియాణాం నయనం ప్రధానమను వాగ్యుక్తి యా బాలగోపాల మెరింగినది. దృష్టిలోపమంతటి లోటు జీవికి వేరొకటి యుండబోదు. దృష్టి లోపిం చిన జీవితమంతయు నిరర్థకమగును.

అనురాగ వికసితమగు వదనారవిందమున మధుర మంజుల యౌవనాలంకార శోభతో ఇందీవరములవలె నొప్పు మనోజ్ఞ నేత్రములు చూపరులకు నేత్రానందము నుద్భవింపజేయును. మనోహరములై నీలాలవలె నిగ నిగలాడెడు విపులాయత నేత్రములు దేహారోగ్య బల సంపదలవలన జనించును గాని బాహ్యానయ గార లేపనములవలన గలుగవు. అధిక ప్రయాసతో మెఱుగులు దిద్దెడు కలికాంజన నుర్మాలు సురూప విలాసమున గానబడు కాయ మెలికలను బాపును గాని దేహముఖమునుండు వికారకళంకములను రూపుమాపవు. అందచందములకు ప్రాణవాసముగా యుండు సుందరమనోహర స్ఫురన్నేత్రములు గలి గిన చంద్రవదనలు యరుదుగా నున్నను కోమలరమ ణీయములగు చిగురుటాకులవలె కనులకు విభ్రాంతిని గొలుపు సొంపెక్కిన యాబకద్యుతులు గలిగిన కామి ను లీలోకములో యధికముగా వెలయుచుందురు. ముఖాలంకారమునకు ప్రధానమగు నేత్రసౌందర్యముల వలన ముఖవికాసపు అందచందముల లోపాలోపములు నిరూప్యమగును. అత్యంతావశ్యకమగు చూపులేని కండ్లకంటె మరణమే శరణ్యము. దృష్టి లోపించి నచో లోకవాసనలయందు నేవగింపు గలుగును గావున మానవులెల్లరును, విషయానురాగములయందు యభిలాషయున్న, కండ్లను ఆరోగ్యవంతముగా నుంచుటకు దగిన యాధారములు వెతకవలెను. ఆరోగ్య సౌఖ్య సంపదలవలన రూపలావణ్యాతిశయములు తమంతటనే యబ్బగలవు. అదృష్టవంతురాలు నయ నానందకరములగు చూపుల కలిగియుండును. అయితే ధీమంతురాలు దృష్టియొక్క మూల్యమెరింగి తగిన విధమున నుపయోగించుటకు ప్రయత్నించును. అమూ ల్యములగు కండ్లను బహుజాగ్రత్తగ, నుపయోగించు కొనకుండుటచే గదా దృష్టిలోపములు గల్గుటయు తన్నివారణకొఱకు అనేకోపకరణముల నుపయోగింప వలసివచ్చుటయు సంభవమగుచున్నది. దృష్టిభేదము లేమాత్ర మేర్పడినప్పటికిని నేత్రవైద్యుల సలహాను గొని లోపముల నతిత్వరలో సవరించుకొనుట యవ సరము.

శరీరమునకు కండ్లు ప్రధానాంగములగుటచే నివి దట్టముగానుండు పొరలతో పొదుగబడియున్నవి. నయనముల సంరక్షణార్థమై చుట్టును బొమికలెత్తుగా నేర్పరుపబడియున్నవి. కాన నేత్రభాగముమీద దెబ్బ తగిలినప్పటికిని నేత్రముల చితకకుండా నీ కనుబొమలు కాపాడును. కనురెప్పలు కంటి కెట్టి హానియుకలుగనీయవు. దుమ్ము దూసర మీకంటిలోపల బడకుండజేయుటకు రెప్పలకు వెంట్రుక లమర్పబడియున్నవి. ముక్కునకు దూరముగాయుండు కంటి కొలుకులయందు గ్రంధులు గలవు. అవి కన్నీటిని తయారుచేసి కంటిగ్రుడ్డును తడుపుటచే తేమజేసి నలుసుమసకలను తొలగించి కళ్ళను శుభ్రపరచును.

నేత్రములకు హానికలుగు ఉపద్రవములనుండి కాపాడుకొనవలెను. అనగా నేత్రములకు మరపాగ తగులుట దుమ్ము దూసరములు పడుతావులందు సంచారము, వడగాలి తగలకుండ జూచుకొనుట, అధిక తేజస్సుగలిగిన వస్తువులను చూచుట, అతిసూక్ష్మములైన వస్తువుల తిలకించుట, చిన్న యక్షరముల వ్రాయుట చదువుట, సూదికి దార మెక్కించుట, పూసలు గుచ్చుట, విద్యుద్దీపముల కాంతియందు యుండడము, విరామము లేక యలయుటవలన కంటిపొరలు, కనుకలకలు, కంటిపువ్వులు, కంటికూనలు, పసరుకామిలలు, రేజీకటి, నిలువుకండ్లు, పిల్లికండ్లు యిత్యాది పలురకములగు రోగములు జనించి చత్వారము, దూరదృష్టి మున్నగు దృష్టిమాంద్యములు కానిపించును. దృష్టిభేదము లేమాత్ర మేర్పడినను నేత్రరక్షణములకు సులోచనములు కూడ ఒకవిధమగు సంరక్షణకారిగాను, తలనొప్పుల మూలమున జనించు దృష్టి దుర్బలతలకు యుపశమనకారిగాను, చత్వారము మున్నగు దృష్టిబాధల నివారించుటకు సాధనకారిగాను నుండుటచే స్త్రీపురుష భేదములేక దృష్టిసంరక్షణార్థము కంటికిజోడుల తరగతులవారిగా ధరించుట యుపయుక్తమగు విధాయకధర్మము.

నేత్రములకు విరామములు:— శరీరమున కలసటలేక యెల్లపనుల నిర్ణయకాలములందు జరుపవలెను. నేత్రమర్దనము నేత్రములకు బలము యందము నిచ్చును. నేత్రగోళముమీద మిగుల మృదువుగా మర్దన సేయవలెను. మరియు నేత్రరోగులు చల్లని మంచినీటితో కండ్లను తుడిచికొనుటయు, మైలుతుత్తమును, పటికను చాది కంటికి కలికము వేయుటచేత నేత్రదృష్టికి మిగుల తేజస్సును కలుగును. చలిగాలి, ఎండవిసురు తగులకుండ నీలిగుడ్డ గాని నల్లగుడ్డను గాని యుపయోగించిన నేత్రరోగములు త్వరితముగా నివర్తించును. నగరవీధులయందు, మెఱుపుతీగల దివ్వెలయందు కనులు సులభముగా అలసట జెందును కాన యీ బాధలకు లేతచాయగల నలుపు గోధుమరంగుగల అద్దపుజోడుల ధరించుటచే కంటిని సంరక్షించినవారమగుదుము.

నగరపట్టణములలోని నాగరికత యెచ్చు కొలది స్త్రీలయందు అనాదికాలమునుండి తరతరములుగా వచ్చుచుండు కాటుకపూతను మరిచియుండుటచేత నేత్రపటలరోగము, అరకంటిచూపులు, కణతికాచబింబములు మొదలగు రోగములు జనించుచున్నవను విషయమును నెరుంగలేకయున్నారు. స్త్రీలయొక్క మనోహర ముఖవైఖరి దివ్యలోచనవిలాసమువలన గల్గుచున్నది గాని ముఖాలంకార విశేషణమువలనగాదు. నేత్రసౌందర్యమునకు కనుబొమ్మల, రెప్పవెంట్రుకల సవరణవలన కొంత ప్రకాశమానమగు తేజస్సు నివ్వగలము. సర్వసాధారణముగా పొత్తుగా అమరిన కనుబొమల జుట్టువలనగాని, చెదరిన బొమిడికల జుట్టువలనగాని, మందగించిన కనుబొమల జుట్టువలనగాని, వట్రువుగానుండు కనుబొమల జుట్టువలనగాని, వంగివాలిన కనుబొమల జుట్టువలనగాని ముఖవికాసము తెల్లవారినట్లు అగపడుట వింతకాదు.

బాలవిజ్ఞానశాఖ

పిల్లలపాటలు

శ్రీమతి చదలవాడ రాఘువాంబగారు

అద్దారాత్రి ప్రొద్దు
నిద్దురవేళ—నిద్దురవేళ
ఎవరమ్మ మాతలుపు
గొల్లమీ పేరు—గొల్లమీ పేరు
మేమమ్మ కుక్కలకు
కూటికొచ్చేము—కూటికొచ్చేము
కూడేల తప్పింది
కూడెట్లు దెస్తూ—కూడెట్లు దెస్తూ
ఎవరమ్మ మాతలుపు
గొల్లమీ పేరు—గొల్లమీ పేరు
మేమమ్మ పిల్లలకు
పాలకొచ్చేము—పాలకొచ్చేము
పాలవేళ తప్పింది
పాలెట్లుదెస్తూ—పాలెట్లుదెస్తూ
ఎవరమ్మ మాతలుపు
గొల్లమీ పేరు—గొల్లమీ పేరు
మేమమ్మ దూడలకు
మేతకొచ్చేము—మేతకొచ్చేము
మేతవేళ తప్పింది
మేతెట్లుదెస్తూ—మేతెట్లుదెస్తూ
ఎవరమ్మ మాతలుపు
గొల్లమీ పేరు—గొల్లమీ పేరు
మేమమ్మ త్రాడులకు
నారకొచ్చేము—నారకొచ్చేము
నారోయి పీచోయి
నాకేమితెలుసు—నాకేమితెలుసు.

ప్రేమసుందరి—భీమజాంబుకు

శ్రీమతి మల్లెల సుశీలాదేవిగారు

పూర్వము రాజంసెట్టియను ధనవంతుడొకడు దొంగలచే దోచుకొనబడి దరిద్రుడయ్యెను. తిరిగి కొంచెము సరుకుతో వర్తకము చేయబోయి తన ముగ్వురు కొమార్తెలను బిలచి యేమికావలెనని యడిగెను. పెద్దవారలు నారచీరలును చిన్నది ప్రేమ సుందరి వాడని రోజా పుష్పమును తెమ్మనిరి.

అందు కాయన వల్లెయని వెడలిపోయెను. ఆయన కొంతదూర మేగినపిమ్మట గొప్ప గాలివాన వచ్చెను. దగ్గర నొక భవముండగా నాయన దానిలో బ్రవేశించెను. అచ్చట నొక విశాలమైన చావడియందు బల్ల మీద నానావిధ భక్ష్యభోజ్యఫలాదు లుండెను. కడుపు నిండా విందారగించెను. ప్రక్క నొక్కగదియందు విశ్రమించుటకు తగిన శయ్యా సిద్ధముగనుండెను. ఆయన తనువు నామంచముపై వ్రాల్చెను.

తెల్లవారెను. స్నానమున కన్నియు సిద్ధముగా నుండెను. ఆయన చక్కగ స్నానముచేసి దండెమున

మిస్ సంతోష్ ఖన్నా

శ్రీమతి శాంతకుమారి

నున్న క్రొత్త బట్టలు కట్టుకొనెను. చుట్టునున్న వనములోని శృంగారము పరికింప నరిగెను. అచ్చట తనకుమార్తె కోరిన వాడెఱంగని తెల్లగులాబి పువ్వు కానవచ్చెను. పువ్వు ఆయన కోసెను.

తోడనే యొక భీమజాంబు వురుము ఉరిమిన ట్లరచుచు మీదపడవచ్చెను.

భీమజాంబుడు—నాయింట కుడిచి విశ్రమించి కట్టినదేకాక నా చెట్టుపువ్వునుకోయ సాహసించితివా?

వర్తకుడు—అయ్యో క్షమింపుడు. తెలియక చేసితిని.

జాంబుడు—ఈపువ్వును గోరిన నీబిడ్డనైన నా కిమ్ము లేకున్న నీచావుకైన నొప్పుకొనుము.

వర్తకుడు—ఆసంగతి యింటికిపోయి కనుగొని వత్తును.

జాంబుడు—రేపే రావలెను. లేనియెడల నీ ప్రాణములు దక్కవు.

రాజంసెట్టి ఇంటికివచ్చి జరిగినదంతయు పూస గ్రుచ్చినటుల చెప్పెను.

ప్రేమసుందరి తనవలన తండ్రికి ప్రాణహాని వచ్చెనని తలంచి యామహాభవనమునకు తండ్రితో ప్రయాణమై చేరెను. ఒక్కతెయె అక్కడ యుండుట కిచ్చగించి తండ్రిని బంపివేసెను.

అట్లా బాలికామణి యచ్చట భక్ష్యభోజ్యఫలహారములు భుజింపుచుండ వికృతాకారపు భీమజాంబుడు ప్రక్క యాసనమున వచ్చి కూర్చుండెను.

భీమజాంబుడు—బాలికామణి! నేను గూడ నిచ్చట కూర్చుని భుజింపవచ్చునా?

ప్రేమసుందరి—వలదు, వలదు, నాకు భయము వేయుచున్నది.

దానికి జాంబుడు ఖిన్నవదనుడై ఆమెవైపు చూచెను. సుందరి డెందము కరిగి పోయెను. జాలిచే యామె యందుల కియ్యకొనెను. అట్లు కొన్నాళ్లు గడచెను.

ఒకనాడు సుందరి వనవిహారమున కరిగెను. జాంబుడుకూడ తోడరావచ్చునా యని అడిగెను. సుందరి 'వలదు, వల'దని వారించెను.

దానికి మరల దీనవదనుడై ఆమెను ప్రార్థించెను. ఆమె నిరాకరింపలేక పోయెను.

కొన్నిదినము లట్లు జరుగగా ఒకనాడు వసంత కాలమున పువ్వుల వనములో సుందరి విహరించుచుండగా జాంబు డిట్లనియె—'ఓ ప్రేమసుందరీ నన్ను వివాహ మాడెదవా?

సుందరి—ఓ భల్లుకరాజా: నీరూపు నే నెట్లోర్వగలను?

ఆమాటలు కా జాంబుడు కండ్లనుండి చొటచొటా నీరు కార్చెను.

సుందరి గుండె నీరయి, నే నొక్కసారి మా యింటికి పోయివచ్చి నీ కేమాటయు చెప్పెదననెను.

జాంబుడు—నీవు నెలరోజులలో వచ్చెదవా? అని దీనవదనుడై పల్కెను.

సుందరి సెలవు పుచ్చుకొని పుట్టిన యింటికివెళ్లి ఎన్నిదినములకును రాలేదు. ప్రేమసుందరికి భీమజాంబుని సంగతి జ్ఞాపకమువచ్చి తిరిగి భవనమునకు వచ్చెను. జాంబుడు చిక్కి శల్యమై కొనయూపిరితో యుండెను.

జాంబుడు—నేను చనిపో సిద్ధముగ నున్నాను. నున్నాను. కనుక నా వాడులేని గులాబిపువ్వు తెచ్చి నీచేతితో నన్నొకసారి యంటుము.

వెంటనే సుందరి పరుగెత్తుకొనిపోయి పువ్వును తెచ్చి దానితో వాని నంటెను

వెంటనే జాంబుడు వికృతరూపమును విడిచి సుందరాకారుడగు రాజకుమారుడయ్యెను. అదిచూచి యామె యాశ్చర్యవంతురాలై వానిని వివాహమాడి సుఖముగనుండెను.

గ్రంథపరిచయము

ఆంధ్రవాచస్పత్యము:—

ఈ ఉద్గ్రంథముయొక్క 1, 2, 3 భాగములు సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు మాసములలో ప్రకటింపబడినవి. మొదటి భాగమును 'నవంబరు మాసపు 'గృహలక్ష్మి'లో విమర్శించితిమి. అందు ప్రారంభమైన అకారాది పదవర్గము మూడవభాగములోని 223-వ పుటవరకు వచ్చినది. ఇప్పుడు ఆకారాది పదములు జరుగుచున్నవి. ఈ నిఘంటువుయొక్క విశేషలక్షణములు ప్రయోజనములనుగూర్చి నవంబరు పత్రికలో విపులముగ తెలియబరచినాము. ఇందు ఎత్తుకొనబడిన ప్రతిపదమునకు కేవల మర్థముమాత్రమే కాక అందుకు చేరిన అనేకాంశములు లిఖింపఁబడుట చేత ఆయా సందర్భములలో దీనివలన చాలామట్టుకు చారిత్రక, భూగోళక, ఆలంకారిక, వైయాకరణాది శాస్త్రముల ప్రయోజనములెల్లయు లభించును. ఇది కేవలము అధికారవాచకమగు లక్షణగ్రంథమే గాక విజ్ఞానదాయకమగు సకల శాస్త్రసంగ్రహ గ్రంథము. అపూర్వములగు వస్తువులనుగూర్చి తెలుపవలసినప్పుడు చిత్రములుగూడ గలవు. ఈ నిఘంటువు మొత్తము మీద 2500 డెమ్మీసైజు గ్లేజుపుటలు, 80000 పదములు గలిగి నెలకు 100 పుటలచొప్పున ఒకొక్క భాగము ప్రకటింపఁబడును. ఒకొక్క భాగము వెల రు. 1-0-0. ముందుగా ఒకేసారి ధనము చెల్లించు వారికి రు. 15-0-0. 1, 2, 3 వాల్యూములకు మూడు దఫాలుగా ముందుగా ఖరీదు చెల్లించువారికి రు. 5, 6, 7 లు. వలయువారు తూర్పుగోదావరి జిల్లా కాకినాడ తాలూకా కరపగ్రామము శ్రీ ఆంధ్ర వాచస్పత్య కార్యాలయాధిపతి, ఆంధ్రవాఙ్మయ మహోదధి శ్రీ కొట్ర శ్యామలకామశాస్త్రిగారికి వ్రాసి పడయవలెను.

రామవిలాసము:—

క్రౌనుసైజు 116 పుటలు. ఏనుగులక్ష్మణకవి విరచిత ప్రబంధమునందలి ప్రథమాశ్వాసము. వెల రు. 0-12-0లు. వత్సవాయి గోపభూపాలేశ్వరున కంకితమై తద్వంశవర్ణనము మాత్ర మిందుఁగలదు. తక్కిన ఆశ్వాసములు చిక్కకున్నవని తోచును. చరిత్రాపరిశోధకుల కత్యావశ్యకమైన గ్రంథ మగుటయేకాక సారస్వతాభిమానుల నుల్లాసడోలికలలో నూగించు సుందరతరశయ్యాకలితమై యున్నది. పాఠ్యగ్రంథ నిర్ణయ సంఘమువారిచే అంగీకృతమైనది. ప్రకాశకులు శ్రీ వత్సవాయి రాయజగపతి వర్మగారు.

పెద్దాపుర సంస్థాన చరిత్రము:—

క్రౌనుసైజు 171 పుటలు. వెల రు. 1-0-0. పెద్దాపురము సంస్థానమును సుమారు మూడువందల యేండ్లు పాలించి కీర్తిశరీరులైన క్షత్రియ వత్సవాయి వంశీకుల చరిత్రము. ఇప్పటి కాగుసారులు ముద్రితమై 7500 ప్రతులు చెల్లుటయే ఈ గ్రంథము యొక్క చారిత్రకప్రాముఖ్యతకు సుందర గంభీర శయ్యకు, వత్సవాయి వంశస్థుల పరాక్రమౌదార్య పరిపూరిత పరిపాలనమునకు ప్రబలసాక్ష్యము. ఇట్టి చరిత్రాపఠనమువలన ప్రస్తుతము నిరుత్సాహవివశులై యున్న ఆంధ్రులకు ఆత్మవిశ్వాసగౌరవములును దీక్షాధీరత్వములును అలవడగలవని గట్టిగా చెప్పవచ్చును. బహువిధ పరిశ్రమలకోర్చి శ్రీ వత్సవాయి రాయ జగపతి వర్మగారు ఈ గ్రంథమును రచించి ప్రక

టించి ఆంధ్రుల కమూల్యమైనసేవ నొనరించినారు. ఇదియును పాఠ్యగ్రంథనిర్ణయ సంఘమువారిచే అంగీకృతమే.

పద్మనాభ యుద్ధము:—

క్రౌనుసైజు 80 పుటలు. వెల రు. 0-12-0లు. చట్రాతి లక్ష్మీనరసింహ కవికృత ఏకాశ్వాస వీరరస ప్రధాన ప్రబంధము. పద్మనాభయుద్ధము కథా వస్తువు. ప్రస్తుత విజయనగర సంస్థానమును మొన్న మొన్నటివరకు పాలించిన పూసపాటి వంశీయుల నిర్వక్ర పరాక్రమములును, యుద్ధమున వీరమరణము నందిన విజయరామగజపతిగారి ధైర్యగాంభీర్యాది సుగుణ గణములును నిండుకన్నులకు గట్టునట్లు వర్ణింపఁబడినది. కవిగారు యుద్ధసమయమున రాజుగారి ప్రక్కనుండి సర్వమునకు సాక్షియై వర్ణించినారు. ఆంధ్ర క్షత్రియు లొనరించిన ఆఖరు యుద్ధమిది. దీనితో కళింగరాజ్యలక్ష్మి వారి కరతలము నుండి జారి చీలి చిందరవందరయై చిన్నచిన్న జమీందారీ లైనది. పరాజయమును మరణమును నిశ్చయమని యెఱిగి వీరస్వర్గమును జూఱగొన నెన్ని క్షత్రియ కుటుంబము లీ యుద్ధమునందు పెనుపండువువందువలె పాల్గొని వీరవిహార మొనర్చినదియు పఠింప మేనఁబుల కాంకురములు పొడముౘను—శ్రీ బుఱ్ఱా శేషగిరిరావుగారు అనేక డాక్యుమెంటులలోనుండి వివిధ విషయముల నెత్తి మాపి చారిత్రకయాదార్థ్యమును బుజువు పరచుచు విపులమగు పీఠికను వ్రాసినారు. శ్రీ వత్సవాయి రాయ జగపతివర్మగారు ప్రకాశకులు. పాఠ్య గ్రంథ నిర్ణయసంఘమువా రంగీకరించినది.

ఆంధ్రదేశ కథలు:—

క్రౌనుసైజు 74 పుటలు వెల రు. 0-10-0 లు ఆంధ్రరాష్ట్ర పత్రికలో మున్ను ప్రకటింపఁబడిన పది సాంఘిక కథలు. అంతర్వర్ణ, అంతర్జాతీయ, విధవా, రజస్వలాది వివాహములయం దభిరుచి కల్పించుచు సంఘసంస్కారమునకు ప్రోత్సాహ మొసగుచున్నవి. ఇదియును పాఠ్యగ్రంథ నిర్ణయ సంఘమువా రామోదించినదే. శ్రీ వత్సవాయి రాయ జగపతివర్మగారు ప్రకాశకులు. నాలుగుగ్రంథములు కావలసిన వారును పెద్దాపురవాస్తవ్యులగు ప్రకాశకులకు వ్రాసిన బడయుఁ గలరు. సమస్త ప్రాథమికోన్నత పాఠశాలాధికారులును తమ గ్రంథాలయములలో వీనినుంచి బాలురు చదువునట్లు ప్రోత్సహింతురుగాక !

కమ్యూనిష్టు ప్రణాలిక:—

క్రౌనుసైజు 72 పుటలు వెల రు. 0-4-0 లు కమ్యూనిష్టు సిద్ధాంత పితామహులగు మార్క్సు, ఎంజిల్సుగార్లు 1848 లో జర్మనీ భాషలో రచించి, తరువాత వివిధ భాషలలోనికి తర్జుమా అయిన కమ్యూనిష్టు మేనిఫెస్టో అను సుప్రసిద్ధ సిద్ధాంత ప్రణాళికకు ఆంధ్రానువాదము. కమ్యూనిష్టు ఆశయములను స్పష్టముగ నెఱుగ గోరువారు దీనిని పఠించువో సరియైన సంగతులు తెలుసుకొనఁ గలరు. ప్రకాశకులు, ఆదర్శ గ్రంథమండలి, ఎలమఱ్ఱు, కృష్ణజిల్లా.

సామ్యవాద సిద్ధాంతాలు:—

క్రౌనుసైజు 43 పుటలు వెల రు. 0-2-0 ఫ్రెడరిక్, ఎంజిల్సు వ్రాసిన గ్రంథమున కాంధ్రానువాదము. ప్రశ్నోత్తర రూపమున నుండుటచేత సామ్యవాదము గూర్చిన అనేక సందేహము లిందువలన తొలగి నిర్దుష్టమైన జ్ఞానము కలుగును. ప్రదర్శకులు, ఆదర్శ గ్రంథమండలి, ఎలమఱ్ఱు, కృష్ణజిల్లా.

సామ్రాజ్యవాదము మొదటిభాగము:—

క్రౌనుసైజు 33 పుటలు. వెల రు. 0-2-0 లు లెనినుగారి రచనకు ఆంధ్రానువాదము. ఈ సిద్ధాంతముయొక్క పుట్టు పూర్వోత్తరములు, ఇందుకొరకొనరింపఁబడిన యుద్ధములు, వర్తక విస్తీర్ణము, ధనిక

ప్రాబల్యము, దాస్యవృద్ధి మొదలయిన విషయము లిందు వర్ణితములు. ప్రకాశకులు, ఆదర్శగ్రంథమండలి, ఏలవఱ్ఱు, కృష్ణజిల్లా.

శ్రీలక్ష్మీ నారాయణీయము:

క్రౌను సైజు 28 పుటలు వెల రూ. 0-3-0 పూర్వకవి గోకులపాటి కూర్మనాధ కవిగారు. శ్రీ లక్ష్మీదేవియొక్కయు కృష్ణభగవానుని యొక్కయు సరస సల్లాపవైఖరులతో గూడిన శృంగారగ్రంథము. సంపాదకులు, దేవులపల్లి వీరరాఘవశర్మగారు, కాజులూరు, కాకినాడ తాలూకా, తూర్పుగోదావరిజిల్లా.

రాజ్యపాలనా శాస్త్రము:—

క్రౌనుసైజు 116 పుటలు వెల రు. 1-0-0 గ్రంథకర్త శ్రీయుత శనివారపు సుబ్బారావుగారు. పశ్చిమగోదావరిజిల్లా కాకరపఱ్ఱునందలి సరస్వతీ గ్రంథమాలవారి 36-వ కుసుమము. ప్రపంచములో వివిధరకములైన రాజ్యాంగము లున్నవి. రాజపాలితములు, ప్రజాపాలితములు, వర్గపాలితములు, శాసన సభలు, ఎన్నికలు, హక్కులు, మొదలైన విషయము లెన్నో తెలుసుకొనకున్నచో వాటియొక్క ప్రాశస్త్యా ప్రాశస్త్యములను మనము నిర్ణయించుకొనలేము. ప్రజలకీ జ్ఞానములేనిచో దేశములో సర్వజన శ్రేయస్కరమైన స్వపరిపాలనా పద్ధతి లభింపక, ఏప్రభువులో ఏ నాయకులో ఏదయాధర్మభిక్షుముగనో నిర్ణయించు తంత్రమునకు వారు దాసులు కావలసి వచ్చును. హిందూదేశము స్వయంనిర్ణయ సూత్రమునకు, కాన్‌స్టిట్యుయంటు అసెంబ్లీకి ఆందోళనము చేయుచున్నది. ఈ సమయమున ప్రజలకెల్లరకు వివిధ దేశములలోని రాజ్యాంగములతో పరిచయమును పఠనమూలకమగు అనుభవమును అత్యావశ్యకమైనది. ఆంగ్లభాషలో ఇట్టి గ్రంథము లెన్నియో యున్నను విద్యాధికులకు తప్ప జనసామాన్యమునకు వానివలన ప్రయోజనము లేకున్నది. శ్రీయుత సుబ్బారావుగారు ఆ గ్రంథములలో ప్రధానమైన వానిని పఠించి, ఆ జ్ఞానమునకు ప్రస్తుత వార్తాపత్రికా పాఠనా లబ్ధితానుభవమును చేర్చి, తమ సర్వజన హృదయంగమమైన సులభ శైలిలో యీ గ్రంథమును ప్రకటించినందు కెంతయు వంద్యులు. స్వరాజ్యా కాంక్షు డెందములలో పాదుకొని, రాజకీయ సిద్ధాంతములను ప్రజలలో వ్యాపింపం జేయఁగోరువా రందరును దీనిని పఠించి తీరవలెను.

ఆంధ్రాస్తిక మహాసభ (మాధవరం 1934)

క్రౌనుసైజు 20 పుటలు. శ్రీమతి జ్ఞానాంబగారి అధ్యక్షోపన్యాసము ఆధ్యాత్మిక విజ్ఞానతుందిలమై, భక్తిరస పూరితమై, నీతిమార్గదర్శకమై, ఐకమత్య బోధకమై తనరారుచున్నది. ముఖ్యముగా స్త్రీలోకము పఠించి నవనాగరకతా విలాస డోలికలలో కొట్టుకొని బోఁగోరుచున్న యువతీ మణుల కొసఁగ వలసిన సలహా లెన్నియేని గలవు.

ఆనంద సామ్రాజ్యము:—

క్రౌనుసైజు 20 పుటలు వెల రు. 0-2-0 లు విశాఖపట్టణముజిల్లా ఎలమంచిలి దగ్గర మేలుపాక లోని వ్యాసకుటీరము వారిచే ప్రకటితము. శ్రీస్వామి రామతీర్థవారి వ్యాసమున కనువాదము. ఆనంద సామ్రాజ్యము విషయ వాంఛాపరాయణత్వమునందు కాక ఆత్మజ్ఞానమునందు మాత్రమే కలదని ఋజువు పరచు యుక్తియుక్తోదాహరణ పూర్వకమైన వ్యాసము.

కాశీయాత్ర:—

క్రౌనుసైజు 28 పుటలు. జటప్రోలు సంస్థానము కొల్లాపురమునందలి స్నేహలతా కవితాసమితి యధ్యక్షులగు శ్రీయుత వాజపేయాజుల రామసుబ్బారాయడుగారును వారి సతీమణిగారును చేయఁ దలచుకొన్న కాశీయాత్రను గూర్చిన సంభాషణమును

తత్సందర్భంబున నలుపఁబడిన కాశీపుర వర్ణనలు, శ్రీ విశ్వనాథుని మహిమావర్ణనలును కలసి గంగానది కంటె అచ్ఛముగ ప్రవహించు సుందర కవితా కావ్యము. పురాణదంపతుల బిరుదించు ఈ విద్వన్మణుల సంయోగము స్నేహలతా సంఘరూపమై కవితాకాంతా విహార మాదిగాగల నలువదియొక్క ప్రసవములను తొడిగి ఆంధ్రదేశమున నెల్ల కమ్మని కవితావాసనలు మలయించుచున్నది. ఇదివరకు ప్రకటింపఁబడిన నలువదింటికి గూడ ఇది చూడామణి యని చెప్పనొప్పును. కాసీపట్టణమును తలచుకొనుచునే ఇట్టి మరందమును చిందిన వీరి లేఖిని సాక్షాత్ శ్రీ విశ్వనాథుని దర్శనము చేసుకొని యెట్టియెట్టి కవితాస్రవంతి నాంధ్రసాహిత్య లోకములోనికి ప్రవహింపఁ జేయునో యని ఆంధ్రు లెదురు చూచుచుండుటలో అచ్చెరువు లేదు. శ్రీ శేషాద్రిరమణ కవులు పఠించి తనివిదీర పీఠికవ్రాసిన కావ్యమును మేము సమగ్రముగ ప్రశంసింపఁ బూనుట సాహసమగును.

శ్రీ మధ్వాచార్యచరిత్రము:—

క్రౌనుసైజు 112 పుటలు. వెల రు. 1-0-0 గ్రంథకర్త శ్రీయుత మారేమండ రామారావు గారు, ఎం. ఏ., బి, ఇడి, రాజమహేంద్రవరము. వేదాంతులు, దివ్యజ్ఞాన సమాజములు, అద్వైత సిద్ధాంతులు మొదలగు వారి ప్రచారమువలన ద్వైత మతముపై నుదయించు అపోహల నీ గ్రంథము తొలగించును. ద్వైతమతముయొక్క ఆవశ్యకతను, ఆస్తిక్యతను వ్యక్తపరచును. శ్రీ మధ్వాచార్యులవారి దివ్యజన్మను, విద్యను, సన్యాసమును, ప్రచారమును, మహిమలను నిర్దుష్టమగు శైలిలో వర్ణించును. ఇన్నిటికంటె ముఖ్యముగ అనేక సమకాలికపత్ర, శాసనముల సాక్ష్యముతో ఈ గ్రంథము వ్రాయఁబడిన కతన ఆస్తికులకు, విద్యార్థులకు ఎంత ప్రయోజనకారియో చారిత్రక పరిశోధకుల కంత సహాయకారి. మనపాఠశాలలలో మతమునుగూర్చి తరగతులు పెట్టినను పెట్టకున్నను, ఇట్టి గ్రంథములనైన పాఠ్యములుగ నిర్ణయించినచో విద్యార్థులు కేవలము పరీక్షలు వ్రాయను కావలెననే దృష్టితోనే గాక సహజముగ నుదయించు శ్రద్ధానందములతో వీనిని పఠించి నిర్మల ప్రవర్తన జాతీయజ్ఞానము గలవారగుదురనుట కాటంకము లేదు. ప్రతులువలయువారు ద్వైతప్రచారిణీ గ్రంథమాల, ఇన్నీసుపేట, రాజమహేంద్రవరమునకు వ్రాసుకొనవలెను.

శ్రీ కృష్ణజంత్రి:—

డెమ్మీసైజు సుమారు 200 పుటలు. క్యాలికో బైండు వెల రు. 1-4-0 లు. సాదాబైండు రు. 1-0-0. గ్రంథకర్త శ్రీయుత దుద్దుకూరి శ్రీకృష్ణమూర్తి గారు, దుద్దుకూరు, ఒంగోలుతాలూకా గుంటూరు జిల్లా. కరణములకు మేస్త్రీలకు, ఇతర ఉద్యోగస్థులకు మిక్కిలి ఉపయుక్తము. దినవారీ, నెలవారీ, సంవత్సరవారీ, యకరమువారీ, సెంట్లవారీ, పైసలవారీ, రూపాయీలవారీ, వేలవారీగా అద్దెలు, సిస్తులు, కూలులు, జీతములు మొదలగు వానిని లెక్కలు చేయకుండనే యిది చూచి వెంటనే వ్రాసి జమాబందీ మొదలగు వానిని సలుపవచ్చును. గ్రంథకర్తగారు మిగుల శ్రమపడి, ధనవ్యయ మొనర్చి తన తోడికరణములు మొదలగు వారి కష్టముల నీరీతిని తగ్గించినందుకు కెంతయు ప్రశంసనీయులు.

గ్రామ పరిపాలన

ఈ పత్రిక లోగడ 1931-32 లో ఒక సంపుటము నడువడి ఆగిపోయినది. తిరిగి మార్గశీర్షమాసములో తల యెత్తినది. ప్రతిపౌర్ణమి, అమావాస్యకు ప్రకటింపఁబడు పక్షపత్రిక. తెనాలి కార్యస్థానము. సంపాదకుడు దుద్దుకూరు కరణంగారగు శ్రీయుత దుద్దుకూరు శ్రీకృష్ణమూర్తి గారు. దేశపరిపాలనకు గ్రామపరిపాలనకు అవినాసంబంధముగలదు. గ్రామపరిపాలనము సూటిపడనిదే దేశమునకు స్వరాజ్యము రాదు. దేశీయోద్యమములను నడుపుటకైనను లేక కూల్చుటకైనను గూడ కరణములు సమర్థులు. వారికి సరియైన రాజకీయపరిజ్ఞానము, ప్రభుత్వనిర్వాహణ

శక్తియు లేకున్నచో దేశములో నెట్టి ప్రచారము జరిగినను లాభములేదు. గ్రామోద్యోగుల నెల్ల నిట్టి శక్తులలో సుశిక్షితులను చేయుటకు ఈ పత్రిక మిగుల పనికివచ్చును. ఇందలి సంపాదకీయములు మొదలగు వ్యాసములు అఖిలభారతప్రభుత్వకాంగ్రెసు తత్వసమగ్ర విమర్శనములతో గూడి అఖిలభారతమితవాద సభానాయకుల ధోరణులను బురుడించుచున్నవి. సంపాదకుని సమర్థత క్రింద ఇది తోడి తెలుగు పత్రికలలో గౌరవముగొనుచు, గ్రామీణులకు సరియైన విజ్ఞానమును కార్యనిర్వాహణశక్తిని పురిగొల్పుచు చిరంజీవియగుగాక యని ఆశీర్వదించుచున్నాము. 8 పుటలు. ఫూలుస్కేపుసైజు దళసరి పత్రములు చక్కని తప్పులులేని అచ్చు. సాలుచందా రెండు రూపాయిలు.

ప్రకృతి:—

ఆంధ్రఆరోగ్యవిషయిక మాసపత్రిక- రాయలుసైజు 32 దళసరిపుటలు. చక్కని అచ్చు చందా సం|| 1-కి రు. 3-0-0 పత్రికాధిపతి, ప్రకృతి కార్యాలయట్రస్టు అధ్యక్షుడు శ్రీయుత పుచ్చా వెంకట్రామయ్యగారు, పడమటి లంక, బెజవాడ. ఇంతవరకు 16 సంపుటములు ముగిసి 17 వ సంపుటము జనవరితో ప్రారంభమైనది. పత్రికసైజు, ప్రమాణము, విషయము, సొగసు, దృక్పథము అన్నిటియందును క్రొత్తమార్గమును త్రొక్కుచున్నది. ఆధునికాచార రోగములకు విరుగుడులగు చికిత్స లెవ్వియు ఆమందులలో గాని ఆహారములలోగాని చిక్కవనియు, కన్నతల్లియగు ప్రకృతి దేవతయొక్క విన్ననగు కనుసన్నల మెలగి వర్తించుటొండె త్రయీధర్మములకు మోక్షమునకు గూడ సాధనమనియు నిందలి ప్రతివ్యాసమును ఋజువు పరచుచున్నది. అందందు విషయబోధకములగు పటములును చేర్చఁబడినవి. ప్రతి గృహమేధియు వైద్యుడును గూడ పఠింపఁదగును.

నాట్యకళ:—

సచిత్ర త్రైమాసికపత్రిక భావసంవత్సర మార్గశిర మాసమున ప్రకటింపఁబడిన ప్రథమసంచిక మాకార్యాలయము నలంకరించినది. సంపాదకులు శ్రీయుత నీలంరాజు వెంకటశేషయ్యగారు, 7 తంబుచెట్టివీధి, తపాలపెట్టె 288 మదరాసు. చందా సం|| 1-కి రు 2-0-0 లు. 1924 వ సంవత్సరమునుండియు లేచుచు పడుచు 1933 లో మదరాసు సభలో స్థిరపడి 1934 లో వివిధ విస్ఫురదాశయములతో ప్రకటమైన ఆంధ్రనాటకకళాపరిషత్తువారి ఆదరణముక్రింద ప్రకటింపఁబడును. సాలు చందా రు 2-0-0 లు. ప్రథమమగు విశేషసంచిక 102 ఫెదరువైటు పుటలు గలిగి, నాట్యకళాభిమానుల చిత్రపటములు ప్రాచీన భంగిమల చిత్రములుకలిగి, నాటకరచన, అభినయము, ప్రదర్శనము, రంగులు, దుస్తులు, పద్యముల పాటల ప్రయోజనము మొదలగు విషయమునుగూర్చి అనుభవజ్ఞులు వ్రాసిన సుమారు యిరువది గంభీరవ్యాసములు గలిగి, సర్వాంగసుందరమై అలరారుచున్నది-నటకులకు, కవులకుగూడ మిగుల ప్రయోజనకరమై దేశీయ నాటక సాహిత్యప్రదర్శనముల నున్నతమగు స్థితికి తెచ్చుటకిది సహాయపడగలదని నిశ్చయముగ చెప్పవచ్చును. శ్రీయుత వెంకటశేషయ్యగారి సమర్థ సంపాదకత్వమున నిది చిరంజీవియై వర్ధిల్లగలదు. నాట్యకళాభిమానులందరిపైని దీనిని పోషించి ఇతోధిక సౌందర్యవంతముగ నొనరింపవలసిన భారము మోపియున్నది.

బ్రాహ్మణగీత:—

క్రౌనుసైజు 30 పుటలు. వెల రు 0-8-0 గ్రంథకర్త శ్రీయుత బులుసు రామజోగారావుగారు. ఇందు సకలోపనిషత్సారమును స్వతంత్రములగు ఆంధ్ర భాషారచనలలో వెలువరింపఁబడినది. బ్రహ్మనెఱింగినవాడే బ్రాహ్మణుడని రూఢిపరచుచు, బ్రహ్మము నెఱుగుటకు త్రెంచుకొనవలసిన సమస్తబంధములు నిందు నిరసింపఁబడినవి. ఇన్ని స్వల్పపద్యములలో ఇంత గంభీరముగ ఇంత విజ్ఞానమిముడ్చగల్గుట కవిగారి ప్రజ్ఞకు నిదర్శనము. శ్రీయుతులు సర్ రాధాకృష్ణను, వి. యల్. శాస్త్రి, బులుసు నరసింహశాస్త్రిగార్లు దీనిని వేనోళ్ల నభినందించినారు.

వింతలోకము

ఎంత ప్రేమ! ఎట్టి శాంతి!:—

ఆఫ్రికాఖండమున కుత్తరభాగమున అట్లాసు పర్వతములున్నవి. ఏటవాలైనరాళ్లు, పావురపు గూళ్లలాటిగుహాలు, దుర్భేద్యమైన చిన్నచిన్నలోయలు గలిగి అవి శత్రువులకు దుష్ప్రవేశ్యములుగ నుండును. అక్కడ బెర్బెరులు అనుపేరుగల ఒక మహమ్మదీయజాతి నివసించుచుండును. వారు గొఱ్ఱెలను మేకలను అచ్చటి మైదానములలో మేపుకొనుచు క్రిందనుండు సెలయేళ్ళయందలి బావులయందలి నీరములను గ్రోలుచు శాంత జీవనమును జరుపుకొనుచుందురు. అచ్చటి రాళ్ళు తుపాకుల దెబ్బలకు పగలవు. గుహా ముఖములకుపోయి తుపాకులను ప్రేల్చినగాని అందలి జనులకు దెబ్బలు తగలవు.

మొరాకో అనఁబడు ఈ దేశముపై ఫ్రెంచివారికళ్ళు పడినవి. ఇరువదియైదు సంవత్సరములనుండి ఆదేశమును స్వాధీనము చేసుకొనుటకై వారు తంటాలుపడుచుండిరి. పెద్దపెద్దసైన్యములు వారి గుహాలయొద్దకును లోయలలోనికి వెళ్లి వారి నెదుర్చుచుండిరి. వారు లొంగక కొండశిఖరముల మీదికి పిల్లలు పాపలు స్త్రీలు మందలతో సహా పరిగెత్తుకొని పోవుచుండిరి. అక్కడ నీటి చుక్కలు దొరకక, క్రిందికి సైన్యభయముచే రాలేక గొంతుకపాడియారి అనేకులు చచ్చిపోవుచుండిరి. ఇట్టి సమయమున తుపాకులు బాంబులు సహాయమున క్రింది పాషాణముల నెల్లపగలగొట్టి గుహాలను లోయలను మూసివేసి బెర్బరులకు నిలువలేకుండ ఫ్రెంచివారు చేయుచుండిరి. ఈవిధముగ వేనవేలు చనిపోగా మిగిలిన 6000 మంది ఫ్రెంచి వారికి వశ్యులైరి. ఫ్రెంచిసైన్యముల నేమార్చి ప్రతి రాత్రియు అనేకమంది కొండల మీదినుండి నీటి చాయలకు దాహాము తీర్చుకొనవచ్చుటయు, తెల్లవారుసరికి సైనికుల తుపాకుల కెఱయై శవముల పుట్టలగుటయు—ఇది యీ యిరవైఅయిదు సంవత్సరములనుండి జరుగుచున్న చరిత్ర. ఫ్రెంచివారీయుద్ధము నంతటిని అక్కడ శాంతి స్థాపనార్థము చేయుచున్నామని ప్రగల్భములు కొట్టుచున్నారు. ఈ చరిత్రయంతయు మిస్టర్ వార్డుప్రైసు అనునాతనువ్రాసిన ఒక నూతన గ్రంథము ద్వారా లోకమునకు విశదమగుచున్నది. ఫ్రెంచి సేనాని నీవిషయమై ప్రశ్నించినప్పుడు "వారిని నేను ప్రేమించెదను, ప్రశంసించెదను, కాని వధించకమాన"ననెను. ఆహా ఎట్టి ప్రేమ, ఎట్టి ప్రశంస, ఎట్టివధ, ఎట్టిశాంతి!

దస్తూరీకికూడ జాతిభేదమున్నది!:—

మనుష్యులకు వలెనే మనుష్యులు వ్రాసెడి అక్షరములకు కూడా జాతులువుంటాయి. ఒకరు వ్రాసిన దస్తూరీనిబట్టి అతనిశీలము, అతనివృత్తి, అతని కేదైనారోగముంటే ఆ రోగము ఈ మొదలైన వాని నన్నిటినీ నిర్ణయించవచ్చును. ఈ విధంగా వ్రేలుతూ అయిరోపాఖండములో ఇప్పటికి అనేకులు జోస్యములు చెప్పుకుంటూ మందులమ్ము కుంటూ డాబులు కొట్టుకుంటూ పొట్టపోసు కుంటున్నారు. కాని శాస్త్రీయపరిశోధన లెక్కువైన తరువాతను ఇవన్ని నిజమనియే శాస్త్రవేత్తలు నిర్ణయించుచున్నారు. "టిటిక్ బిట్సు"అనే పేపరు కొన్ని ఉదాహరణలతో సహా యీ సంగతిని దృఢపరుచుతున్నది.

మనుష్యులు తరుచుగా ఏ వస్తువుల మధ్యకూర్చుని లేక నిలబడి పనిచేస్తూవుంటారో, వారి అక్షరాలకు వద్దన్నా కాని ఆయా వస్తువుల ఆకారాలు ఎక్కడో ఒక దగ్గరవచ్చి పడతాయి. కళ్లవైద్యుడు వ్రాసే అక్షరాలు కన్నుపాపలలాగ చిన్నవో, లెన్సులలాగ కొంచము గుల్లవో అయివుంటాయి. కోళ్లను పెంచేవాడి అక్షరాలు కోడిగ్రుడ్లలాగ కోలం గానేనా వుంటాయి, గ్రుడ్లను పొదుగుతుండే పెట్టలలాగ కుదమేసినట్టుగానైనావుంటాయి. కుక్కలను పెంచేవాడి అక్షరాలు కుక్క తోకలలాగ వంకలు తిరగడమో కాళ్లలాగ ముందుకు దాచుకొని వుండడమో జరుగుతుంది. పందులు కాసేవాడి అక్షరాలకు ఎక్కడో ఒక దగ్గర పంది తోకలలాటిపొట్టి జట కాలు కుచ్చులు తగిలిస్తాడు. ఒకవేళ యిట్లా తగిలించడం అలవాటు లేనివాళ్లైనా యిక ముందు ఇట్లు తగిలించడం విధిగా అభ్యాసం చేసుకుంటే వారివారి వృత్తులను నిర్ణయించుట శాస్త్రజ్ఞులకు సులభమవుతుంది కనుక అట్లు తగిలించడం అభ్యాసం చేసుకోవలసినదని కూడా యీ పత్రిక సలహాయిచ్చుచున్నది.

ఇక దస్తూరీనిబట్టి మానవుల ఆరోగ్య పరిస్థితులను గూడా నిర్ణయించవచ్చును. ఆరోగ్యముగా ఉన్నవారే చలిలో వణుకుతున్నప్పు డొకమోస్తరుగాను, ఉక్కలో ముక్కుతున్నప్పు డొక మోస్తరుగాను వ్రాస్తారు. ఒక మనిషియొక్క సాధారణపు దస్తూరీ యేలాగుంటుందో నిర్ణయించిన తరువాత, దానినుంచి ప్రత్యేక లేఖలలోని దస్తూరీ యెట్లు భేదమగుచున్నదో చూచి ఆ భేదములను బట్టి మానవుల రోగములను నిర్ణయించవచ్చును. తల నొప్పిలో బాధపడుతున్న వాని అక్షరములు క్రిందిభాగముల కంటె మీదిభాగములు ఒత్తుగాపడి తలబరువుచే బాధపడు తున్నట్లేయుండును. సంతతము నిల్చుండడమో, శక్తికిమించి నడవడమో మొదలగు కారణములవల్ల నిరంతరము

కాళ్లనొప్పులు కాళ్లపీకుతో బాధపడుచుండు వారియక్షరములకు క్రిందిభాగములు మీది భాగములు వంకరలై స్ఫుటము తక్కువై యుండును. సరిగా రక్తము నాడులలో ప్రవహించనివారి కలములోనుండి సిరా కూడా ఒక నిమానంగా ప్రవహించక ఒక్కొక్క దగ్గర ముద్దముద్దలుగాను, ఒక్కొక్క దగ్గర అసలే అంటకుండాను ఉంటుంది. అక్షరాలు సాఫీగాసాగక, కొన్నికొన్ని వంకరగీతలు కలిసి ఒక అక్షరమైనట్లుగా వుంటే అతను అజీర్ణవ్యాధిచే బాధపడుతున్నాడ నిగ్రహించవాలట. కలిపి వ్రాతలో ప్రతిపదముయొక్క చివరి అక్షరము మిక్కిలి ప్రధానమైనది. అక్కడికి వచ్చేటపుటికి లేఖరియొక్క కలము ఒక విసురు మీదికి వెళ్లింది రా అంటే అతనుత్సాహపూర్ణుడుగా వున్నట్లు, ఆ అక్షరము ఈదురోమన్నట్లు క్రిందికి వ్రేలాడుతూ వుంటే అతను మనస్సులో నేదో దిగులు, చింత, లేక దుఃఖముతో బాధపడుతున్నట్లు గ్రహిచవలెను. మీదికి వెళ్లక క్రిందికీ రాక ప్రక్కచాచుకొని పడుక్కున్నట్లుంటే అతను మిక్కిలి అలసిపోయి విశ్రామమును వాంఛించే అవస్థలో వున్నాడని గ్రహించవలెను. దస్తూరీ అంతా ఏకరీతిగా ఉండకపోవడము, పేజీనిండా తుడుపులూ హంసపాదులూ వుండడము, సిరా ముద్ద ముద్దలు పడడము మొదలగు వానివలన అతనియొక్క వివిధ ఆంతరంగిక విషమావస్థలను మనము గ్రహించవలెను. అనవసరముగా గుత్తి గుత్తులుగా చుక్కలు, హాశ్చర్యార్థక గుర్తులు, ఇతరవిధములైన గీతలు గీసినయెడలను, అక్షరముల తలకాయల దగ్గర పట్టివ్రాసిన యెడలను అతనికి కొంచెము పైత్యభ్రమ యున్నదని మన మెఱుగవలెను. దస్తూరీలనుపట్టి రోగములను పోల్చుకొనుట కూడా ఒక విధానమైన 'నిదానముగను శాస్త్రముగను పాశ్చాత్యవైద్యులు నిశ్చయించి, ఇందును గూర్చి పాఠ్యగ్రంథములువ్రాసి వైద్యశాస్త్ర విద్యార్థులందరిచేతను అభ్యసింప జేయుటకు ఆలోచించుచున్నారు.

స్త్రీపురుషుల సమానత్వం

హిందూదేశంలో యేనాటికైనా స్త్రీపురుష సమానత్వంవస్తుందా, ఆ తరువాత యేనాటికైనా యీ దేశానికి స్వరాజ్యం వస్తుందా అని తెల్లవాళ్లందరూ ఊరికే బెంగపెట్టేసుకుంటున్నారు. కాని వారి కటువంటి ఆశ యేమీ కలగకుండావుంది. పేపర్లలో వూరికే మేలిముసుగులు తీసేయాలి, స్త్రీ పురుషులు కలిసి అరమర అభ్యంతరాలు లేకుండా తిరగవాలి, అని వ్యాసాలు వ్రాసేవారు, వేదికలమీద లెక్చెర్లిచ్చేవారే కాని వ్యవహారంలో అటువంటి మహత్తేమీ కనిపించకుండా వుండడంచూస్తే తెల్లజాతి స్త్రీలకు మఱీ నిరాశ యెక్కువవుతున్నది. భారతస్త్రీ లెంతవరకు అభివృద్ధిపొందేరో, తమలాగ యెంతవరకుమారేరో చూద్దామని

స్త్రీమరు కేవులు కట్టుకొని ఒక ఇంగ్లీషు వనితామణి ఇండియాకువచ్చి నేరుగా కరాచీ మహిళా సభకే వెళ్లింది. తీరా చూడనా! కొంతమందికి ఇంకా పరదా వుండనేవుంది. పురుషులన్న వారు లేనేలేరు. అనేకమంది ఆడవాళ్లు సిగ్గుసిగ్గులుపడుతూ, వెనక వెనక వుంటూ, ముక్తసరిగా సభలలో కూర్చుని ఉపన్యాసాలు విని వచ్చేశారేకాని, చరచరా బరబరా ఒకరిమీద ఒకరు పడి రాసుకుంటూ నవ్వుకుంటూ సల్లాపా లాడుకోవడం అసలే లేదు.

పోనీలే, వీరియిళ్లూ వాకిళ్లు అక్కడి జీవనం యేలాగుంటాయో చూదామనే కొంతమంది గృహములను పావనంచేయడముకోసమీమె వెళ్లింది. ఆ యిళ్లకు పయి మగవాళ్లెవరైనా వచ్చిరా, ఇంటి యజమానులున్నారో లేరో వాకట్లోంచి అడగడమే కాని ఇంట్లోకి త్రోసుకొనిపోయి ఆడవాళ్ల నడగడంలేదు. పయి మగవాడు వచ్చాడురా అంటే ఆడవాళ్లేదో ఒకమాట చెప్పేసి పంపించడమే కాని బాతాఖానీ కొట్టడములు లేదు. ఒకవేళ ఇంట్లో మొగవాళ్లున్నా మగవాళ్లు మగవాళ్లను మర్యాదాచేయడం, ఆడవాళ్లాడవాళ్లను మర్యాదా చేయడం మాట్లాడడమేతప్ప, ఇంటికివచ్చినవారిమీద ఆడవాళ్లూ మగవాళ్లూ పడిపోవడం లేదు. స్త్రీపురుషులకరచాలనములు, కౌగిలింతలు, సల్లాపములు అసలేలేవు. ఇంట్లోకి పై మగవాళ్లెవరైనావస్తూవుంటే ఆడవాళ్లు మగవాళ్ళనీ మగవాళ్ళనీ మాట్లాడుకోవడానికి వదిలేసి యేప్రక్కగదిలోకోపోయి వేరేపని చేసుకుంటారు. పోనీ మగవాళ్ళకైనా యింతకంటె యెక్కువ సాహసంచొరవవున్నాయేమో అంటే, వాళ్ళతల్లులకే అక్కచెల్లెళ్ళకే లేనిచొరవ వారికిమాత్ర మెక్కడిది? వారు ఆడవాళ్ళనీ ఆడవాళ్ళనీ ఒక దగ్గర వదిలేసి తమపని తాము చూచుకుంటారు!

ఆడవాళ్ళకీ మగవాళ్ళకీ ఒకరిదగ్గర ఒకరికి ఇంత చొఱవతక్కువైన పాడుదేశంలో స్త్రీపురుష సమానత్వం ఒక్కనాటికి సిద్ధించదని ఆమె నిశ్చయం. స్త్రీపురుషులకీ విధమైన సమానత్వంలేకపోతే స్వరాజ్యమేమిటి అని ఆమె కాశ్చర్యంగావుంది. మూడువారాలామె యీదేశంలోవుంది, మూప్ఫైయేళ్ళలో సంపాదించవలసినంత జ్ఞానం సంపాదించిందట. ఎంతటి బుద్ధిమంతులైనా వుంటారు! అయితే ఆమెఒక ఆప్తవాక్యంతో యీదేశమునువిడచి పెట్టింది-స్త్రీవోటర్లసంఖ్య హెచ్చించడంలో తెల్లకాగితం చాలా తెలివైనపని చేసింది—వచ్చేలిష్టులో ఇంకా హెచ్చించితే స్వరాజ్యం ఇంకా వేగంవస్తుంది. ఆంగ్లేయులు ఆమె సిపార్సు నంగీకరించవలెననియే మన అందరి కోరిక. కాని ఆమె చెప్పేమోస్తరు పాశ్చాత్య సమానత్వం మన స్త్రీపురుషులకు కలుగుట కెన్నియుగాలు పట్టునో, యెంత యింగ్లీషు నేర్చుకోవాలో, ఎన్ని ఆస్తులు పాడుకావాలో, ఎన్ని సినీమాఫిల్ములు తయారు చేయించి చూపవాలో చెప్పుటకు సాధ్యంకాదు.

సంపాదకీయములు

శారదానికేతన వర్ధంతి:—

శారదానికేతన వార్షికోత్సవములు జనవరి నెల మొదటివారములో మహిళావిద్యా సంస్థ కుచితమగు నిరాడంబర దీక్షావిభవములతో గుంటూరిలో జరిగినవి. కార్యదర్శిగారి నివేదిక, శ్రీయుతమంత్రిప్రగడసాంబశివరావు శ్రీమతి తుర్లపాటి రాజేశ్వరమ్మగార్ల ఉపన్యాసములు క్లుప్తములై, సంస్థయొక్క యితోధికవృద్ధి కనువగు సూచనలతో కూడినవై యున్నవి. స్త్రీలకు ప్రత్యేక విద్య ప్రత్యేక విద్యాసంస్థలు అవసరమని కార్వే గారి పూనా విశ్వవిద్యాలయముతో బాటు శారదానికేతనమును ధృవపరచుచున్నదను సాంబశివరావుగారి అభిప్రాయముతో అనేకు లేకగ్రీవముగ నొప్పుకొందురని తలచుచున్నాము. ప్రస్తుత విద్యావిధానమునందలి మఱియొకలోపమును దానికివిఱుగుడును గూడ సాంబశివరావుగారు వివరించి అభినందనీయులగుచున్నారు. ప్రస్తుత పాశ్చాత్య ప్రాచీ విద్యాసంస్థలు శ్రీమంతులు మాత్రము బోలెడు డబ్బు పోసుకొనగలిగి, బుద్ధిమంతులు మాత్రము నెగ్గగలిగి, గడుసువారు మాత్రముద్యోగస్థులై బలవంతులు బలహీనుల నణచిపెట్టియుంచుటకు సర్వానుకూలముల నొసంగుచున్నవని శలవిచ్చినారు. ఇందుకుచికిత్స ప్రస్తుతపుబడులు—పూర్వపు పల్లెటూరిబడులు, నేటి శాంతినికేతనము శారదానికేతనము మొదలగు గురుకులముల వలె—సర్వజనప్రవేశసులభములై, సంస్థాపకులు లేక గురువుల యిష్టప్రకారము జరుగుచు వారి యాశయములు ప్రతివిద్యార్థియందును ప్రతితరగతియందును ప్రతిబింబించునవై యుండవలెను. సమస్త పరిశ్రమలవలె విద్యకూడ ఒకపరిశ్రమయై, ద్రవ్యోపార్జనామార్గమై, తరగతులు డిగ్రీలు సెలబసులు, విధానములు పరీక్షలు అను యంత్రములద్వారా సాగదీయబడి విద్యార్థులు విద్యార్థినులు—బస్తాలలో కుక్కబడి కాటాలలో తూచఁబడి వర్తకమున కెగుమతి చేయఁబడుచుండుసరుకువలె—చూడబడుచున్న పారిశ్రామిక విప్లవయుగములో నిది యెంతవరకుసాధ్యమో సంశయాస్పదమైనను, ఆశయప్రాశస్త్యమునుగూర్చిగాని, దాని నుద్ధరించుచు మార్గదర్శకములైయున్నపై సంస్థల

ప్రశస్తినిగూర్చిగాని యెవ్వరును అనుమానింపరు. వ్యాయామక్రీడలకు బహుమానములనొసగుచు రాజేశ్వరమ్మగారు స్త్రీపురుషులు సమానబలవంతులగుటకు స్త్రీలు వ్యాయామము చేయవలెననియు, వారసత్వపు హక్కులు, రాజకీయవిజృంభణములు, విడాకులు మొదలగునవి యితరవిధములైన సమానత్వములకు మార్గములు కాగలవనియు తమసహజగంభీరధోరణిలో నుపన్యసించిరి. వితంతువులకు, బాలికలకు యువతులకు, అవర్ణులకు సవర్ణులకు అనేకుల కాశ్రయమై, కుట్టుపని సంగీతము మొదలు హిందీ సంస్కృతోత్తమవిద్యలవరకు ఎవరికెట్టి కళలయందభిరుచి గలిగిన వారికి వానిని గరపుచు, ఆంధ్రదేశమునన్నెల్ల పదిపన్నెండుసంవత్సరములనుండి తనయశశ్చంద్రికల వెదజల్లుచున్న యీసంస్థ ఆంధ్రజనుల ఆదరణముకలిమిని చాలకాలము వర్ధిల్లునుగాక!

క్షామసీమ:—

రాయలసీమ తప్పితే కఱవులకు కాటకములకు అగ్గమగుచున్నది. ప్రజలష్టకష్టములుపడి అన్నమునకునీటికివాచి మృత్యుముఖమున బడనున్నప్పుడు, ప్రభుత్వమువారు దేశభక్తులు దేశసేవకులు గడబిడలుపడి విరాళము లిచ్చియు, చందాల నిచ్చియు, కాటకపుపనులు నెలకొల్పియు కొన్ని తాత్కాలిక నివారణోపాయములు కల్పించి కీర్తిమంతులై విరమించుచున్నారే కాని, శాశ్వత చికిత్సచేయుట కెవ్వరును గమకింపకున్నారు. ఎట్టకేల కొకసారివచ్చు కఱవులకైనచో విరాళములు, శిస్తు తగ్గింపులు, కాటకపుపనులు మొదలగు ఉపశాంతులు కాని,తఱచుగాకలుగు కాటకముల తరించుట కిట్టివి ఉపాయములు కానేరవు. ప్రస్తుతము పీడించుచున్న కాటకమునుండి ప్రజలను తప్పించుటకు శిస్తులను నూటికి 50 వంతున తగ్గించవలెననియు, కఱవుపెట్టువర్కులు రిలీఫువర్కులుగా మార్చవలెననియు, ఆంధ్రదేశస్థులెల్లరు నిధులు వసూలుచేసుకొని పంపించవలెననియు జనవరి 6 వ తేదిని జరిగిన రాయలసీమ రాజకీయసభలో జరిగిన తీర్మానముల నెల్లను అమలుపరపించ గోరుచున్నాము. ఇది తాత్కాలికోపశాంతి నిచ్చినను తుంగభద్రాప్రాజెక్టు నిర్మాణముతప్ప క్షామనివృత్తికి శాశ్వతమగు ఉపాయము వేఱొండులేదు.

ఈప్రాజెక్టు 50 సంవత్సరములాయను వెనుకకు నెట్టబడుచున్నది. దీనికి తరువాత తలపెట్టబడిన ప్రాజెక్టులెన్నియో నెగ్గుచున్నవి కాని దీనినిగూర్చి ప్రభుత్వమువారు గాని శాసనసభ్యులు కాని తగిన దీక్షాశ్రద్ధ లవలంబించుటలేదు. వార్తకవి రామచంద్రరావుగారు చెప్పినట్లు ఇట్టి విషయములలో పెట్టుబడిమీఁదవడ్డీ కిట్టునాకట్టదా, లాభములు

వచ్చునా రావా అని ప్రభుత్వమువారును శాసనసభ్యులును అంచనాలు వేయరాదు. అసంఖ్యాకులగు అయిదు జిల్లాల ప్రజల ఆయుర్భాగ్యములు అనేకకోట్లవడ్డి లాభముల కంటె నెంతయు ప్రాముఖ్యమైనవి. లోయరు భవానీప్రాజెక్టు ఇప్పుడు తీసుకొనబడుచో చాలాకాలమువరకు తుంగభద్రాప్రాజెక్టు ప్రారంభించుటకు వీలుండదు. కనుక శాసన సభ్యులు వెంటనేదీనికొరకు రాష్ట్రీయసభలో ఆందోళనముచేసి పని ప్రారంభమగునట్లు చూడవలెను.

ఎన్ని ప్రాజెక్టులు కాలువలు త్రవ్వించినను ఒక్క వ్యవసాయమువలన దేశములో సుభిక్ష మేర్పడ నేరదు. దేశీయులు తమకుకావలసిన సరకులను తాము తయారుచేసుకొనక విదేశ ములనుండి దిగుమతిచేసుకొనుచున్నన్నాళ్లు తాము పండించుకొన్న పంట యెల్లయు విదే శీయులకు ఖరీదుక్రింద ముడుపు చెల్లించ బడి కాటక మెప్పటి యట్లు పీటపెట్టుకొని కూర్చొనవలసినదే. పంటలుపోతే కాటక మెప్పుడో ఒకసారి వచ్చునుకాని, గ్రామపరి శ్రమలు ప్రారంభింపకున్నచో ఎన్నిపంటలు పండుచున్నను నిత్యమును ప్రజలు దారిద్ర్య పీడితులై మగ్గవలసినదే. వెంటనే దత్తమం డల నాయకులు ఒకకమిటీ నేర్పరచి రాయల సీమ యంతట విచారణ చేయించి యేయే ప్రాంతముల నేయే జాతులవా రేయే పరి శ్రమలలో నిపుణులో వానికి ప్రోత్సాహ మిచ్చి, ఆ సరకులు చెల్లుబడియయ్యెడి మార్గ ములను గూడ నన్వేషింతురుగాక! ఉత్తర సర్కారుఆంధ్రజిల్లాలనాయకులు ఈసమయ మున రాయలసీమకాటకనివారణమునకు తమకు సాధ్యమగు సహాయము నొనరింతురు గాక!

కీ॥ శే॥ మానాప్రగడ రామసుందరమ్మగారు:

శ్రీమతి మానాప్రగడ రామసుందరమ్మ గారి అకాలమరణమువలన కాంగ్రెసు ఒక స్వచ్ఛందసేవికను, ఆంధ్రదేశ మొకఅమూల్య యువతీ రత్నమును, శ్రీయుత కృష్ణా రావుగారు లోకనిరుపమానసహధర్మచారిణిని గోల్పోయి చింతాక్రాంత చిత్తులగు చున్నారు. ఆమెనుగూర్చి శ్రీమతి ఆర్. రామాబాయమ్మగారు వ్రాసిన యీ దిగువ అమూల్యవ్యాసమునందేమాత్రము అతిశ యోక్తియు లేదు.

"శ్రీమతి రామసుందరమ్మగారు తూర్పు గోదావరిజిల్లాకును గౌతమీ సత్యాగ్రహా శ్రమమునకును వన్నె దెచ్చిన యువతీ రత్నము. వయస్సు సుమారు 19 సంవత్సర ములు. ఈమె జన్మస్థలము పశ్చిమ గోదావరి జిల్లా, తణుకు తాలూకా ఖండవల్లిగ్రామము. ఈమె తలిదండ్రుల కేకైకపుత్రిక (ఇంకను పిల్లలెవ్వరునులేరు). నిరాడంబరయువతు రాలు. వీరి జన్మస్థలమగు ఖండవల్లిగ్రామము

నందు ప్రాథమికపాఠశాలలో ప్రైమరీ వరకు విద్యనభ్యసించి ఇటీవల హిందీ నభ్యసించిరి.

శ్రీయుత కృష్ణారావుగారికిని ఇతర బంధు వర్గమునకును మా సంపూర్ణ సానుభూతిని తెలుపుచు ఆమె యాత్మకు శ్రీకృష్ణభగవానుని సన్నిధిని శాశ్వతానంద మొనగూడుగాక యని భక్తిపూర్వకముగ ప్రార్థించుచున్నాము.

"1926-వ సం॥ ఫిబ్రవరి 17-వ తారీఖున సుప్రసిద్ధ దేశభక్తులును, గౌతమీ సత్యాగ్రహాశ్రమ వాసులును అగు శ్రీయుతులు మానాప్రగడ కృష్ణారావుగారిని వివాహమాడిరి. వివాహమాడిన దాది దేశసేవయందుత్సాహముజనించి ఖద్దరుధారిణియై, రాట్నపరిశ్రమచేయుచు తన స్వగ్రామము లోని స్త్రీల కుద్బోధనచేయుచు 1930-వ సం॥ మున గౌతమీ సత్యాగ్రహాశ్రమమునకు వచ్చిరి.

"భర్తతోపాటు దేశసేవచేయవద్దని తలిదండ్రు లెంత నిర్బంధించినప్పటికిని తలిదండ్రులనుతిరస్కరించి భర్తకు బాసటయై దేశసేవచేసిన పతివ్రతాశిరోమణి. 1933-వ సం॥ మున జనవరి 15-వ తారీఖున గుంటూరులో జరిగిన ఆంధ్రరాష్ట్రీయనియంతల మహాసభకు, నైజామ్‌జిల్లాడిక్టేటరుగా యెన్నుకొనబడి యే తత్సభలో పాల్గొని గుంటూరుజిల్లా సబ్ కలెక్టర్ హుమయూన్ గారిచే 15 మాసములు విడికైదు, 2000 రూపాయిలు జుర్మానా విధింపబడి, రాయవేలూరు, కన్ననూరు స్త్రీలచెరసాలలో శిక్షననుభవించిరి. విడుదలపొందిన 15 మాసములనుండి దారుణరోగ పీడితయై సుప్రసిద్ధవైద్యులగు, డాక్టరు సుబ్రహ్మణ్యం, వంగవేటి దీక్షితులు, ఉపాధ్యాయుల నరసింహం, వేడంగి వెంకట్రావు, భారతం సూర్యనారాయణగార్లవల్ల వైద్య సేవను పొందినప్పటికిని ఆరోగ్యము చేకూరక 50 పౌనులు బరువు తగ్గి రక్తవిహీనయై క్షయవ్యాధి సంభవించి 1934-వ సం॥ డిశంబరు 19-వ తారీఖు రాత్రి 7 గంటలకు దేశసేవకై ప్రాణమర్పించి మాతృపాదారవిందములకు జేరిరి. 20-వ తారీఖు ప్రొద్దట 8½ గంటలకు పసుపు, కుంకుమతో పూజింపబడెను. వశిష్ట గోదావరి తీరమున శ్మశానవాటికయందు దహనక్రియలు గావింపబడెను. తూర్పు గోదావరిజిల్లాలో దేశసేవకై తమ ప్రాణ మర్పించిన యువకురాలీమెయే?

దక్షిణాంధ్రులు:—

ఒకప్పు డాంధ్రసామ్రాజ్యము మదరాసు రాజధానియం దెల్లను, నైజాము రాష్ట్రములో చాలా మేరను వ్యాపించి యుండెను. అక్కడ ఆ యా సమయములయందు ఆంధ్ర రాజుల పరిపాలనము సాగుచు ఆంధ్రుల

జండా యెగురుచుండుట యొక్కటియేకాదు; ఆంధ్రులు వేఁవేలు జీవించుచు తమ భాషను, సాహిత్యమును, సంగీతమును, శిల్పమును, నాట్యకళను మొదలగు వానిని వ్యాపింపఁ జేయుచుండిరి. నేటికిని ఆంధ్రులచేత కట్టఁబడిన పెక్కుమందిరములు, వ్రాయఁబడిన పెక్కు గ్రంథములు, రచింపఁబడిన పెక్కు గీతములు ఆ యా ప్రాంతములవారి ఆంధ్రకళల యభివృద్ధికిగా రచింపఁబడినవేయై యున్నవి. ఆంధ్ర నాగరకత అత్యుచ్చదశయందున్న ఆకాలములలో అక్కడి ఆంధ్రులు తమ సంప్రదాయములను తాము సంరక్షించుకొనుచుండుటయే గాక అచ్చట నివసించెడి యితర జాతులవారిని గూడ వానియెడ ముగ్ధుల నొనర్చి వారిలోఁగూడ తమ సంప్రదాయములను వ్యాపింపఁ జేయుచుండెడివారు. గత ముప్పది సంవత్సరముల క్రిందటివరకు స్థితిగతులించుమించుగా నిట్లే యుండెను.

కాని అప్పటినుంచి స్థితిగతులు మాఱినవి. ఆ యా ప్రాంతముల నివసించు ఆంధ్రులు తమ మాతృభాషను మఱచిపోయి యితర భాషలను నేర్చుకొనవలసి వచ్చుచున్నది. తమ సాహిత్యములు సంప్రదాయములు ఇతర సాహిత్య సంప్రదాయముల విజృంభణములలో మఱుగయి మాయమగుచున్నవి. క్రమముగా వారి ఆంధ్రత్వమే విస్మృతమగుచున్నది. కాని వారిజాతీయతకాని జాతీయతాభిమానము కాని యింకను నశింపక జీవించుచుండుట ప్రశంసింపఁ దగియున్నది. ఒకప్పుడు వారు ఆయాప్రాంతములనుండియే తమ మాతృదేశమునకు భాషకు కీర్తివంతములైన సంగీతసాహిత్య గ్రంథములను రచించి పన్నెఁగూర్చి యుండిరి. ఇప్పటికిని మనపండితులు తంజావూరునందలి వ్రాతప్రతుల గ్రంథాలయమునకు వెళ్లి ఆ యా కాలములందు రచింపఁబడిన గ్రంథములను పరిశీలించి ముద్రింపించి మన మాతృభాషకు వారు చేసిన అమూల్యమైన సేవను ప్రకటించుచున్నారు. అట్టివారి ప్రాంతములలో నేడు 36 లక్ష లాంధ్రులున్నను, తెలుగు బడులు లేవు, తెలుగు పుస్తకములను చదువలేరు. లక్షలకొలది జనులు తెలుగుభాషను మఱచి అరవభాషను నేర్చుకొని తమ ఆంధ్రత్వమునే మఱచిపోగల స్థితికి వచ్చుచున్నారు.

ఈ ఉపద్రవము నఱిగట్టి ఆ ప్రాంతములలో ఆంధ్రభాషను పునరుద్ధరించు ప్రయత్నములు 1924వ సంవత్సరమునుండియు ప్రారంభమగుట శుభసూచకము. సాధువరదరాజం పంతులుగారి నిరంతరదీక్షవలన దక్షిణాంధ్ర భాషాభివర్ధనీసభ ఆసంవత్సరము నెలకొల్పఁబడినది. రాజుపాళెం, ఒట్టాపిడారం, తిరుచనాపల్లి, తిరునెల్వేలి, కంచి, పిడారిపట్టు మొదలగు తావులలో ఆంధ్రపాఠశాలలు, గ్రంథాలయములు, సభలు మొదలగునవి

నెలకొల్పఁబడినవి. ఉత్తరదేశములనుండి ఆంధ్ర ప్రముఖులు వెళ్లి వారికి చేయూత నీయఁదొడగిరి. ఇదివరకున్న పాఠశాలలలో ఆంధ్ర భాష ప్రవేశపెట్టుటకు ప్రయత్నములు చేయఁబడినవి. 1926 లో ఈయుద్యమము మన్నిరపాలెం, చోళవందాను మొదలగు మధుర ప్రాంతములలోనికి కూడ ప్రాకినది. వరదరాజం పంతులుగారి సంపాదకత్వమున 'దక్షిణాంధ్ర'యను ఆంధ్రపత్రిక ప్రారంభింపఁబడినది. అందు దక్షిణాంధ్రచరిత్ర, సాహిత్యము మొదలగు విషయము లెన్నియో చర్చించబడుచుండెను.

1930 నుంచి దేశమెల్లయు రాజకీయ కల్లోలములో కొట్టుకొనుచుండుటచేత నాయకులకు ప్రజలకు ఈ యుద్యమమునందు శ్రద్ధ తగ్గినది. ద్రవ్యము కొఱవడినది, సేవకులు తగ్గిరి, పత్రిక నిలచిపోయినది. నేటి వరకు దానినిగూర్చి శ్రద్ధ తీసుకొనువారు లేరైరి. తిరిగీ శ్రీయుతులు వరదరాజం పంతులు, శంకరం పంతులు, సర్. కె.వి. రెడ్డి నాయుడు, వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రులు గార్లు మొదలగువారల నాయకత్వముక్రింద ఇది ప్రారంభింపఁబడినది. దక్షిణాంధ్రపత్రిక తిరిగీ ప్రారంభమగును. ఉత్తరపశ్చిమాంధ్రులు గూడ పెక్కురీ సభయందు సభ్యులుగను పోషకులుగను జేరి సభయొక్క కార్యక్రమమును జయప్రదముగ నెరవేర్చి, దక్షిణాంధ్రదేశమున తెలుగుభాషయు తెలుగు జాతియు మున్నాక్రమించియుండిన గౌరవమును పునః ప్రతిష్ఠింతురుగాక !

EDITED, PRINTED AND PUBLISHED BY
DR. K. N. KESARI AT THE LODHRA PRESS, EGMORE, MADRAS.

అనుకరణములను చూచి మోసపోకుడు

అమృతాంజనము

అన్ని నొప్పులకు సిద్ధామృతము

అమృతాంజనండిపో

బొంబాయి, మదరాసు, కలకత్తా.

డోంగ్రే గారి బాలామృతము

బలహీనమైన బిడ్డలకు వృద్ధియును, బలమును, ఆరోగ్యము, నిచ్చును. అన్నిస్థలములందు దొరకును.

అన్ని చోట్ల అమ్మబడును

ప్రొప్రయిటర్లు:—కె. టి. డోంగ్రే అండు కో, గిర్గాన్, బొంబాయి

మద్రాసు స్టాకిస్టులు, దామోదరుకంపెని,

78, చైనాబజారురోడ్డు, జి. టి. మద్రాసు.

సయింటిఫిక్
బంగారు ఆభరణములు

హైకోర్టుజడ్జీలు, ప్రభుత్వమంత్రులు, కాంగ్రెసు ప్రెసిడెంట్లు, శాసనసభ్యులు మొదలగు గొప్పవారిచే ప్రశంసింపబడి, ఈ కంపెనీ గవర్నమెంటులో రిజిస్టరు చేయబడినది.

పూర్తి కేటలాగు ఉచితము



ది సైంటిఫిక్
గోల్డుబాంగిల్సు కంపెనీ లిమిటెడ్
బ్రాంచి:—104, చైనాబజారు రోడ్డు,
హెడ్డాఫీసు:—43, బైరాగిమఠం వీధి,
మద్రాసు.

ఒడలు నిగనిగ లాడుటకు
సుప్రసిద్ధమైన

కేరళ సబ్బులు

ఉపయోగింపుడు.

పిల్లింగ్టన్, చందన, వేప, మల్లె
మొదలైనవి.

కేరళ సోప్ ఇన్స్టిట్యూట్

కలికట్.

పి. కోదండరాం పిళ్లే
(లేటు పి. యస్. పొన్నుస్వామిపిళ్లేవారి కుమారులు)
1854-వ సంవత్సరమున స్థాపితము.
ఉత్తమతరగతి కర్రసామగ్రుల నిర్మాతలు
(పి. యస్. పొన్నుస్వామిపిళ్లే భవనములు)
మీ భవనమును అలంకరించుటకును దానిని ఆకర్షణీయముగ చేయుటకును మీకు కర్రసామగ్రులు కావలయును.
త్వరగా చేసియిత్తుము. నమ్మకమైన పనితనము.
కర్రసామగ్రులను కొనుటకుపూర్వము మాతో సంప్రదింపుడు.
పురాతనమైన, ప్రఖ్యాతిగల కంపెనీ.
39 & 44, ఎస్ప్లనేడ్ వెస్టు; మదరాసు.

శ్రీమత్కన్యకావిజయము
ఉత్తమ యక్షగాన ప్రబంధము. పనుమర్తి కృష్ణమూర్తిగారు రచించినది.
వలయువారు నాలుగణాల బిళ్లలు
"గృహలక్ష్మి కార్యాలయం, ఎగ్మూరు, మద్రాసు"కు పంపునది.

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారిచే రచియింపబడిన పుస్తకములు

———:O:———

1. వసుమతి:—సాంఘికసాంసారికానర్థములను వివరించు నీతిబోధకమగు చక్కని సాంఘిక నవల. పాఠశాల పఠనీయగ్రంథముగా అప్రూవు చేయబడినది. ... వెల 0 12 0

2. బాలనీతి కథావళి:—నీతిబోధకములగు ఇరువది కథల సంపుటి. దొరతనమువారిచే పఠనీయ గ్రంథముగా అప్రూవ్ చేయబడినది. ... ... వెల 0 10 0

3. విశ్వామిత్ర మహర్షి:—ఈ మహర్షియొక్క అద్భుతచరిత్ర మిందు ప్రౌఢభాషలో వర్ణింపబడినది. ... ... వెల 0 8 0

4. ద్రౌపదీవస్త్రసంరక్షణము:—(ద్విపద) పాటవలె పాడనగును. వెల 0 2 0

5. సత్యాద్రౌపదీ సంవాదము:—(ద్విపద) పాటవలె పాడనగును. వెల 0 2 0

6. జ్యోతి:—ఆరోగ్యనాటకము. హెల్తు డిపార్టుమెంటువారిచే ఆమోదింపబడినది. వెల 0 4 0

7. పెన్నను పుచ్చుకున్ననాటి రాత్రి:—అనేకమంది విద్యాధికులచే ప్రశంసింపబడిన చక్కని కథ. గృహలక్ష్మినుండి పునర్ముద్రింపబడినది. ... ... వెల 0 1 0

8. శారదలేఖలు:— ... ... వెల 1 0 0

ఈ పుస్తకములన్నియు నొకేమారు తెప్పించుకొనువారికి 3 రూపాయలకే యివ్వబడును. పోస్టు కర్చులు ప్రత్యేకము.

ఈ గ్రంథములు వలయువారు :

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు,

బాపట్ల, గుంటూరు జిల్లా. అని వ్రాయవలయును.

పనితనముగల వెండిసామగ్రుల నిలయము





ఉమ్మిడి రామయ్యశెట్టి గురుస్వామిశెట్టి & కంపెని,

నగలవ్యాపారులు

25. చైనాబజారురోడ్డు, మదరాసు. **62.** గోవిందప్పనాయక్ వీధి

జండూగారి అశోకారిష్టము



(భైషజ్యరత్నావళి)

స్త్రీలకుకలిగే అన్నివిధ దుర్బలములకు నుపయోగించు గొప్ప టానిక్కువంటి దివ్యౌషధము.

స్త్రీలకుకలిగే బహిష్టుదోషము లన్నిటిని నివారణచేయును. అనగా కడుపునొప్పి, ఋతుస్రావము, రక్తస్రావము, సోమరోగములు సహా నివర్తింమును.

దీని నుపయోగించుటచేత గర్భహీనతనుపోగొట్టి, గర్భముధరించ గలరు. కాన శిశువులు పుష్టిగలవారై వ్యాధులనుండి నిర్ముక్తులగుదురు.

స్త్రీలకు ప్రసవమునకువెనుక అద్భుతమైనబలము కలుగజేయును.

ధర 1 పౌను రు. 1 9 0 ½ పౌను రు. 0 14 0

Manufactured by

The Zandu Pharmaceutical Works Ltd.
Bombay 14.

SOLD EVERYWHERE:

Sole Agents for Madras Presidency:

దామోదర అండు కంపెని
78. చైనాబజారు రోడ్డు, జి. టి. మద్రాసు.

వైద్యరత్నపండిత డి. గోపాలాచార్యులవారి,

జీవామృతము

కండపుష్టికి, వీర్యవృద్ధికి,
— జవసత్వములకు. —

అన్నిచోట్లను దొరుకును

ఆయుర్వేదాశ్రమము మదరాసు.

డిస్ట్రిబ్యూటర్లు: రూపాకుల అండుకో, బెజవాడ.

మహాసూతికాభరణము.

(బాలింతలకు పరమౌషధము)

ఈ ఔషధము స్త్రీలు ప్రసవించినప్పుడు కలిగే అనేకవిధములగు సూతికావ్యాధులకు అమోఘముగా పనిచేయును. సూతికాజ్వరము, ఒళ్లునొప్పులు, తలనొప్పి, నిద్రలేమి, దప్పిక, తాపము, మొదలగు లక్షణములు కలిగినప్పుడు, సన్నిపాతముబట్టి ప్రలాపము గలిగినప్పుడు ఉపయోగించి తప్పక పనిచేయును. గర్భాశయమునుండి మైల సరిగా ప్రవహింపక కడుపునొప్పిగలిగి బాధపడునప్పుడు ప్రయోగించినయెడల, మైల వెడలగ్రక్కించి, గర్భాశయమును శుభ్రపరుచును. వాతమును పోగొట్టును. పిచికారి **(Douche)** మొదలైనవి అవసరములేకుండా ఆర్తవమును ప్రవర్తింపజేయు మందు యిది ఒక్కటే; ఇది బాలింతల పాలిటి పరమౌషధము.

వెల తు. 1—కి రు. 30.

పుడుడు వారమురోజులకు మందు రు.5.

రజోదర్శిని

స్త్రీలకు గలుగు రజస్సంబంధమైన వ్యాధులకు మంచి మందు. ముట్టునొప్పి, మైల సరిగా కాకపోవడం, బొత్తుగానే బహిష్టు కాకపోవడం, మొదలైన బాధలను నివారించును. రజస్వల కాని వారలుకూడ సేవించిన పిదప రజోదర్శనమైనట్లు ప్రశంసలు గలవు. [illegible] కోరిన పంపబడును.

50 మాత్రలు రు. 2.

పై రెండు ఔషధములనుగూర్చిన [illegible] కోరినవారికి ఉచితముగా పంపబడును. 160 పేజీలుగల 'ఆయుర్వేద చికిత్సాదర్పణము' అను గ్రంథము 0-2-0 లకు పోస్టేజీబిళ్లలు పంపినవారికి ఉచితముగా పంపెదము.

Consulting Physician :—

ఆయుర్వేదభూషణ

వేటూరి శంకర శాస్త్రి,

ఎ. ఎం. ఎ. సి.

జమ్మి వెంకటరమణయ్యాగారి

యకృత్ ప్లీహవ్యాధులకు (Liver and Spleen complaints) దివ్యౌషధములు.

ఈ ఔషధము వైరోగములను కుదుర్చుటయేకాక, రాకుండ కూడా చేయును. వైద్యశిఖామణులెల్లరును మిగుల పొగడుచున్నారు. ఇతరమందులన్నియు వేసివేసి నిరాశచేసుకొన్న సందర్భములలోకూడా ఇది పనిచేసి విజయమును బడసినది.

అనేక ప్రదర్శనములలో బహుమానమును బడసినది. తెణుకులో జరిగిన ఆంధ్ర ఆయుర్వేద మహాసభలో ఇది ప్రథమతరగతి యోగ్యతాపత్రమును పతకమును బడసినది.

జమ్మి వెంకటరమణయ్యాగారి ఫోటోగ్రాఫు, దీనికి ట్రేడు మార్కుగా రిజష్టరు అయినది కనుక ఆ ఫోటోనుచూచి మందు కొనుక్కొన్నచో మోసపోరు. 5 రూపాయీలకు 10 రూపాయీలకు రెండు రకము లమ్మబడును. జబ్బు లేతగానున్నప్పుడు మొదటిది, ముదిరినప్పుడు రెండవది ఉపయోగించవలెను.

లభించు ప్రధానస్థానములు:

మదరాసు, 8, సాలై వీధి, మైలాపూరు. కలకత్తా, 125, హారిజనురోడ్డు.

జామా తైలము

ఏజంట్లు కావలెను.



తలనొప్పి, యిన్ఫ్లుయంజా, చేయి కాలు పట్టుకొనుట, పంటినొప్పి మొదలగువ్యాధులను ఒక క్షణములో పోగొట్టగల ఖ్యాతిచెందిన "జామాతైలము"నకు సమమగు మందు వేరేదియు లేదు. చాలా యోగ్యతాపత్రములను పొందియున్నది.

బుడ్డి 1-కి అణాలు 6 ఇచ్చి ఉపయోగించి చూడుడు.

అమర్ చెందు, శోభాచెందు,

ఇంగ్లీషుమందులు, పలుసరకులు, సల్ఫ్యూరిక్, నైట్రిక్, మొరాటిక్ ఆసిడ్ల వ్యాపారస్థులు.

నెం. 63, నైనప్పనాయని వీధి, మద్రాసు.

అనుకరణమే ప్రత్యేక ప్రశంసకు తగుకారణము

అనుకరణములను జూచి మోసపోకుడు.

మైసూరు చందనసబ్బును అనుకరింపుచు

ఆమాదిరి సబ్బులను అనేకులు ఏల తయారుచేయుచున్నారో

మీకు తెలియునా?

అంగళ్లలో దొరుకు సబ్బులన్నిటిలో అదియే

అత్యుత్తమమైనది!—మిక్కిలి సువాసనగలది!!

ఎక్కువ సౌందర్యపోషకమైనది!!!

ఆదర్శప్రాయమైన యిట్టి సబ్బు

మీకుం గావలసినచో

మైసూరు గవర్నమెంటు సోపు ఫ్యాక్టరీ

వారికి

నేడే వ్రాయుడు

హిజ్ ఎక్సెలెన్సీ బర్మాగవర్నరుగారికి

కావలసిన సబ్బులను తయారుచేసియిచ్చుటకు నియమింపఁబడినవారు

ఈ ఫ్యాక్టరీవారే!!!

ఏజంట్లు:—బెస్టు & కంపెనీ (లిమిటెడ్)

మదరాసు, కాకినాడ.

ఉత్తరసర్కారులకు సబుఏజంట్లు:—

(1) పైడా చినవెంకటరామన్న & బ్రదర్సు, కాకినాడ.

(2) ఆలపాటి రామమూర్తి, బెజవాడ.